ninadamnews.com

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం 27 జులై 2026 | సంపుటి: 22 | సంచిక: 299 | వెల: రూ.7 | పేజీలు: 12+12

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## వయోపరిమితి తగ్గింపుపై
# ఆగస్టులో అసెంబ్లీ తీర్మానం

- శాసనసభ, లోక్‌సభ ఎన్నికల వయోపరిమితి 21కి తగ్గించాలని రేవంత్ డిమాండ్
- 21 ఏళ్లకే ఐఏఎస్, మేయర్లు అవుతున్నప్పుడు ఎమ్మెల్యేలు ఎందుకు కాకూడదని ప్రశ్న
- ఆగస్టులో అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్న సీఎం
- గుజరాత్‌లాగే తెలంగాణ అభివృద్ధిపై కేంద్రం దృష్టి పెట్టాలని విజ్ఞప్తి




2

## గడ్చిరోలిలో మావోయిస్టుల కదలికలు..
# కలకలం

### జూలై 30 వరకు జిల్లా బంద్‌కు పిలుపు

### భామ్రాగడ్ అటవీ ప్రాంతంలో పోస్టర్లు
### అప్రమత్తమైన పోలీసులు..
### రంగంలోకి సీ-60 కమాండో దళాలు



*తెలంగాణ రాష్ట్ర సరిహద్దు మహారాష్ట్రలో మావోయిస్టుల కదలికలు మరోసారి కలకలం రేపాయి. గడ్చిరోలి జిల్లాలోని భామ్రాగడ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల పోస్టర్లు ప్రత్యక్షం కావడంతో స్థానికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఆదివాసీల 'జల్–జంగల్–జమీన్' హక్కుల పరిరక్షణ, స్థానిక సమస్యల పరిష్కారం కోసం నిరసనగా ఈ పోస్టర్లు విడుదల చేసినట్లు సమాచారం.*

**- జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (నినాదం)**




కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ జూలై 30 వరకు గడ్చిరోలి జిల్లా వ్యాప్తంగా బంద్ పాటించాలని మావోయిస్టులు పిలుపునిచ్చినట్లు పోస్టర్లలో పేర్కొన్నారు. అత్యవసర సేవలకు మినహాయింపు ఇచ్చి, మిగిలిన రవాణా వ్యవస్థలు, వ్యాపార సముదాయాలు మూసి వేయాలని వారు సూచించినట్లు తెలుస్తోంది. మావోయిస్టుల బంద్ పిలుపు నేపథ్యంలో గడ్చిరోలి పోలీసులు అప్రమత్తమయ్యారు. సీ–60 కమాండో దళాలు రంగంలోకి దిగగా.. సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా బలగాలను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. భామ్రాగడ్, అహేరి, ఏటపల్లి తదితర అటవీ ప్రాంతాల్లో భద్రతా బలగాలు విస్తృతంగా కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి. అనుమానాస్పద కదలికలపై నిఘా పెంచడంతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. మావోయిస్టుల బంద్ పిలుపుపై ప్రజలు ఎలాంటి పుకార్లను నమ్మవద్దని, భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని అధికారులు సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో భద్రతా పరిస్థితులను పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు



### ఇరాన్‌పై దాడుల విషయంలో
# వెనక్కితగ్గిన అమెరికా


**కరిగిపోతున్న ఎయిర్ డిఫెన్స్ క్షిపణుల నిల్వలు**

**ఆందోళనలో ట్రంప్**

2

ఇరాన్‌పై దాడుల విషయంలో అమెరికా కొంచెం వెనక్కితగ్గింది. తమ వద్దనున్న ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల్లో క్షిపణుల నిల్వలు తగ్గిపోతున్నాయనే ఆందోళనల నేపథ్యంలోనే ఇరాన్‌పై సైనిక చర్యలు తీవ్రం చేసే ప్రణాళికలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది. సీనియర్ సలహాదారులతో సమావేశం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. అమెరికా దళాలు, స్థావరాల రక్షణ కోసం పోరాడితే నిల్వలు వేగంగా కరిగిపోవచ్చని సైనికాధికారులు హెచ్చరించిన నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం ఆందోళన చెందుతోంది.

**- వాషింగ్టన్ (నినాదం)**



### పాకిస్థాన్‌తో పీవోకేపైన మినహా
# మరే చర్చల్లేవ్

**రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్**

2

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్తాన్ పై తీవ్ర విమర్శలు గుప్పించారు. పీవోకేపైన మినహా పాకిస్థాన్‌తో భవిష్యత్తులో మరే అంశంపైన చర్చలు ఉండవని అన్నారు. భారత్ ఇన్నోవేషన్, స్టార్టప్‌లు, స్పేస్ మిషన్ల వైపు అడుగులు వేస్తుంటే.. పాకిస్థాన్ మాత్రం చొరబాటు మార్గాలను వెతుక్కుంటోందని ఎద్దేవా చేశారు. మనం డేటా సెంటర్లను నిర్మిస్తుంటే.. వాళ్లు ఉగ్రవాద కేంద్రాలను అభివృద్ధి చేసుకుంటున్నారన్నారు.

**- న్యూఢిల్లీ (నినాదం)**

### ప్రైవేట్ కంపెనీలపై
# హెచ్ఆర్‌సీకి అధికారం లేదు



- తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు
- ప్రైవేట్ కంపెనీలపై హెచ్ఆర్‌సీకి విచారణ అధికారం లేదన్న హైకోర్టు
- హెచ్ఆర్‌సీ పరిధి ప్రభుత్వ ఉద్యోగులకే పరిమితమని వెల్లడి
- వెల్స్ ఫార్గో కంపెనీ ఉద్యోగినుల వేధింపుల ఫిర్యాదుపై తీర్పు

2

# శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో విషాదం

### ముప్కాల్ వద్ద బ్యాక్ వాటర్‌లో ఈతకు వెళ్లి నలుగురు మృతి

- ఐదుగురిలో ఒకరు సురక్షితంగా ఒడ్డుకు చేరిక
- స్థానికులు మృతదేహాలను వెలికితీశారు
- ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టిన పోలీసులు



నిజామాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్ పీ) బ్యాక్‌వాటర్‌లో ఈతకు వెళ్లిన నలుగురు యువకులు నీట మునిగి మృతి చెందారు. వీరితో పాటు వెళ్లిన మరో యువకుడు సురక్షితంగా ఒడ్డుకు చేరుకోవడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.

2 **- బాల్కొండ (నినాదం)**

## రక్షణ ఉత్పత్తులు, ఎగుమతుల్లో
# కొత్త శిఖరాలకు భారత్

### కార్గిల్ వార్‌లో దేశ సైనికులు వీరోచితంగా పోరాడారని కితాబు

### మన్ కీ బాత్‌లో మోదీ ప్రసంగం

*భారత్ ఒక విశ్వసనీయమైన ప్రపంచ రక్షణ భాగస్వామిగా ఎదుగుతోందని నరేంద్ర మోదీ తెలిపారు. దేశం తన రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకుంటూనే ఉందన్నారు. అలాగే నేడు యావత్ దేశం 'కార్గిల్ విజయ్ దివస్' జరుపుకుంటున్న సందర్భంగా కార్గిల్ యుద్ధంలో శత్రువులతో వీరోచితంగా పోరాడిన భారత సైనికులకు ఘన నివాళులు అర్పించారు.*



1999లో పాకిస్థాన్‌తో జరిగిన సంఘర్షణలో కఠిన వాతావరణ పరిస్థితులు, శత్రువు నుంచి సవాళ్లు ఎదురైనప్పటికీ దేశ సైనికులు అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించారని కొనియాడారు. కార్గిల్ విజయ్ దివస్ దేశానికే గర్వకారణమని పేర్కొన్నారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ సాయుధ దళాలు ప్రదర్శించిన అసాధారణ ధైర్యసాహసాలను కార్గిల్ విజయ్ దివస్ అందరికీ గుర్తుచేస్తుందని అన్నారు. ఆదివారం ప్రసారమైన 136వ 'మన్ కీ బాత్' ఎపిసోడ్‌లో మోదీ ఈ మేరకు వ్యాఖ్యానించారు.

2 **- న్యూఢిల్లీ (నినాదం)**

### పరీక్షా విధానంలో సంస్కరణలకు
# హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్

**నందన్ నీలేకని నేతృత్వంలో ప్రత్యేక కమిటీ: మోదీ**



2

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ దుమారం రేపిన వేళ కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు వేగవంతం చేసింది. ఈ క్రమంలోనే పరీక్షా విధానంలో సంస్కరణలపై సిఫార్సులకు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. **- న్యూఢిల్లీ (నినాదం)**

# రాజకీయాలు అవినీతిమయం

### ఇకపై నేను ఎన్నికల్లో పోటీ చేయను: సిద్ధరామయ్య



2

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపై కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత రాజకీయాలు అవినీతి మయం అయ్యాయని 2028 అసెంబ్లీ ఎన్నికలు సహా భవిష్యత్తులో ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయబోనని ప్రకటించారు. వయసుతో పాటు అనారోగ్య సమస్యలు కూడా ఒక కారణమని తెలిపారు.

**- బెంగళూరు (నినాదం)**




### కూటమి పాలనకు
# రెండేళ్లు

### నేటి నుంచి టీడీపీ ఇంటింటి ప్రచారం

- నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- 45 రోజుల పాటు డోర్ టు డోర్ ప్రచారం
- ప్రభుత్వ విజయాలను, హామీల అమలును ప్రజలకు వివరించాలని నేతలకు చంద్రబాబు ఆదేశం

2



# షర్మిలకు శస్త్ర చికిత్స

**త్వరగా కోలుకోవాలి: చంద్రబాబు, పవన్, లోకేశ్**

2

### కొమురవెల్లిలో
# 'రైల్వే' శకం ప్రారంభం

### ₹6 కోట్లతో నూతన రైల్వే స్టేషన్ ప్రారంభించిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్



- మరో ₹80 కోట్లతో ప్లాట్‌ఫారమ్ విస్తరణ
- ₹300 కోట్లతో రైల్వే లైన్ విద్యుతీకరణ"
- "మల్లన్న సన్నిధికి ప్రగతి బాట...
- రైలు కూతతో మారిన కొమురవెల్లి ముఖచిత్రం"

**కొమురవెల్లి మండలం జూలై 26 (నినాదం):** తెలంగాణలో ప్రముఖ శైవక్షేత్రంగా పేరుగాంచిన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం అభివృద్ధిలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. కొమురవెల్లి క్షేత్రానికి విచ్చేసే లక్షలాది మంది భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై స్టేషన్‌ను

- మిగతా 2 లో

# చెర్వుగట్టులో భారీ అగ్నిప్రమాదం!

### నల్గొండ జిల్లా నార్కట్ పల్లిలో అర్ధరాత్రి వేళ ఘటన

- 17 దుకాణాలు, 15 తోపుడు బండ్లు దహనం
- పేలిన రెండు సిలిండర్లు, కాలి బూడిదైన పంచాయతీ ఫైళ్లు
- 3 ఫైర్ ఇంజిన్లతో మంటలు అదుపు చేసిన సిబ్బంది.. రూ. 2.5 కోట్ల ఆస్తి నష్టం!

2



## వయోపరిమితి తగ్గింపుపై ఆగస్టులో అసెంబ్లీ తీర్మానం

**హైదరాబాద్, జులై 26 (నినాదం):**
యువతను చట్టసభల్లోకి పెద్ద ఎత్తున తీసుకురావాలనే లక్ష్యంతో, శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయోపరిమితిని 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 21 ఏళ్లకే యువత సివిల్ సర్వెంట్లుగా, మేయర్లుగా బాధ్యతలు చేపడుతున్నప్పుడు, వారికి చట్టసభల్లో పోటీ చేసే అవకాశం ఎందుకు ఇవ్వకూడదని ఆయన ప్రశ్నించారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రేవంత్ రెడ్డి ఈ విషయాలు వెల్లడించారు. "21 ఏళ్లకే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, జిల్లా పంచాయతీ చైర్‌పర్సన్‌లుగా నియమిస్తున్నాం. అలాంటప్పుడు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి ఎందుకు అనుమతించకూడదు? దేశ జనాభాలో దాదాపు 30 శాతం ఉన్న 'జెన్-జీ' తరం గొంతుక చట్టసభల్లో వినిపించాలి. వారికి ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, మంత్రులుగా పనిచేసే అవకాశాలు రావాలి" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై ఆగస్టు మొదటి వారంలో రాష్ట్ర శాసనసభ, మండలి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, వయోపరిమితి తగ్గింపు కోరుతూ ఒక తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపిస్తామని సీఎం ప్రకటించారు. గతంలో రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించారని, ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేసే వయసును తగ్గించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన గుర్తుచేశారు. ఇదే సందర్భంగా తెలంగాణ అభివృద్ధిపైనా రేవంత్ మాట్లాడారు. రీజనల్ రింగ్ రోడ్, మెట్రో రైల్, మూసీ నది అభివృద్ధి వంటి ప్రాజెక్టులపై తుది నిర్ణయాలు రావాల్సి ఉందని తెలిపారు. "ప్రధాని మోదీ ఈ దేశానికి ప్రధాని. ఆయన గుజరాత్‌ను, తెలంగాణను వేర్వేరుగా చూడకూడదు. గుజరాత్ తరహాలోనే తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలి. వికసిత భారత్ లక్ష్యంలో తెలంగాణ 10 శాతం వాటా అందించాలని కోరుకుంటున్నాను" అని ఆయన పేర్కొన్నారు.

## పాకిస్థాన్‌తో పీవోకేపైన మినహా మరే చర్చల్లేవ్

పాకిస్థాన్‌తో చర్చలంటూ జరిగితే అది పీవోకే కోసమే తప్ప మరే విషయంలోనూ జరగబోవని పేర్కొన్నారు. పీవోకేను పాక్ అక్రమంగా ఆక్రమించుకుందని మండిపడ్డారు. కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని యుద్ధ స్మారక చిహ్నం వద్ద మాట్లాడుతూ కేంద్రమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. 1999లో కార్గిల్ యుద్ధంలో దేశం సాధించిన విజయాన్ని భారతమాత కిరీటంలో పొదిగిన వజ్రంగా అభివర్ణించారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని తమ దేశ విధానంలో ఒక భాగంగా మార్చుకుందని రాజ్‌నాథ్ సింగ్ దుయ్యబట్టారు. ఉగ్రవాదులను అడ్డు పెట్టుకొని భారత్‌ను బెదిరించడానికి ప్రయత్నిస్తే ఏమవుతుందో ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచమంతా చూసిందన్నారు. పాక్ చేసే ఏ దుస్సాహస చర్యకైనా వారి ఊహకందని రీతిలో మన సైన్యం ప్రతిస్పందిస్తుందన్నారు. ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్.. ఇలా ఉగ్రవాద చర్యలపై భారత్ తీవ్రంగా స్పందించిందని గుర్తుచేశారు. 27వ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్‌తోపాటు ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఇతర ఆర్మీ అధికారులు అమరవీరులకు నివాళులర్పించారు.

## శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో విషాదం

వివరాల్లోకి వెళితే, ముప్కాల్ సమీపంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వెనుక జలాల్లోకి ఐదుగురు యువకులు ఆదివారం సాయంత్రం ఈతకు వెళ్లారు. నీటి లోతును అంచనా వేయలేకపోవడంతో నలుగురు గల్లంతయ్యారు. వారిలో ఒకరు ప్రాణాలతో బయటపడి ఒడ్డుకు చేరుకున్నారు. అతని సమాచారంతో స్థానికులు వెంటనే స్పందించి గాలింపు చేపట్టారు. కొద్దిసేపటికే నలుగురి మృతదేహాలను స్థానికులు వెలికితీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. మృతుల్లో ముగ్గురు నిజామాబాద్ పట్టణానికి చెందిన వారిగా ప్రాథమికంగా గుర్తించారు. ఈ ఘటనతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## షర్మిలకు శస్త్ర చికిత్స

**విజయవాడ, జులై 26 (నినాదం):**
శస్త్ర చికిత్స అనంతరం వేగంగా కోలుకుంటున్నట్టు ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల 'ఎక్స్' వేదికగా తెలిపారు. ఇటీవల వైద్యులు ఆమెకు ఉదర శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు. చికిత్స అనంతరం వేగంగా కోలుకుంటున్నట్టు షర్మిల స్వయంగా వెల్లడించారు. ఈ క్లిష్ట సమయంలో తన ఆరోగ్యం గురించి ఆరా తీస్తూ.. త్వరగా కోలుకోవాలని కాంక్షించిన శ్రేయోభిలాషులు, మద్దతుదారులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి ఆత్మీయత, ప్రార్థనలు, మద్దతు తనకు కొండంత అండగా నిలిచాయని షర్మిల పేర్కొన్నారు.

**షర్మిల త్వరగా కోలుకోవాలి: చంద్రబాబు, పవన్, లోకేశ్**

వైఎస్ షర్మిల త్వరగా కోలుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు. ఆమెకు మంచి ఆరోగ్యం చేకూరాలని.. మనోధైర్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని చంద్రబాబు పేర్కొన్నారు. షర్మిల సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా ప్రజా జీవితంలోకి రావాలని కోరుకుంటున్నట్లు పవన్, లోకేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.



## చెర్వుగట్టులో భారీ అగ్నిప్రమాదం!

**నార్కట్‌పల్లి, జులై 26 (నినాదం):**
నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామివారి ఆలయ గుట్ట కింద ఉన్న ఓ దుకాణంలో చెలరేగిన మంటలు క్షణాల్లోనే భారీగా ఎగసిపడ్డాయి. పక్కనే ఉన్న17 దుకాణాలు, 15 తోపుడు బండ్లను బూడిద చేశాయి. మంటల ధాటికి దుకాణాల్లో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లు బాంబుల్లా పేలడంతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది. అగ్నికీలలు పక్కనే ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయానికి సైతం విస్తరించాయి. దీంతో అందులో ఉన్న కీలక ఫైళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక యంత్రాంగం రంగంలోకి దిగింది. మూడు ఫైర్ ఇంజిన్లతో సిబ్బంది గంటల పాటు శ్రమించి మంటలను అదుపుచేశారు. ఈ దుర్ఘటనలో దాదాపు రూ. 2.5 కోట్ల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని సర్పంచ్ వెల్లడించారు. ప్రమాదం అర్ధరాత్రి జరగడం, దుకాణాల్లో వ్యాపారులు ఎవరూ పడుకోకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

# రక్షణ ఉత్పత్తులు, ఎగుమతుల్లో కొత్త శిఖరాలకు భారత్

ఈ నెల (జులై)లో డీఆర్‌డీఓ పినాకా దీర్ఘశ్రేణి గైడెడ్ రాకెట్‌ను విజయవంతంగా పరీక్షించిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ఈ విజయం వెనుక భారత శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల సమష్టి కృషి ఉందని అభిప్రాయపడ్డారు. కేవలం రెండు- మూడు రోజుల క్రితమే డీఆర్‌డీఓ కుశ క్షిపణిని కూడా సక్సెస్‌ఫుల్‌గా పరీక్షించిందని తెలిపారు. కొన్ని రోజుల క్రితం ఐఎన్ఎస్ మహేంద్రగిరిని భారత నౌకాదళంలోకి ప్రవేశపెట్టారని హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆధునిక యుద్ధనౌకను దేశంలోనే రూపకల్పన చేసి నిర్మించారని పేర్కొన్నారు. ఈ యుద్ధనౌక తయారీలో 75 శాతానికి పైగా స్వదేశీ పరికరాలను ఉపయోగించారని, ఇది పెరుగుతున్న 'ఆత్మనిర్భర్ భారత్' బలానికి ప్రతీక అని అభివర్ణించారు.



**'యువ ఆవిష్కర్తలు దూసుకెళ్తున్నారు'**

"జులై 18న దేశ తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1'ను శ్రీహరికోటలో విజయవంతంగా ప్రయోగించడంతో భారత్‌లోని ప్రతి పౌరుడు గర్వంతో ఉప్పొంగిపోయాడు. దేశ అంతరిక్ష రంగంలోని ఈ చరిత్రాత్మక ఘట్టానికి ప్రతి ఒక్కరూ సాక్షులుగా నిలిచారు. ప్రైవేట్ సంస్థ అభివృద్ధి చేసిన భారతదేశపు మొట్టమొదటి రాకెట్ ఇది. ఒకప్పుడు ఊహకు కూడా అందని దానిని మన యువ ఆవిష్కర్తలు నిజం చేసి చూపించారు. యువ ఆవిష్కర్తలు అద్భుతమైన నైపుణ్యం, ఫ్యాషన్‌ను కనబర్చారు" అని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

**కామన్వెల్త్ గేమ్స్‌లో భారత అథ్లెట్లు పతకాలు సాధించాలి : మోదీ**

ఈ ఏడాది జులై 4న ప్రారంభించిన దేశవ్యాప్త 'క్యాచ్ ది రెయిన్' ప్రచారం గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజల ఉత్సాహభరితమైన భాగస్వామ్యంతో వర్షపు నీటి సేకరణ, భూగర్భ జలాల పునరుజ్జీవనం, సంప్రదాయ జలాశయాల పునరుద్ధరణ, పెద్ద ఎత్తున మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. అలాగే గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్‌లో భారత అథ్లెట్స్ అద్భుతమైన ప్రదర్శన చేసి మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు పతకాలు గెలిచి దేశానికి గర్వకారణంగా నిలవాలని కోరారు.

**'పీవీ సింధు, టీమ్‌ఇండియా మహిళల క్రికెట్ జట్టుకు అభినందనలు'**

జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టైటిల్ గెలిచిన తొలి భారతీయురాలిగా నిలిచిన పీవీ సింధును మోదీ అభినందించారు. లండన్‌లోని లార్డ్స్‌లో చారిత్రక తొలి టెస్ట్ విజయాన్ని నమోదు చేసిన టీమ్‌ఇండియా మహిళల క్రికెట్ జట్టునూ ప్రశంసించారు. స్థానికంగా లభించే సహజ మట్టితో చేసిన విగ్రహాలను పూజించి గణేశ్ చతుర్థిని ఆనందంగా జరుపుకోవాలని దేశ పౌరులకు మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవమని, ఈ సందర్భంగా నేత కార్మికులకు ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది ఆగస్టు 15న ప్రతి ఇంటిలో జాతీయ జెండాను సగర్వంగా ఎగరవేయడం ద్వారా 'హర్ ఘర్ ' ప్రచారంలో పాల్గొనాలని కోరారు.

## కొమురవెల్లిలో 'రైల్వే' శకం ప్రారంభం





**మొదటి పేజీ తరువాయి..**

ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేవలం రెండు సంవత్సరాల వ్యవధిలోనే ఆలయ శైలి ప్రవేశ ద్వారంతో ₹6 కోట్ల వ్యయంతో ఈ రైల్వే స్టేషన్‌ను పూర్తి చేసి భక్తులకు అంకితం చేయడం చారిత్రాత్మక ఘట్టమని అన్నారు. హైదరాబాద్ నుంచి ₹20 లకే మల్లన్న దర్శనం: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఈ స్టేషన్ ఎంతో సౌకర్యవంతం. హైదరాబాద్ నుంచి కేవలం ₹20 లకే కొమురవెల్లికి చేరుకోవచ్చు.ప్రస్తుతం డీజిల్‌తో నడుస్తున్న ఈ రైల్వే లైన్‌ను ₹300 కోట్లతో విద్యుతీకరణ చేస్తాం.ఈ ప్రాంతాన్ని జాతీయ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని వర్గాలు కృషి చేయాలి."

**మోదీ పాలనలో రైల్వేల్లో నూతన శకం: కేంద్ర మంత్రి బండి సంజయ్**

దేవుడి దగ్గరకు వెళ్లే దారి సులభమైతే భక్తి మరింత పెరుగుతుంది. మోదీ గారి 12 ఏళ్ల పాలనలో తెలంగాణ రైల్వేలకు ₹36,286 కోట్లు ఖర్చు చేశాం.గత యూపీఏ హయాంలో తెలంగాణకు ₹258 కోట్లు మాత్రమే ఇస్తే, ఈ బడ్జెట్‌లో ఏకంగా ₹5,454 కోట్లు కేటాయించాం.తెలంగాణకు 3 బుల్లెట్ రైళ్లు (హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-పూణే) రాబోతున్నాయి. వీటి కోసం ₹1.5 లక్షల కోట్లతో హైస్పీడ్ కారిడార్ నిర్మిస్తున్నాం.

ప్రగతి పట్టాలు: రైల్వే స్టేషన్‌తో భక్తులకే కాకుండా స్థానిక రైతులు, వ్యాపారులు, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

కాజీపేట ఘనత: ₹521 కోట్లతో నిర్మిస్తున్న కాజీపేట తయారీ యూనిట్‌లో భవిష్యత్తులో నూతన తరం ఇంటర్‌సిటీ రైళ్లు తయారవుతాయి.

కవచ్ మరియు ఆధునీకరణ: తెలంగాణలో ₹2,000 కోట్లతో 40 స్టేషన్ల ఆధునీకరణ.. ₹1,122 కోట్లతో యాదాద్రి వరకు MMTS విస్తరణ.

రాజకీయ వ్యాఖ్యలు: కేంద్ర నిధులను సద్వినియోగం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వాలని, విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలని పిలుపు

ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు కె. లక్ష్మణ్, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, కొమురవెల్లి సర్పంచ్ గొల్లపల్లి పద్మ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ కంపెనీలపై హెచ్‌ఆర్‌సీకి అధికారం లేదు

**హైదరాబాద్, జులై 26 (నినాదం):**
ప్రైవేట్ కంపెనీలు, వాటి ఉద్యోగులపై వచ్చే ఫిర్యాదులను విచారించే అధికారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు (హెచ్‌ఆర్‌సీ) లేదని తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. హెచ్‌ఆర్‌సీ పరిధి కేవలం ప్రభుత్వ ఉద్యోగులు, వారి నిర్లక్ష్యానికి సంబంధించిన అంశాలకే పరిమితమని ఈ సందర్భంగా స్పష్టం చేసింది. వెల్స్ ఫార్గో ఇంటర్నేషనల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేస్తున్న ఇద్దరు మహిళా ఉద్యోగులు, తమకు పనిప్రదేశంలో వేధింపులు ఎదురయ్యాయని ఆరోపిస్తూ హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించారు. దీనిపై హెచ్‌ఆర్‌సీ జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తూ సదరు సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఉద్యోగ వివాదాలు, పనితీరు మదింపు వంటివి యజమాని, ఉద్యోగుల మధ్య ఉండే అంతర్గత వ్యవహారాలని ధర్మాసనం పేర్కొంది. ఇటువంటి సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ప్రత్యేక చట్టపరమైన వేదికలు ఉన్నాయని తెలిపింది. ఆరోపణల తీవ్రతను బట్టి హెచ్‌ఆర్‌సీ తన అధికార పరిధిని విస్తరించుకోలేదని అభిప్రాయపడింది. ముఖ్యంగా పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల వంటి ఫిర్యాదులకు 'పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోష్ చట్టం)' సరైన మార్గమని ధర్మాసనం సూచించింది. బాధితులు ఆ చట్టం కింద ఏర్పాటైన అంతర్గత కమిటీలను ఆశ్రయించాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, హెచ్‌ఆర్‌సీ ముందు పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను కొట్టివేస్తూ, కంపెనీ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. అయితే, బాధితులు ఇతర చట్టాల ద్వారా న్యాయం పొందేందుకు స్వేచ్ఛ ఉందని తీర్పులో పేర్కొంది.

## విద్యా శాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి: రామచందర్ రావు



**హైదరాబాద్, జులై 26 (నినాదం):**
ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు చెల్లించని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా శాఖ మంత్రిగా రాజీనామా చేయాలని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ తివోలి గార్డెన్స్‌లో ఎంపీ ఈటలతో కలసి కార్గిల్ విజయ్ దివస్‌లో పాల్గొన్నారు. దిల్లీలో జరిగిన విద్యార్థుల నిరసనల్లో విదేశీ హస్తం ఉందనీ ఆరోపించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ఆయన వ్యక్తిగత విషయమన్నారు.

# కూటమి పాలనకు రెండేళ్లు

**విజయవాడ, జులై 26 (నినాదం):**
ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రేపటి నుంచి (సోమవారం) 45 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'డోర్ టు డోర్' కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ ముఖ్యనేతలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ బృహత్ కార్యక్రమంలో అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మంత్రుల నుంచి బూత్ స్థాయి కన్వీనర్ల వరకు పార్టీ యంత్రాంగం మొత్తం ఈ అవుట్ రీచ్ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ప్రజలు కూటమికి చారిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టారని గుర్తుచేశారు. "94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్లతో మనం గెలిచాం. నాటి ప్రభుత్వ విధ్వంసం, ఘోర తప్పిదాల వల్లే 151 సీట్ల పార్టీ 11 సీట్లకు పడిపోయింది" అని ఆయన వ్యాఖ్యానించారు. కూటమి పార్టీల పోరాటాలు, ఎన్నికల వ్యూహాల వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైందని తెలిపారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో ప్రజలకు మరింత చేరువ కావాలని పిలుపునిచ్చారు. "ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఎలాగైతే ప్రతి ఇంటికి వెళ్లారో, ఇప్పుడు



కూడా అదే విధంగా వెళ్లి మనం ఇచ్చిన హామీలను ఎలా అమలు చేస్తున్నామో చెప్పాలి. ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి" అని సూచించారు.

**నాకు కావాల్సింది అనుచరులు కాదు!**

పార్టీలో నాయకత్వ పటిమను పెంచుకోవాల్సిన ఆవశ్యకతను చంద్రబాబు నొక్కిచెప్పారు. "నాకు కావాల్సింది అనుచరులు కాదు, పార్టీకి నాయకులు కావాలి. సమస్యలకు పరిష్కారం చూపే నైపుణ్యాలను అలవర్చుకోవాలి. కష్టంతో కాకుండా ఇష్టంతో పనిచేస్తూ ప్రజలు, కార్యకర్తలతో సన్నిహితంగా మెలగాలి" అని ఆయన హితవు పలికారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదేశించారు.

గొడ్డలి పార్టీవిధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని చంద్రబాబు కోరారు. "ఘోర ఓటమి చవిచూసినా ఆ పార్టీ ఇప్పటికీ సమాజంలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తోంది. వారి విధ్వంసకర విధానాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి. యువతను వారు ఏ విధంగా నిర్వీర్యం చేశారో, యువత భవిత కోసం కూటమి ప్రభుత్వం ఏం చేస్తుందో ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి" అని ఆయన అన్నారు. ప్రజలతో నిరంతరం మమేకమైతేనే ప్రతిపక్ష కుట్రలను ఎండగట్టగలమని స్పష్టం చేశారు. "మళ్లీ కూటమి అధికారంలోకి రావడం ఖాయం, కానీ ఏమరుపాటు వద్దు. రాష్ట్రం కోసం కూటమి ప్రభుత్వం కొనసాగాల్సిన ఆవశ్యకతను ప్రతి ఒక్కరికీ వివరించాలి" అని ఉద్ఘాటించారు. ప్రజల్లో ఉండటాన్ని ప్రతి నాయకుడు బాధ్యతగా స్వీకరించాలని కర్తవ్య బోధ చేశారు.

**గొడ్డలి పార్టీ నేతలతో వేదికలు పంచుకోవద్దు: సీఎం చంద్రబాబు**

గొడ్డలి పార్టీ నేతలతో ఎట్టి పరిస్థితుల్లోనూ వేదికలు పంచుకోవద్దని సీఎం చంద్రబాబు పార్టీ నేతలకు ఆదేశించారు. తెదేపా ముఖ్యనేతలతో సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొడ్డలి పార్టీ విష వృక్షమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. నిత్యం కులాలు, మతాలను అడ్డం పెట్టుకుని విద్వేషాలు రగిలించడమే ఆ పార్టీ పనిగా పెట్టుకుందని విమర్శించారు. గొడ్డలి పార్టీ ట్రాప్‌లో పడొద్దని నేతలకు చంద్రబాబు హితవు పలికారు.

## ఇరాన్‌పై దాడుల విషయంలో వెనక్కితగ్గిన అమెరికా

ప్రస్తుత యుద్ధంలో ఇరాన్ చౌకగా తయారు చేసిన డ్రోన్లను భారీ సంఖ్యలో వినియోగిస్తోంది. ఒక్కో డ్రోన్ ధర కేవలం 20వేల నుంచి 50వేల డాలర్లలోపే. అయితే వీటిని ఎదుర్కోవడానికి అమెరికా వినియోగిస్తున్న ఒక్కో ఇంటర్‌సెప్టర్ క్షిపణి ధర మాత్రం 1.5 మిలియన్ డాలర్ల పైమాటే. ఆర్థికపరమైన ఈ అంతరం యుద్ధంలో అమెరికాపై ప్రభావం చూపనుందని నిపుణులు అంటున్నారు. అంతే కాకుండా గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు తీవ్రం చేయడంతో అమెరికాకు చెందిన అనేక స్థావరాలు దెబ్బతిన్నాయి. వాటిని రక్షించడానికి పేట్రియాట్ ఎయిర్ డిఫెన్స్ ఇంటర్‌సెప్టర్‌లు ఇతర ఆయుధాలను పెద్ద మొత్తంలో ఉపయోగించింది. ఫలితంగా ప్రస్తుతం ఆయా ఆయుధాల కొరత ఏర్పడింది. ఈ దాడులు ఇలాగే కొనసాగితే పశ్చిమాసియా దేశాల్లో సైనిక కార్యకలాపాలను పర్యవేక్షించే యూఎస్ సెంట్రల్ కమాండ్ కు అందుబాటులో ఉన్న ఇంటర్‌సెప్టర్ నిల్వలు గణనీయంగా తగ్గిపోతాయని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కెయిన్ హెచ్చరించినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి.

తాజాగా ఓ ఇంటర్వ్యూలో వైట్ హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవెన్ చెంగ్ మాట్లాడుతూ యుద్ధాన్ని కొనసాగించడం కంటే ట్రంప్ దౌత్యపరమైన పరిష్కారాన్నే ఇష్టపడతారని పేర్కొన్నారు. కానీ గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగిస్తే మాత్రం అమెరికా తగిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. మరోవైపు యుద్ధం విషయంలో మధ్యవర్తిత్వం వహించమని శనివారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఖతార్, పాకిస్థాన్‌లను కోరినట్లు తెలుస్తోంది.

# రాజకీయాలు అవినీతిమయం

ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి తనకు 82 ఏళ్లు వస్తాయని సిద్ధరామయ్య తెలిపారు. గతంలో లాగా ఉత్సాహంతో పని చేయడం తనకు ఇక సాధ్యం కాదని రాసుకొచ్చారు. ఎన్నికల్లో పోటీ చేయకపోయినా ప్రజా జీవితంలో చురుగ్గా ఉంటానని అన్నారు. ప్రజల తరఫున గళం వినిపిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. అయితే, వరుణ నియోజకవర్గం నుంచి మళ్లీ పోటీ చేయాలని ప్రజలు కోరినప్పటికీ వాటిని తిరస్కరించినట్లు సిద్ధరామయ్య వెల్లడించారు. గతంలో తాను పోటీ చేసినప్పుడు ప్రజలే విరాళాలు సేకరించి తనను గెలిపించారని అన్నారు. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేస్తే ప్రజలకే డబ్బులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. నేటి రాజకీయాలు పూర్తిగా భ్రష్టుపట్టాయని, నిజాయతీకి చోటు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు సిద్ధరామయ్య వివరించారు. మాండ్య జిల్లా కేఆర్ పేటలో శనివారం జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో సిద్ధరామయ్య ఈ వ్యాఖ్యలు చేయగా, ఆ తర్వాత తన నిర్ణయాన్ని వివరిస్తూ ఎక్స్‌లో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.

**'ఆ సంతృప్తి నాకు ఉంది'**

కాగా, కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు సిద్ధరామయ్య మే 28న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. అనంతరం డీ.కే. శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. అయితే, రాజీనామా అనంతరం కాంగ్రెస్ అధిష్ఠానం ఆఫర్ చేసిన రాజ్యసభ సీటును తాను సున్నితంగా తిరస్కరించానని సిద్ధరామయ్య చెప్పారు. తాను 1978లో తాలూకా బోర్డు సభ్యుడిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించానని, విజయాలు, ఓటములు రెండింటినీ చూశానని పేర్కొన్నారు. కానీ, తాను నమ్మిన సూత్రాలకు విరుద్ధంగా ఎప్పుడూ ప్రవర్తించకపోవడం, అంతరాత్మకు ద్రోహం చేయకపోవడం అనే సంతృప్తి ఉందని తెలిపారు. ఇదిలా ఉండగా, కొన్ని నెలల క్రితం సిద్ధరామయ్య స్వచ్ఛందంగా కర్ణాటక సీఎం పదవి నుంచి వైదొలిగారు. అనంతరం ఆయన్ను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడిగా నియమిస్తున్నట్లు పార్టీ ప్రకటించింది. ప్రస్తుతం డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

**మంత్రివర్గ విస్తరణ- దిల్లీకి సీఎం**

ఇదిలా ఉండగా, రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు సమయం ఆసన్నమవుతున్న వేళ ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోమవారం దిల్లీకి బయలుదేరనున్నారు. అక్కడ పార్టీ పెద్దలతో సమావేశమై మంత్రివర్గ విస్తరణకు పచ్చజెండా ఊపే అవకాశం ఉంది. కర్ణాటక భవన్‌లో కేంద్ర మంత్రులు, కర్ణాటకకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలతో సమావేశం కానున్నారు. అనంతరం, పెండింగ్‌లో ఉన్న మంత్రివర్గ విస్తరణకు అనుమతి కోరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై రాహుల్ గాంధీతో చర్చించే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి.

అయితే, మంత్రి పదవి కోసం కొంతమంది ఎమ్మెల్యేలు చివరి నిమిషంలో లాబీయింగ్ చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నారని సమాచారం. ఇందుకోసం దిల్లీకి పయనమయినట్లు సమాచారం. కాగా, గత వారం, నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీకి సంబంధించి రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన ఆందోళన కారణంగా, ముఖ్యమంత్రి డీకే, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కేపీసీసీ అధ్యక్షుడు బీకే హరిప్రసాద్ మంత్రివర్గ విస్తరణపై చర్చించలేకపోయారు. ఇప్పుడు నీట్ పోరాటం ముగిసింది కాబట్టి, రాహుల్ గాంధీతో కలిసి మంత్రివర్గ విస్తరణకు అనుమతి పొంది, మంత్రుల జాబితాను ఖరారు చేసే అవకాశం ఉందని వర్గాలు చెబుతున్నాయి.

## సౌదీలోని అతిపెద్ద రిఫైనరీపై హూతీల దాడి

### చమురు ఉత్పత్తిపై ఎఫెక్ట్

**రియాద్, (నినాదం):**




ఓ వైపు అమెరికా-ఇరాన్ ఘర్షణలతో పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగుతుంటే మరోవైపు సౌదీ అరేబియా- హూతీ తిరుగుబాటుదారుల మధ్య దాడులు ప్రపంచాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇరాన్ మద్దతు గల హూతీ తిరుగుబాటుదారులు ఎర్ర సముద్రంలో దిగ్బంధనాన్ని ప్రకటించారు. సౌదీ అరేబియాలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రాల్లో ఒకటైన అరామ్‌కో రిఫైనరీపై డ్రోన్ దాడి జరిగినట్లు తెలుస్తోంది. రాస్ తనురాలోని ఈ రిఫైనరీని కూడా లక్ష్యం చేసుకున్నట్లు హూతీలు వెల్లడించారు. యెమెన్‌పై సౌదీ జరిపిన వైమానిక దాడులకు వ్యతిరేకంగా ప్రతిదాడులు చేసినట్లు వెల్లడించారు. యెమెన్‌పై దిగ్బంధనం ఎత్తివేసే వరకు ఎర్ర సముద్రంలో నౌకలను అడ్డుకుంటామన్నారు.

దాడి కారణంగా చమురుశుద్ధి కేంద్రం వద్ద భారీగా మంటలు చెలరేగాయి. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఘటన నేపథ్యంలో రిఫైనరీని తాత్కాలికంగా మూసివేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. అయితే, ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చినట్లు సమాచారం. ఈ ఘటనలో ఇప్పటివరకు ఆస్తి, ప్రాణనష్టం వివరాలు తెలియరాలేదు.

# ఏరికోరి కార్యదర్శుల డిప్యూటేషన్లు..!

- అధికార పార్టీ నేతల ఒత్తిడితో బదిలీలకు రంగం?
- పారదర్శకత లేకుండానే ప్రక్రియ సాగుతోందంటూ ఆరోపణలు




**మోతె, జూలై 26 (నినాదం):** మోతె మండలంలోని గ్రామపంచాయతీ కార్యదర్శుల డిప్యూటేషన్ల వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మండలంలో మొత్తం 29 గ్రామపంచాయతీలు ఉండగా, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కొన్ని గ్రామాలు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, మరికొన్ని చోట్ల పోటీ జరిగి అధికార పార్టీ, ప్రతిపక్షాలు, రెబల్ అభ్యర్థులు సర్పంచులుగా ఎన్నికయ్యారు. ఎన్నికల అనంతరం పలు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల డిప్యూటేషన్ల విషయంలో రాజకీయ జోక్యం పెరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ సర్పంచులు, స్థానిక నాయకులు కోరుకున్న కార్యదర్శులను తమ గ్రామాలకు డిప్యూటేషన్‌పై తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. తమకు అనుకూలంగా పనిచేసే కార్యదర్శులను ఎంపిక చేసుకునేందుకు అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్య నేత చక్రం తిప్పుతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనివల్ల నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహిస్తున్న పలువురు కార్యదర్శులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నట్లు సమాచారం. ప్రభుత్వ పథకాల అమలులో, ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తల నియామకాలు తదితర అంశాల్లో అధికార పార్టీ నాయకులు సూచించిన లబ్ధిదారులకే ప్రాధాన్యం ఇవ్వాలని కార్యదర్శులపై ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే కొందరు కార్యదర్శులు నిబంధనల మేరకే వ్యవహరించడంతో వారిని డిప్యూటేషన్ పేరుతో ఇతర గ్రామాలకు పంపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు, కొందరు సర్పంచులు తమకు నచ్చిన కార్యదర్శులను తీసుకురావాలనే ఉద్దేశంతో అధికార పార్టీ నాయకుల సహకారంతో డిప్యూటేషన్లు చేయిస్తున్నారని కూడా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పరిపాలనా అవసరాల కంటే రాజకీయ స్వార్థానికే ఈ ప్రక్రియలో అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. డిప్యూటేషన్ ప్రక్రియలో పారదర్శకత లేకపోవడంతో పలువురు పంచాయతీ కార్యదర్శులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని వారి సహచరులు చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే డిప్యూటేషన్లను వెంటనే నిలిపివేసి, ఇప్పటికే జరిగిన అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# ప్రజల అవసరాలకు అనుగుణంగా మెరుగైన మౌలిక సదుపాయాలు

**బి.ఆర్.ఎస్.ఎల్.పి.విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద**

**స్వేత శుభం సొసైటీ నివాసులతో ఎమ్మెల్యే ఆత్మీయ సమావేశం**





**కుత్బుల్లాపూర్, జూలై 26 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కొంపల్లి మున్సిపల్ సర్కిల్ వార్డు నం. 288 పరిధిలోని స్వేత శుభం సొసైటీని బీఆర్ఎస్ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సందర్శించారు. ఈ సందర్భంగా సొసైటీ అభివృద్ధికి ఎమ్మెల్యే అందించిన సహకారం, నిరంతర మద్దతుకు నివాసులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సొసైటీలో తాగునీటి సరఫరా, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, మెట్రో ఫ్లైఓవర్ పనులు నెమ్మదిగా కొనసాగుతున్న అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కాలనీ వాసుల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సొసైటీకి అనుసంధానంగా నిర్మించనున్న రహదారికి ఇప్పటికే పరిపాలనా అనుమతి లభించిందని, త్వరలోనే ఆ పనులకు ప్రారంభిస్తామని తెలిపారు, అలాగే జయభేరి పార్కులో పికిల్ బాల్ వాకింగ్ ట్రాక్ నిర్మాణం కోసం ప్రణాళికలు రూపొందించి అభివృధి చేయిస్తానని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడం తన బాధ్యతగా భావిస్తూ, నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, ఇంజనీరింగ్ మరియు వాటర్ వర్క్ శాఖా అధికారులు, సొసైటీ చైర్మన్ సృజన రెడ్డి, ఉపచైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సెక్రటరీ రమేష్ కుమార్, కోశాధికారి శివ కుమార్ రెడ్డి, డైరెక్టర్లు ఆచ వినయ్, సభ్యులు జోగారావు, దామోదర్, సుప్రజిత్, వాణి, సొసైటీ వాసులు పాల్గొన్నారు.

**HDFC BANK**

## హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

బ్రాంచ్: నెం. 3-6-310, హైదర్‌గూడ రోడ్, బషీర్‌బాగ్, హైదరాబాద్-500029.
టెలి: 18002100018 / 040-66588491, CINL65920MH1994PLC080618 వెబ్‌సైట్: www.hdfcbank.com

## డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్-2002 (చట్టము) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్-13(2) క్రింద ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచు **హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్** (తేది: 17 మార్చి, 2023 నాటి గౌ॥ ఎన్‌సిఎల్‌టి-ముంబయి వారి ఉత్తర్వు ద్వారా ఆమోదం పొందిన విలీన పథకం క్రింద **హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో** పూర్వపు హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్ వారు విలీనమైనారు) **(హెచ్‌డిఎఫ్‌సి)** యొక్క అధీకృత అధికారి అయిన క్రింది సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద జారీ చేసిన డిమాండ్ నోటీసు ప్రకారము క్రింద తెలియజేసినట్లు సంబంధిత నోటీసు/లుల తేది నుండి 60 రోజులలోగా సంబంధిత డిమాండ్ నోటీసు/లలలో తెలిపిన బకాయి మొత్తమును తిరిగి చెల్లించమని దిగువ తెలిపిన రుణగ్రహీత(లు)/చట్టబద్ధవారసుదు(లు)/ చట్టబద్ధ ప్రతినిధి (లు) లను కోరడమైనది. వివరములు ఈ క్రింది విధముగా తెలియజేయడమైనది. ఈ క్రింది సంతకందారు సదరు రుణగ్రహీత(లు)/చట్టబద్ధవారసుదు(లు)/ చట్టబద్ధ ప్రతినిధి (లు) తెలియబర్చిన ఆఖరి చిరునామాల యొక్క ప్రాంగణంలో ఈ నోటీసులను అతికించడమైనది. అంతేగాక సదరు నోటీసుల కాపీలు ఈ క్రింది సంతకందారు వద్ద లభ్యమగును మరియు రుణగ్రహీత(లు)/చట్టబద్ధవారసుదు(లు)/ చట్టబద్ధ ప్రతినిధి (లు) సంబంధిత సదరు కాపీలు కావల్సిన వారు ఈ క్రింది సంతకందారు నుండి ఏదైనా పని దినములలో కార్యాలయ పని వేళలయందు పొందవచ్చును.
ఇందుకు సంబంధించి సదరు రుణగ్రహీత(లు) అమలు చేయబడిన రుణ ఒప్పందము మరియు ఇతర డాక్యుమెంట్లు/వ్రాసిన దాని ప్రకారము ఏవైనా ఉన్నచో వీటితో చదువబడే బకాయి మొత్తము చెల్లింపు తేది మరియు/లేదా రాబట్టుకొను వరకు కాలమ్ (సి) నందు దిగువ తెలియజేయబడిన సంబంధిత తేదీల నుండి సదరు డిమాండ్ నోటీసులలో వివరించబడిన ప్రకారము సాలుకు 18% తదుపరి వడ్డీతో సహా వారి సంబంధిత పేర్లతో క్రింద తెలియజేయబడిన మొత్తములను ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోపుగా **హెచ్‌డిఎఫ్‌సికి** చెల్లించవల్సిందిగా సదరు రుణగ్రహీత(లు)/చట్టబద్ధవారసుదు(లు)/ చట్టబద్ధ ప్రతినిధి (లు) కు మరొక పర్యాయము ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది. సదరు రుణగ్రహీత(లు)చే వరుసగా **హెచ్‌డిఎఫ్‌సికి** దిగువ సెక్యూర్డ్ చేయబడిన ఆస్తి(లు) రుణం తిరిగి చెల్లించుటకు తగిన విధంగా సెక్యూరిటీగా తనఖా పెట్టబడినవి.
మీ సెక్యూర్డ్ ఆస్తి/లను విడిపించుటలో లభ్యతనందు గల సమయమునకు సంబంధించి చట్టము యొక్క సెక్షన్ 13 నందలి ఉపసెక్షన్ (8) నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీత(లు) దృష్టికి తేవడమైనది.

| క్ర సం. | రుణగ్రహీత(లు)/చట్టబద్ధవారసుదు(లు)/ చట్టబద్ధ ప్రతినిధి (లు) ల పేరు | మొత్తము రావలసిన బకాయిలు | డిమాండ్ నోటీసు తేదీ | సెక్యూర్డ్ ఆస్తి(లు)/ స్థిరాస్తి(లు) యొక్క వివరణ |
|---|---|---|---|---|
| (a) | (b) | (C) | (d) | (e) |
| 1 | శ్రీ బుర్ర సంపత్ కుమార్ (రుణగ్రహీత) శ్రీ బుర్ర సాయి కుమార్ (సహ-రుణగ్రహీత) శ్రీమతి బుర్ర శివనీల (సహ-రుణగ్రహీత) | 31-మే-2026* నాటికి బకాయిలు రూ. 53,61,228/- (రూపాయలు యాభై మూడు లక్షల అరవై ఒక్క వేల రెండు వందల ఇరవై ఎనిమిది మాత్రమే) | 03-జూలై-2026 | తెలంగాణ, సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి పట్టణం మరియు మండలం, సంగారెడ్డి మున్సిపాలిటీ క్రింద వార్డు నెం. 4, బ్లాక్ నెం. 7లో గల వాటికి జత చేసిన ప్లాన్‌లో చూపిన విధంగా సర్వే నెం. 402/ఇలో భాగముగా ఉన్న 166.66 చ.గ.లు లేదా 139.32 చ.మీ.లకు సమానమైన విస్తీర్ణము ఆర్‌సిసితో కవర్‌చేసిన గ్రౌండ్ ఫ్లోర్‌లో 909.18 చ.అ.ల బిల్టప్ ఏరియాతో ఖాళీప్లాట్ నెం. 17పై నిర్మించిన ఇల్లు యావత్తు. **సరిహద్దులు: ఉత్తరం:** ప్లాట్ నెం. 16, **దక్షిణం:** ప్లాట్ నెం. 18, **తూర్పు:** ప్లాట్ నెం. 07 & 08, **పడమర:** 24' వెడల్పు రోడ్డు. |
| 2 | శ్రీ మారంరెడ్డి జగన్నాథ రెడ్డి F/o శ్రీ మారంరెడ్డి ప్రభు కుమార్ (మరణించినారు) (రుణగ్రహీత) మరియు శ్రీ మారంరెడ్డి ప్రభు కుమార్ (మరణించినారు) ఇతర తెలిసిన మరియు తెలియని చట్టపరమైన వారసుదు(లు) మరియు చట్టబద్ధ ప్రతినిధు(లు) | 31-మే-2026* నాటికి బకాయిలు రూ. 68,02,250/- (రూపాయలు అరవై ఎనిమిది లక్షల రెండు వేల రెండు వందల యాభై మాత్రమే) | 30-జూన్-2026 | **షెడ్యూల్-ఏ:** తెలంగాణ-500075, గండిపేట మండలం, కోకాపేట గ్రామంలో గల సర్వే నెం. 100, 109 & 114లలో ప్లాట్ నెం. 09పై సైట్ నెం. 1లో సుమారుగా ఎకరాలు 5.87 సెంట్ల విస్తీర్ణము భూమి యావత్తు. **సరిహద్దులు: ఉత్తరం:** ఔటర్ రింగ్ రోడ్, **దక్షిణం:** ప్లాట్ నెం. 10, **తూర్పు:** 24 డిగ్రీలు మరియు 36 మీటర్ల రోడ్డు, **పడమర:** ప్లాట్ నెం. 08. **షెడ్యూల్-బి:** షెడ్యూల్ ఎ ఆస్తి టైటిల్, ప్రయోజనం మరియు యాజమాన్య హక్కు, ఒక కార్ పార్కింగ్ స్లాట్‌తో 26 చ.గ.ల. అవిభాజ్యవాటాతో పాటు ప్రెస్టీజ్ బెవర్లి హిల్స్ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌లో టవర్ నెం. 3లోని అమ్మబడే ఏరియా 1796 చ.అ.లు మరియు షెడ్యూల్ ఎ ఆస్తిలో రూపొందించిన అపార్ట్‌మెంట్ నెం. 3314 గల ఆస్తి యావత్తు. **సరిహద్దులు: ఉత్తరం:** ఖాళీ ప్రదేశము, **దక్షిణం:** ఖాళీ ప్రదేశము, **తూర్పు:** కామన్ కారిడార్, **పడమర:** ఖాళీ ప్రదేశము. |
| 3 | శ్రీ దక్క భాస్కర్ (రుణగ్రహీత) శ్రీమతి దక్క ప్రవళిక (సహ-రుణగ్రహీత) | 31-డిసెంబర్-2025* నాటికి బకాయిలు రూ. 42,51,618/- (రూపాయలు నలభై రెండు లక్షల యాభై ఒక్క వేల ఆరు వందల పద్దెనిమిది మాత్రమే) | 27-జూన్-2026 | సబ్ రిజిస్ట్రార్ వరంగల్, సేల్ డీడ్ నెం. 3536/2023 తేది: 17.02.2023 ప్రకారం మరింతగా స్పష్టంగా వివరించిన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోపల హన్మకొండ జిల్లా, కాజీపేట్ రెవెన్యూ గ్రామం, సిద్ధార్థనగర్ లో గల రాయ్ రెసిడెన్సీ డూప్లెక్స్ కాంప్లెక్స్‌లో ఇ.నెం. 1-1-35/ఏ (పాత) 1-1-1012 (కొత్త) గల బహుళ అంతస్తుల నివాస భవనములో ఫ్లాట్ ఏరియా 1145 చ.అ.లు, 52.87 చ.గ.ల భూమి అవిభాజ్యవాటాతో 4వ అంతస్తులో నివాస ఫ్లాట్ నెం. 401 యావత్తు. |
| 4 | శ్రీ మానుకొండ అనిల్ కుమార్ (రుణగ్రహీత) | 31-మార్చి-2026* నాటికి బకాయిలు రూ. 76,01,502/- (రూపాయలు డెబ్బై ఆరు లక్షల ఒక వెయ్యి ఐదు వందల రెండు మాత్రమే) | 22-జూన్-2026 | సేల్ డీడ్ నెం. 8920/2022 తేది: 14.06.2023 ప్రకారం మరింతగా స్పష్టంగా వివరించిన సూర్యాపేట జిల్లా, సూర్యాపేట గ్రామం అంజనాపురి కాలనీలో గల సర్వే నెం. 794లో ప్లాట్ నెం. 131ఎన్‌పి మరియు 131 ఎస్‌పి ఇల్లు యావత్తు. |
| 5 | శ్రీ పోలిశెట్టి ప్రణయ్ కుమార్ (రుణగ్రహీత) శ్రీమతి శ్రీదేవి పోలిశెట్టి (సహ-రుణగ్రహీత) | 30-నవంబర్-2025* నాటికి బకాయిలు రూ. 53,01,752/- (రూపాయలు యాభై మూడు లక్షల ఒక వెయ్యి ఏడు వందల యాభై రెండు మాత్రమే) | 04-మార్చి-2026 | రిజిస్ట్రేషన్ సబ్ రిజిస్ట్రార్ పెద్ద అంబర్‌పేట పరిధిలో రంగారెడ్డి జిల్లా, హయత్‌నగర్ మండలం గతంలో పెద్దఅంబర్‌పేట గ్రామ పంచాయతీ క్రింద పెద్ద అంబర్‌పేట గ్రామంలో గల సర్వే నెం.లు 73, 74 మరియు 75లలో 144 చ.గ.లు లేదా 120.39 చ.మీ.లకు సమానమైన విస్తీర్ణము ప్లాట్ నెం. 3 ఈశాన్య భాగము గల భూమి యావత్తు. **సరిహద్దులు: ఉత్తరం:** ప్లాట్ నెం. 2, **దక్షిణం:** ప్లాట్ నెం. 3 భాగము, **తూర్పు:** 25' వెడల్పు రోడ్డు, **పడమర:** ప్లాట్ నెం. 3 వాయువ్య భాగము. |
| 6 | శ్రీ గొల్లపెల్లి వెంకట అభిజిత్ గౌడ్ (రుణగ్రహీత) శ్రీ గొల్లపెల్లి అఖిల (సహ-రుణగ్రహీత) | 31-డిసెంబర్-2025* నాటికి బకాయిలు రూ. 59,79,104/- (రూపాయలు యాభై తొమ్మిది లక్షల డెబ్బై తొమ్మిది వేల నూట నాలుగు మాత్రమే) | 02-మార్చి-2026 | మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ క్రింద బాచుపల్లి గ్రామం మరియు మండలం వద్ద గల తనవి హిల్స్‌లో సర్వే నెం. 332లోని ప్లాట్ నెం.లు 6, 7 మరియు 8పై నిర్మించిన 49 చ.గ.లు (1980 చ.గ.లలో) భూమి అవిభాజ్యవాటాతో పాటు 1235 చ.అ.లు (కామన్ ఏరియా మరియు కార్ పార్కింగ్‌తో కలిపి) బిల్టప్ ఏరియాతో SUKRJTH1SAANVI 3వ అంతస్తులో ఫ్లాట్ నెం. 304 యావత్తు. **మొత్తం భూమి సరిహద్దులు: ఉత్తరం:** 40' వెడల్పు రోడ్డు, **దక్షిణం:** ఖాళీ ఏరియా, **తూర్పు:** 40' వెడల్పు రోడ్డు, **పడమర:** సర్వే నెం. 332 భాగములో పొరుగువారి భూమి. **3వ అంతస్తులో ఫ్లాట్ నెం. 304 సరిహద్దులు: ఉత్తరం:** ఖాళీ ప్రదేశము, **దక్షిణం:** ఖాళీ ప్రదేశము, **తూర్పు:** కారిడార్, **పడమర:** ఖాళీ ప్రదేశము. |
| 7 | శ్రీ శివకుమార్ కందుకూరి (రుణగ్రహీత) శ్రీమతి రజనీ శ్రీపాద (సహ-రుణగ్రహీత) | 30-నవంబర్-2025* నాటికి బకాయిలు రూ. 63,49,339/- (రూపాయలు అరవై మూడు లక్షల నలభై తొమ్మిది వేల మూడు వందల ముప్పై తొమ్మిది మాత్రమే) | 12-ఫిబ్రవరి-2026 | బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ క్రింద రంగారెడ్డి జిల్లా, బాలాపూర్ రెవెన్యూ మండలం, అల్మాస్‌గూడ గ్రామంలో గల సర్వే నెం. 131 భాగముగా ఉన్న 150 చ.గ.లు లేదా 125.41 చ.మీ.లకు సమానమైన విస్తీర్ణము (300 చ.గ.లలో) ఆర్‌సిసి రూఫ్‌తో గ్రౌండ్ ఫ్లోర్‌లో 775 చ.అ.ల ప్లింత్ ఏరియా కలిగి ప్లాట్ నెం. 75 దక్షిణ భాగముపై ఇల్లు యావత్తు. **సరిహద్దులు: ఉత్తరం:** ప్లాట్ నెం. 75 ఉత్తర భాగము, **దక్షిణం:** ప్లాట్ నెం. 76, **తూర్పు:** ప్లాట్ నెం. 84, **పడమర:** 25' వెడల్పు రోడ్డు. |
| 8 | శ్రీమతి గోదా సృజని (రుణగ్రహీత) శ్రీ బిరెడ్డి నవీన్ రెడ్డి (సహ-రుణగ్రహీత) | 30-నవంబర్-2025* నాటికి బకాయిలు రూ. 69,74,045/- (రూపాయలు అరవై తొమ్మిది లక్షల డెబ్బై నాలుగు వేల నలభై ఐదు మాత్రమే) | 29-జనవరి-2026 | తుర్కయంజాల్ మున్సిపాలిటీ క్రింద రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ మండలం, తుర్కయంజాల్ గ్రామంలో గల సర్వే నెం. 207/3 మరియు 207/2లలో శ్రీ సాయి నగర్‌లోని 148.66 చ.గ.లు లేదా 124.29 చ.మీ.లకు సమానమైన విస్తీర్ణము 1720 చ.అ.ల (గ్రౌండ్ ఫ్లోర్ 860 చ.అ.లు మరియు మొదటి అంతస్తు 860 చ.అ.లు) ఆర్‌సిసి రూఫ్‌తో ప్లింత్ ఏరియా కలిగిన ప్లాట్ నెం. 23 పడమర భాగముపై కొత్తగా నిర్మించిన ఇల్లు యావత్తు. **సరిహద్దులు: ఉత్తరం:** 35' వెడల్పు రోడ్డు, **దక్షిణం:** ప్లాట్ నెం. 22, **తూర్పు:** ప్లాట్ నెం. 23 తూర్పు భాగము, **పడమర:** 30' వెడల్పు రోడ్డు. |

*వర్తించు తదుపరి వడ్డీతో, అనుషంగిక ఖర్చులు, ధరలు మరియు ఛార్జీలు మొదలగునవి నేటి వరకు చెల్లింపు తేది మరియు/లేదా తీరేవరకు చెల్లించవలెను.
సదరు రుణగ్రహీతలు ఒకవేళ **హెచ్‌డిఎఫ్‌సికి** పైన తెలిపిన మొత్తమును చెల్లించుటలో విఫలమైనట్లయితే అప్పుడు **హెచ్‌డిఎఫ్‌సి** వారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద వర్తించు రూల్స్ ప్రకారము సదరు రుణగ్రహీత(లు)/చట్టబద్ధవారసుదు(లు)/ చట్టబద్ధ ప్రతినిధి (లు) వారి స్వంత బాధ్యతపై ధరలతో కూడిన పర్యవసానముతో పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తి(లు)/స్థిరాస్తి(లు)పై ముందుకు సాగెదరు.
కావున సదరు రుణగ్రహీత(లు)/చట్టబద్ధవారసుదు(లు)/ చట్టబద్ధ ప్రతినిధి (లు) వారు సదరు చట్టం క్రింద పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తి(లు)/స్థిరాస్తి(లు) **హెచ్‌డిఎఫ్‌సి** వారి ముందస్తు వ్రాత పూర్వక అనుమతి లేకుండా ఏవిధమైన అమ్మకము లేదా లీజు లేదా మరే ఇతర విధములైన బదిలీలు చేయుటకు నిషేధించడమైనది. ఎవరైనా వ్యక్తి సదరు చట్టము లేదా రూల్స్‌ను ఉల్లంఘించినట్లయితే అట్టివారు చట్టంలోని తెలిపిన రూల్స్ ప్రకారము కారాగారము మరియు/లేదా జరిమానాకు శిక్షార్హులు.

తేది: 25 జూలై, 2026
ప్రదేశం: హైదరాబాద్
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తరపున
సం/- అధీకృత అధికారి
రిజిస్టర్డ్ కార్యాలయం: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ పరేల్ (వెస్ట్), ముంబయి-400020

# 2026 జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకున్న సర్పంచ్



**మునుగోడు, జులై 26 (నినాదం):** మునుగోడు నియోజకవర్గం, మర్రిగూడ మండలం. రాం రెడ్డి పల్లి గ్రామ సర్పంచి లపంగి నరసింహ కు 2026 జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకోవడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డు -- 2026 అందుకోవడం నా జీవితంలో ఒక చిరస్మరణీయ ఘట్టం అని అన్నారు. ఈ అవార్డు వ్యక్తిగతంగా నాకు వచ్చిన గౌరవం మాత్రమే కాదు... రాంరెడ్డిపల్లి గ్రామ ప్రజల విశ్వాసానికి, మన గ్రామ అభివృద్ధికి, ప్రజాసేవకు దక్కిన గుర్తింపు అని తెలిపారు. ప్రతి అడుగులో నన్ను ప్రోత్సహించిన గ్రామ ప్రజలకు, గ్రామ పంచాయతీ సభ్యులకు, అధికారులకు, నా కుటుంబ సభ్యులకు, స్నేహితులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ గౌరవం నాకు మరింత బాధ్యతను గుర్తు చేస్తోందని ఇకపై కూడా ప్రజల ఆశయాలకు అనుగుణంగా, గ్రామాభివృద్ధి కోసం అదే అంకితభావంతో నిరంతరం పనిచేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు."పదవి ఒక అవకాశం మాత్రమే... ప్రజల ప్రేమే నిజమైన అవార్డ్ అని అన్నారు. సేవే నా శ్వాస... అభివృద్ధే నా లక్ష్యం."అని తెలిపారు.

# 28 నుండిగురుపూర్ణిమ వేడుకలు



**ఎల్బీనగర్, జూలై 26(నినాదం):** శ్రీ షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 30 వరకు శ్రీ గురుపూర్ణిమ మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఛైర్మన్ డా. లింగయ్య తెలిపారు. ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ వేడుకల్లో భాగంగా ప్రధానంగా లోక కళ్యానార్థం యాదగిరిగుట్ట కమిటీ మెంబర్ మాజీ ఆలయ చైర్మన్ గుండా మల్లయ్య ఆధ్వర్యంలో స్వామి ఓం స్వరూప్ జి చేతుల మీదుగా సామ మహా యజ్ఞం కార్యక్రమాన్ని అత్యంత వైభవపేతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యజ్ఞ మహా కార్యక్రమానికి ప్రముఖులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. పవిత్ర నదీ జలాలతో మంగళస్నానాలు, 108 వెండి కలశాభిషేకాలు, విశేష పూజలు, గురుచరిత్ర పారాయణం, భక్తులకు భజనలు ఒ భారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఉదయం కాకడ హారతితో ప్రారంభించి, బాబాకు ప్రత్యేక అభిషేకాలు, మంగళస్నానం, దివ్యాలంకరణ, మరియు విశేష పూజలు నిర్వహిస్తారు. నైవేద్యం, మధ్యాహ్నం ఉచ్ఛిష్ట/అఖండ హారతి, సాయంత్రం ధూప్ హారతి మరియు రాత్రి శేజ్ హారతి సేవలు ఉంటాయి. ఆలయ ప్రాంగణంలో సాయిబాబా ఉత్సవ మూర్తికి ప్రత్యేక పల్లకీ సేవ మరియు రోజంతా అఖండ సాయి నామజపం నిర్వహిస్తారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సాధారణ దర్శనంతో పాటు శీఘ్ర దర్శనం కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘా విస్తృతం చేసి, ప్రత్యేక భద్రతా సిబ్బందిని (సెక్యూరిటీ గార్డులు, వాలంటీర్లు) నియమిస్తారు. దిల్సుఖ్‌నగర్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుని ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ లు వూర నరసింహా గుప్తా, బీరప్ప,జనరల్ సెక్రెటరీ వి వి రవికుమార్, ఫైనాన్స్ సెక్రటరీ బి కిరణ్ కుమార్, జాయింట్ సెక్రటరీలు కోడి రాజశేఖర్, పి కృష్ణవేణి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పద్మాకర్ ఆత్రే, బివి శ్యామ్ కుమార్, ఎం శ్యామల రావు, పి లక్ష్మీ దుర్గ పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో బోగ్ బండార్ పండగ

- పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి



**ఆమనగల్లు, జూలై 26(నినాదం):** పాడి పంటలు, పశు సంపద వెల్లి విరియాలని సీత్లా భవాని అమ్మవారిని ప్రార్థించినట్లు కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం, సరికొండ గ్రామం బోయిన్ గుట్ట తాండలో బంజారా సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ బోగ్ బండార్ సీతల మాత పండుగ మేరమా యాడి గుడి భూమి పూజ జరిపారు. బోయినుట్ట తాండలో భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా వేడుకలు నిర్వహించారు. గిరిజనుల ఆనవాయితీ ప్రకారం అమ్మవారికి అపరాల పంటలకు సంబంధించిన పలుపంట ఉత్పత్తులను వండి నైవేద్యంగా సమర్పించారు. ఈ పార్టీ నాయకులు వివిధ గ్రామాల నాయకులు, పార్టీ ప్రెసిడెంట్లు,ప్రజలు, మహిళలు శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్, సీతల మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూర్ భాస్కర్ రెడ్డి, మండల పార్టీ ప్రెసిడెంట్ శంకర్ , మాజీ ప్రెసిడెంట్ బిచ్చా నాయక్ , మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, వ్యవసాయ కమిటీ డైరెక్టర్ ఉడుతల యాదయ్య,కడ్తాల్ మండలం ఉప సర్పంచ్ల సంఘం అధ్యక్షులు లక్పతి నాయక్ , మైసిగండి సర్పంచ్ ప్రేమ్ జవహర్లాల్ నాయక్, కర్కలపహడ్ సర్పంచ్ తేజు నాయక్, ఎక్వాయిపల్లి గ్రామ సర్పంచ్ కర్ణాకర్ గౌడ్ ఉప సర్పంచులు, కర్తాల్ ఉప సర్పంచ్ ఈ రెడ్డి యాదగిరి రెడ్డి, మైసిగండి ఉపసర్పంచ్ హిరాసింగ్,సరికొండ బోయనగుట్ట తండా గ్రామ సర్పంచ్ అద్దాల మహేందర్ గౌడ్, ఉప సర్పంచ్ బలవంత్ రెడ్డి, మాజి ఎంపీటీసీ, జడ్పిటిసి అద్దాల రాములు గౌడ్ ,గౌని లక్ష్మయ్య ,పార్టీ ప్రెసిడెంట్ రౌతు వెంకటయ్య, సత్యం హరిచంద్ర యాదయ్య కృష్ణయ్య,నరసింహ, కరుణాకర్,శ్రీను,రవి, రాజీవ్, సచిన్ బోయిన గుట్ట తండా పార్టీ నాయకులు బావోజి, మోతిలాల్,గోపి,లోకేష్, మంజులాల్,చందు, అంజి నాయక్,గణేష్,రాజేష్,లాల్ సింగ్,మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పిఆర్సి ప్రకటించకుంటే ఆందోళనకు సిద్ధం

- టీఎస్ యుటిఎఫ్ నేతల హెచ్చరిక





**వనపర్తి ప్రతినిధి, జులై 26 (నినాదం):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్న పిఆర్ సి ప్రకటించడం లేదని, దీనిపై తాత్సారం చేస్తే పోరాలకు సిద్ధమని టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.రవి ప్రసాద్ గౌడ్, డి.కృష్ణయ్య హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఉర్దూ మీడియం హైస్కూల్లో టీఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలో పి ఆర్ సి ని ప్రకటిస్తామని హామీ ఇచ్చారని, మూడు సంవత్సరాలు కావస్తున్నా నేటికి ఆ ఊసే లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికే ఆరు విడతలుగా డిఎలు పెండింగ్ లో ఉన్న నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరిస్తున్నారని, 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లాగే ఓబిఎస్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడుతుందని, ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు చేయాలని ఎన్నిసార్లు ఆందోళన చేసినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన హెల్త్ కార్డులలో అనేక లోపాలున్నాయని అన్నారు. ఉపాధ్యాయులకు వెంటనే బదిలీలు, ప్రమోషన్లు ప్రక్రియ చేపట్టాలని కోరారు. జిల్లాలోని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బి.వెంకటేష్, కే.జ్యోతి, జిల్లా కోశాధికారి తిమ్మప్ప, జిల్లా కార్యదర్శులు పి.శ్రీనివాస్ గౌడ్, యండి.హామీద్, జి.మురళి, లక్ష్మణ్ నాయక్, బి.అరుణ, ఏ.వెంకటేష్, శివ శంకర్, ఆంజనేయులు, లక్మణ్ గౌడ్, సుబ్బాస్, డి.రాము, మద్దిలేటి, నిరంజన్, శ్రీరాం, కౌసల్య, చిన్నస్వామి, బి.వెంకటేష్, జి.రాజ శేఖర్, వివిధ మండలాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు.

# గోల్కొండ తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే



**రాజేంద్రనగర్, జులై 26 (నినాదం):** గోల్కొండ బోనాల జాతరను పురస్కరించుకుని 'కళా సిండికేట్' ఆధ్వర్యంలో నిర్వహించిన తొట్టెల ఊరేగింపు మహోత్సవం ఘనంగా జరిగింది. ఆదివారం గోల్కొండలోని బంజారా దర్వాజా వద్ద గల హనుమాన్ మందిర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ 'బోనాల జాతర – గోల్కొండ తొట్టెల ఊరేగింపు' కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజ లు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గోల్కొండ బోనాల ఉత్సవాలను ప్రజలంతా కలిసికట్టుగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం అభినందనీయమన్నారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ వైభవమైన ఊరేగింపు ఉత్సవాల్లో మాజీ కౌన్సిలర్ కృష్ణ గౌడ్, నిర్వాహకులు రాఘవ్, రాహుల్, ఎల్.ఎన్.ఆర్ , వరుణ్ తేజ్లతో పాటు పెద్ద ఎత్తున భక్తులు, స్థానిక నాయకులు, ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. మంగళవాయిద్యాలు, పోతురాజుల విన్యాసాల నడుమ తొట్టెల ఊరేగింపు కోలాహలంగా సాగింది.

# 29న సాయి సన్నిధిలో గురుపూర్ణిమ మహోత్సవాలు




**చింతపల్లి, జూలై 26 (నినాదం):** మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయి బాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన గురుపూర్ణిమ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ్య తెలి పారు. గురుపూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించేలా ఐదు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ ప్రభాత భేరి,గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యాధివాసం, వేద పారాయణం, నవగ్రహ పూజ, ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, గురుపూజ, సాయి గీతా చింతన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, డోలోత్సవం, ధూపహారతి, శేజ్ హారతి వంటి విశేష సేవలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురుపూర్ణిమ రోజు ఉదయం 5 గంటలకు నగర సంకీర్తనతో వేడుకలు ప్రారంభమవుతాయని అన్నారు. ఈ మహోత్సవంలో పాల్గొనే భక్తుల కోసం ప్రత్యేకంగా తాగునీరు, అన్నదానం, ప్రసాదం, పార్కింగ్ తదితర సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. గురుపూర్ణిమ మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ షిరిడి సాయిబాబా ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

## మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి స్ఫూర్తితో

# ప్రజా సేవలో ముందుకు..

**కాంగ్రెస్ సీనియర్ నాయకులు కపిలేశ్వర్**

**హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి కి రూ.25 వేలు ఆర్థిక సహాయం**




**మల్కాజిగిరి, జులై 26 (నినాదం):** మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు చేస్తున్న ప్రజాసేవ కార్యక్రమాల స్ఫూర్తితో ముందుకు పోతూ, ఆపదలో ఉన్న పేదవారికి తనకు తోచిన సహాయంను చేస్తున్నానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్ కపిలేశ్వర్ అన్నారు. మాజీ మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు ఆదివారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతల కపిలేశ్వర్ సన్ ఫ్లవర్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న రాము ముదిరాజ్ అనే వ్యక్తికి వైద్యం కోసం 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం ను అందజేశారు. అనంతరం రాము ముదిరాజ్ వైద్య ఖర్చులు రూ. 6 లక్షల వరకు బిల్లు కాగా, స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతల కపిలేశ్వర్ సన్ ఫ్లవర్ హాస్పిటల్ కి వెళ్లి హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి రూ. 4 లక్షల 50 వేలను తగ్గించి, రూ. 1లక్ష 50 వేల ను ఫైనల్ అమౌంట్ చేయించారు. బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మాజీ మైనంపల్లి హనుమంతరావు, మెదక్ ఎమ్మెల్యే రోహిత్ బాబుకి, కపిలేశ్వర్ లకు ఎల్లవేళలా వాజ్పేయి నగర్ వాసులు గా మేము రుణపడి ఉంటామని, కపిలేశ్వర్ లాంటి వ్యక్తి కాకతీయ నగర్ (187) డివిజన్ లో మాలాంటి పేదలకు అండగా నిలిచి సహాయం చేయడం మా అదృష్టం గా భావిస్తున్నామని కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు రొట్టెల ధరన్, మనోజ్ చారి, వాజ్పేయి నగర్ యూత్ పప్పు, సాయి, కిట్టు ముదిరాజ్, శ్రీకాంత్, శ్రీనివాస్, జావేద్, వెంకటేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## కార్గిల్ విజయం ప్రతి భారతీయుడికి గర్వకారణం

### నివాళులర్పించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



**నిజామాబాద్ ప్రతినిధి, జులై 26 (నినాదం) :** కార్గిల్ విజయం ప్రతి భారతీయుడికి గర్వకారణం అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. కార్గిల్ విజయ్ దివస్ ను పురస్కరించుకొని ఆదివారం నగరంలోని ఎల్లమ్మ గుట్ట చౌరస్తాలో గల అమరవీరుల స్తూపానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 1999 లో కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం అసమాన ధైర్యసహసాలను ప్రదర్శించి, శత్రువులను తరిమి కొట్టి త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిందన్నారు. సుమారు 500 మంది సైనికులు తమ ప్రాణాలను అర్పించారని వారందరి త్యాగ ఫలితంతో స్వేచ్ఛగా ఉండగలుగుతున్నా మన్నారు. వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. బీజేపీ ఎప్పటికీ దేశభద్రత సైనికుల సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యమిస్తుందన్నారు. దేశ ప్రధాని మోదీ నేతృత్వంలో భారత రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు. అమర జవాన్ల త్యాగాన్ని స్మరించుకుంటూ దేశ సమైక్యతను సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు అంకితభావంతో పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, మహిళా మోర్చ అధ్యక్షురాలు వనిత, యువ మోర్చా అధ్యక్షులు వంశీ, కార్పొరేటర్లు బెల్లాల్ శశాంక్, మఠం పవన్, జ్యోతి మురళి, సుమిత్ర కిషోర్, ప్రసూన శ్రీనివాస్, మమత శివ, రాష్ట్ర కో కోశాధికారి విజయ్, సీనియర్ నాయకులు స్వామి యాదవ్ భూపతి తదితరులు పాల్గొన్నారు.

### ఆర్మీ జవాన్ ఆంజనేయులుకు


## డాక్టరేట్ పురస్కారం



**నారాయణపేట ప్రతినిధి, జులై 26, (నినాదం):** అసధ్యాలను సుసాధ్యం చేసుకుంటూ సంఘంలో తనదైన ముద్ర వేసుకుంటూ ముందుకు సాగుతున్న ఆర్మీ జవాన్ ఆంజనేయులుకు అరుదైన డాక్టరేట్ పురస్కారం లభించడంతో వారియర్స్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. సాధన చేయుము రా నరుడా... సాధ్యము కానిది లేదురా... అనే సినీ గీతాన్ని ఒడిసి పట్టుకున్న చందంగా ఆంజనేయులు సాధన చాలా గొప్పదని చెప్పవచ్చు. సాధన చేస్తూ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు చూపిస్తూ పలువురిని అగ్ని వీరులుగా, ఆర్మీ జవాన్లుగా, సివిల్ పోలీసులుగా, తీర్చిదిద్దిన ఘనత సాధించుకున్న ఆర్మీ ఆంజనేయుని పలువురు ప్రశంసించారు. యువత నిరుద్యోగులుగా ఉండకూడదని విషయాన్ని గమనించి వారి వారి ఇష్టాలను తెలుసుకొని ప్రోత్సహిస్తూ సొంతంగా వారియర్స్ డిఫెన్స్ అకాడమీని స్థాపించి, ఎంతోమంది బీద కుటుంబాల నుండి వస్తున్న విద్యార్థులకు దిక్సూచిగా మారి నారాయణపేట జిల్లా కేంద్రంలోని పలువురి సహాయ సహకారాలు తీసుకుంటూ ఉచితంగా విద్యార్థులకు శారీరక, మానసిక శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తూ వచ్చారు. ఈయన అకాడమీ నుండి ఎంతోమంది విద్యార్థులు అగ్ని వీరులుగా ఆర్మీ జవాన్లుగా సివిల్ పోలీసులుగా ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇలాంటి సేవలను గుర్తించి, డాక్టరేట్ పురస్కారంతో సత్కరించిన ప్రపంచ చారిటీ వెల్ఫేర్ ఫౌండేషన్, న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో బెంగళూరులోని గాంధీ భవన్‌లో ఘనంగా నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో వారియర్స్ డిఫెన్స్ అకాడమీ వ్యవస్థాపకులు ఆంజనేయులు (ఆర్మీ) కి గౌరవ డాక్టరేట్ పురస్కారం ప్రదానం చేశారు. ఆంజనేయులు 2019 సంవత్సరం నుండి వారియర్స్ డిఫెన్స్ అకాడమీని స్థాపించి, పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, పారా మిలిటరీ దళాలు, పోలీస్ కానిస్టేబుల్ వంటి రక్షణ శాఖ ఉద్యోగాలకు పూర్తిగా ఉచిత శిక్షణ అందిస్తూ ఎంతోమంది యువతను ఉద్యోగస్తులుగా తీర్చిదిద్దారు. అంతేకాకుండా నారాయణపేట జిల్లాలోని ప్రతి గ్రామానికి వెళ్లి, చదువును మధ్యలో నిలిపివేసిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రేరణాత్మక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, దేశ రక్షణ, రాష్ట్ర రక్షణ శాఖల్లోని ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పిస్తూ యువతలో దేశభక్తిని పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రతి సంవత్సరం నారాయణపేట జిల్లాలో విద్యార్థుల కోసం కెరీర్ గైడెన్స్, అవగాహన సదస్సులను నిర్వహిస్తూ, సమాజ సేవతో పాటు దేశ సేవను కూడా తన జీవిత లక్ష్యంగా కొనసాగిస్తున్నా రు. సమసమాజ నిర్మాణం కోసం ఆయన చేస్తున్న విశిష్ట సేవలను గుర్తించిన ప్రపంచ చారిటీ వెల్ఫేర్ ఫౌండేషన్, న్యూఢిల్లీ వారు ఆయనను గౌరవ డాక్టరేట్ పురస్కారంతో సత్కరించడం నిజంగా గర్వించదగిన విషయం. ఈ సందర్భంగా ఆంజనేయులు (ఆర్మీ) కి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఆయన మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నామని పలువురితో పాటు విద్యార్థుల తల్లితండ్రులు,ప్రజలు కోరారు.

## విజయవంతంగా ముగిసిన ఉచిత వైద్య సేవలు

### సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్



**కల్వకుర్తి జులై 26 (నినాదం)** నిరుపేద ప్రజల కోసమే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నమని యెన్నమ్స్ చైర్మన్ డాక్టర్ హరికాంత్ రెడ్డి అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని పాత బ్యాంక్ దగ్గర యెన్నమ్స్ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని యెన్నమ్స్ చైర్మన్ డాక్టర్ హరికాంత్ రెడ్డి స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మారుతున్న జీవనశైలి వల్ల వస్తున్న అనారోగ్య సమస్య ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల నిరుపేదలకు ఆర్థిక భారం తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ శిబిరంలో దాదాపు 550 మందికి షుగర్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో మరియు థైరాయిడ్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను శాలువా, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ,సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్,మాజీ సర్పంచ్ జిల్ల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు యెన్నం భూపతి రెడ్డి, హాస్పిటల్ డైరెక్టర్ యెన్నం అంజన్ రెడ్డి, ఎముకల డాక్టర్ వెంకటేష్, జనరల్ సర్జన్ డాక్టర్ శ్రీనివాసులు,జనరల్ మెడిసిన్ దినేష్ కుమార్, స్త్రీల ప్రతేక వైద్యురాలు శ్రీవాస్తవి, డీఎంఓ అభిషేక్, జనరల్ మేనేజర్ కె రవి కుమార్, ఉప సర్పంచ్ ఎర్ర శ్రీనివాస్,వార్డు మెంబర్స్, నాయకులు పాలాది మల్లీశ్వరి రంగనాథం, గుద్దటి కిష్టల్, మారేపల్లి శ్రీనివాస్, మసిగుండ్ల వెంకటేష్, మట్ట భరత్ గౌడ్, జంగిలి ఆనంద్ రాజ్, గోరటి భరత్, సమీర్, శేఖర్ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సైనికుల త్యాగాలతోనే మన దేశానికి నిత్య భద్రత

### విద్యా సామాజిక సేవకులను సత్కరించిన జిల్లా ఇంటిలిజెన్స్ ఎస్పీ రామోజీ రమేష్



**ఖమ్మం, జూలై 26(నినాదం ):** దేశంలో సైనికుల త్యాగాలతోనే మనకు నిత్యం భద్రత ఏర్పడి ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించగలుగుతున్నారని జిల్లా ఇంటిలిజెన్స్ ఎస్పీ రామోజీ రమేష్ తెలిపారు. స్థానిక ఎన్ ఎస్ సి కాలనీలోని ఫ్రీడమ్ పార్కులో ఆదివారం జరిగిన కార్గిల్ విజయ్ దివాస్ ఉత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత జిల్లా ఎస్పీ రామోజీ రమేష్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి చంద్రశేఖర్, మాజీ సైనిక ఉద్యోగుల రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్ ఎం అరుణ్ తో కలిసి అమర జవాన్లకు ఘనంగా నివాళి అర్పించారు. ఎన్సిసి క్యాడట్లు, మాజీ సైనిక ఉద్యోగులు ఈ నివాళి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కార్గిల్ విజయ్ దివాస్ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఇంటిలిజెన్స్ ఎస్పీ రామోజీ రమేష్ మాట్లాడుతూ అమర జవాన్ల ప్రాణ త్యాగంతోనే జమ్మూ కాశ్మీర్ లోని కార్గిల్ ప్రాంతం రక్షింపబడిందని తెలిపారు. మన జవాన్లు 60 రోజులపాటు శత్రువులతో గడ్డకట్టే చలిలో పోరాడి కార్గిల్ ప్రాంతాన్ని రక్షించారని, ఈ పోరాటంలో 567 మంది మన జవాన్లు అమరులయ్యారని వారి అమరత్వాన్ని గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం జులై 26న కార్గిల్ విజయ్ దివాస్ ను దేశమంతటా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్గిల్ విజయ్ దివాస్ స్ఫూర్తి మరో వందేళ్లు కలకాలం కొనసాగాలని తెలిపారు. విద్యార్థులు, యువత జవాన్ల జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని దేశ రక్షణలో భాగస్వాములు కావడానికి అప్రమత్తంగా ఉండాలని కోరారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ సైనికుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండదండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్ ఎం అరుణ్ , రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్, ఏపీ రాష్ట్ర అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ వరప్రసాద్, మాజీ సైనిక ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సుభాన్, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, వెటర్న్ సైనికుల జిల్లా ప్రతినిధి హనుమంతరావు, మాజీ సైనిక ఉద్యోగులు, వివిధ పాఠశాలల, కళాశాలల ఎన్సిసి క్యాడెట్లు , తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యా, సామాజిక సేవలు అందిస్తున్న ఫిట్ ఇండియా సంస్థ బాధ్యులు ఫర్వా, సంభాని నగర్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు గౌరీ, ఉపాధ్యాయురాలు సూర్యకుమారి, స్టేట్ అవార్డు గ్రహీత వార్డెన్ కోటపాటి రుక్మారావు , నిర్మల హృదయ్ స్కూల్ కరస్పాండెంట్ సాంబ శివారెడ్డి లను జిల్లా ఇంటెలిజెన్స్ ఎస్పీ రామోజీ రమేష్ శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎన్సిసి క్యాడెట్లు నిర్వహించిన ఎన్సిసి విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

## గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలి

### కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



**నాగర్ కర్నూల్ జులై 26 (నినాదం):** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం కారణంగా నాగర్ కర్నూల్ జిల్లాలోనూ వర్షపాతం తగ్గిన నేపథ్యంలో గ్రామీణ ప్రజలు, రైతులను అప్రమత్తం చేయడంతో పాటు ముందస్తు చర్యలపై విస్తృత అవగాహన కల్పించేందుకు జూలై 30న జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి అధికారులకు, మండల స్థాయి అధికారులకు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ఎల్‌నినో ప్రభా వంతో జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, ఇప్పటికే చెరువులు, రిజర్వాయర్లు, భూగర్భ జలాల నీటిమట్టాలు తగ్గుముఖం పట్టే పరిస్థితులు నెలకొనే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే వ్యవసాయం, పశుసంవర్ధక రంగం, గ్రామీణ ప్రజల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికలు రూపొందించి వాటిని సమర్థవంతంగా అమలు చేయడం అత్యంత అవసరమని తెలిపారు.
ఈ నేపథ్యంలో నిర్వహించే గ్రామసభల్లో రైతులు, గ్రామస్థులకు ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల ఏర్పడే పరిస్థితులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామసభల్లో ముఖ్యంగా వ్యవసాయ పంటలకు సంబంధించి ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక (కాంటింజెన్సీ ప్లాన్), తాగునీటి నిర్వహణ, నీటి సంరక్షణ చర్యలు, వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణం, సామూహిక ఇంకుడు గుంతల ఏర్పాటు, వ్యవసాయ క్షేత్రాల్లో ఫార్మ్ పాండ్ల నిర్మాణం, పర్కొలేషన్ ట్యాంకుల ఏర్పాటు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు, వర్షపు నీటి సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించి ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో జూలై 30న గ్రామసభలను తప్పనిసరిగా నిర్వహించి, రైతులు, మహిళా సంఘాలు, యువత, ప్రజాప్రతిని ధులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అలాగే మండల పంచాయతీ అధికారులు (ఎంపీవోలు), మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు), డివిజనల్ పంచాయతీ అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు గ్రామసభల నిర్వహణ ను ప్రత్యక్షంగా పర్యవేక్షించి, ఎక్కడా నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామసభలు విజయవంతంగా నిర్వహించిన అనంతరం సంబంధిత వివరాలతో కూడిన సమగ్ర నివేదికలను జిల్లా పంచాయతీ కార్యాలయానికి వెంటనే పంపించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

## మానస మృతి పట్ల పువ్వాడ అజయ్‌కుమార్ సంతాపం



**ఖమ్మం, జులై 26(నినాదం):** ఖమ్మం నగరంలోని జయనగర్ కాలనీకి చెందిన 56వ బూత్ డీఎల్ఓ శ్రీమతి స్వరూప రాణి , ఖాసిం ని మాజీ మంత్రి అజయ్ కుమార్ పరామర్శిం చారు. ఇటీవల అకాల మరణం చెందిన వారి కుమార్తె, విద్యార్థిని యమల మానస మృతి పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ యమల మానస చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వరూప రాణి, ఖాసిం దంపతులను ఓదార్చిన పువ్వాడ అజయ్ కుమార్ గారు, మానస ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ తీరని విషాదాన్ని భరించే మనోధైర్యాన్ని ఆ కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గారి ఆదేశాలతో బాధిత కుటుంబానికి తన వంతు సహాయంగా కొనగంచి వరప్రసాద్ గారి చేతుల మీదుగా డివిజన్ నాయకులు ?20,000 (ఇరవై వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేసి, ఈ క్లిష్ట సమయంలో తాము కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.
ఈ కార్యక్రమంలో ఆర్ జె సి కృష్ణ, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, మాజీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు పార్టీ నాయకులు కొనకంచి వరప్రసాద్, కాత్రాల శ్రీరాములు, సద్దాం షేక్, ఆకుల వెంకటేశ్వర్లు, డివిజిజన్ నాయకులు కాత్రాల దినేష్పురం వెంకన్న, పొన్నం సుబ్బారావు, ప్రసాద్, రాజుల రామారావు, వేముల నర్సయ్య, పురం రమేష్ తదితరులు పాల్గొని మానస మృతికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## మన్ కీ బాత్ వీక్షించిన అర్బన్ ఎమ్మెల్యే



**నిజామాబాద్ ప్రతినిధి,జులై 26 (నినాదం) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 136వ "మన్ కీ బాత్" కార్యక్రమాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో వీక్షించారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించి, భారత సైనికుల ధైర్యసాహసాలను ప్రధానమంత్రి కొనియాడారు. "ఆత్మనిర్భర్ భారత్" రక్షణ రంగం, గురించి మాట్లాడుతూ స్వదేశీ యుద్ధనౌక ఐఎన్ఎస్ మహేంద్రగిరి, డిఆర్డిఓ అభివృద్ధి చేస్తున్న రక్షణ సాంకేతికతలను ప్రశంసించారు. ముఖ్యంగా "క్యాచ్ ద రైన్" ఉద్యమం విజయవంతమైందని పేర్కొంటూ ప్రతి పౌరుడు వర్షపు నీటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. అలాగే యువత విజయాల గురించి మాట్లాడుతూ.. జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ గెలిచిన తెలుగు తేజం పి.వి సింధును అభినందించారు అలాగే యువ శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలను ప్రశంసించారు. మణిపూర్ కు చెందిన ఖగోళ శాస్త్రవేత్త డాక్టర్ రోనాల్డో లైషరామ్ అంతర్జాతీయ స్థాయిలో సాధించిన పరిశోధన విజయాన్ని ప్రస్తావించి అభినందించారు. స్థానిక కళలు సంస్కృతి పరిరక్షణ పై దృష్టి సారిస్తూ కాశ్మీర్ కు చెందిన సంప్రదాయ " వాగూవ్" చాపల కలను, త్రిపురకు చెందిన చెంగ్ ప్రేంగ్ వాద్యాన్ని పెంచిన వారిని ప్రశంసిచారు. అలాగే పర్యావరణం విడుదల నిర్వహణ మహిళల సాధికారతకు సంబంధించిన పలు స్థానిక కార్యక్రమాలను ఉదాహరణలుగా ప్రస్తావించి దేశవ్యాప్తంగా జరుగుతున్న స్ఫూర్తిదాయక ప్రయత్నాలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ 'మన్ కీ బాత్' రాజకీయ కార్యక్రమం కాదని, దేశంలో స్ఫూర్తిదాయకమైన వ్యక్తులు, జాతీయ విలువలు, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి అనే అంశాలను ప్రజలకు చేరవేసే వేదిక అన్నారు. కార్గిల్ వీరుల త్యాగం నుంచి నీటి సంరక్షణ వరకు, స్వదేశీ రక్షణ సామర్థ్యం నుంచి యువత విజయాల వరకు ప్రతి అంశం దేశాన్ని మరింత బలోపేతం చేసే దిశలో ప్రజలను ప్రేరేపించే సందేశాన్ని ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, ప్రధాన కార్యదర్శి, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, మహిళా మోర్చ అధ్యక్షురాలు వనిత, యువ మోర్చా అధ్యక్షులు వంశీ, మైనార్టీ మోర్చా జస్పాల్ సింగ్, కార్పొరేటర్లు బెల్లాల్ శశాంక్, మఠం పవన్, జ్యోతి మురళి, ఇప్పకాయల సుమిత్ర కిషోర్, మమత శివ, యువ మోర్చా రాష్ట్ర నాయకులు విజయ్, పవన్ ముందడ తదితరులు పాల్గొన్నారు.

## గులాబీ జెండా గద్దె ప్రారంభోత్సవం

### పాల్గొన్న మాజీ మంత్రి పువ్వాడ



**ఖమ్మం, జులై 26(నినాదం ):** ఖమ్మం నియోజకవర్గం 8వ డివిజన్ లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గులాబీ జెండా గద్దెను మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గారు ప్రారంభించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించి పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయం, సమానత్వం కోసం డాక్టర్ అంబేద్కర్ చూపిన మార్గం చిరస్మరణీయమని పేర్కొన్నారు.

## నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల ఆహ్వానం

**బోధన్ ప్రతినిధి, జులై 26: (నినాదం ):** జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామనిబోధన్,సాలూర మండలాల ఎంఈఓలు నాగయ్య, రాజీమంజుష సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2027--28 విద్యా సంవత్సరానికి నిర్వహించనున్న జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష కు ఆన్‌లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్ మరియు గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న అర్హులైన విద్యార్థులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తు నమోదు ప్రక్రియలో ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని వారు సూచించారు.

## విజన్ ఇండియా సదస్సును పాలమూరులోనే నిర్వహించాలి

### టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి డిమాండ్



**మహబూబ్ నగర్ బ్యూరో, జులై 26 (నినాదం న్యూస్):** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సొంత జిల్లా అయిన పాలమూర్ జిల్లాలోనే ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే విజన్ ఇండియా సదస్సును నిర్వహించాలని టిపిసిసి అధికార ప్రతినిధి గాలి రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి బహిరంగ ప్రకటనను ఆదివారం విడుదల చేశారు. దేశంలోని చాలా రాష్ట్రాలు ఈ సదస్సును నిర్వహించేందుకు పోటీపడ్డ పాలమూరు జిల్లాకు ఈ అవకాశం దక్కడం గర్వకారణమని ఆయన అన్నారు. ఇలాంటి అవకాశం రావడం పాలమూరు జిల్లా ప్రజల అదృష్టమని ఇలాంటి సదస్సును సౌకర్యాలు లేమి కారణంతో హైదరాబాద్ కు తరలించడం తగదన్నారు. పాలమూర్ జిల్లాలో ఉన్న పాలమూర్ యూనివర్సిటీకి చాలా కాలానికి ఒక సదస్సు నిర్వహించే అవకాశం వచ్చిందనీ, ఈ సదస్సును యూనివర్సిటీ ప్రాంగణంలో జరిపితే మన పాలమూర్ ప్రాశస్తం, పాలమూర్ సంస్కృతి దేశవ్యాప్తంగా విస్తరిస్తుందనీ సూచించారు. ఈ సదస్సు నిర్వహణకు పీఎం ఉష పథకంక్రింద ఇప్పటికే 100 కోట్లు మంజూరి అయ్యాయని, అదేవిధంగా విజన్ ఇండియా 2047 కింద సదస్సు నిర్వహణకు మరో 25 కోట్లు మంజూరి అయ్యాయనీ సూచించారు. దక్షిణ భారతదేశంలో అనేక యూనివర్సిటీలు పోటీ పడ్డ కూడా అదృష్టం కొద్దీ ఆ అవకాశం మన పాలమూర్ యూనివర్సిటీకి వచ్చిందనీ హర్షం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా 600 మంది ప్రతినిధులు హాజరవుతారనీ పీఎం ఉష పథకానికి పలు యూనివర్సిటీల వీసీలు, ప్రముఖ విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు అవుతారనీ తెలిపారు. ఈ సదస్సులో ఉన్నత విద్య, పరిశోధన, పారిశ్రామిక భాగస్వామ్యం, పర్యావరణ అభివృద్ధి, నైపుణ్యం పై చర్చ, జాతీయ పురోగతి వంటి ఎన్నో అంశములపై వక్తల ప్రసంగాలు అంశాలుగా ఉంటాయనీ ఇది విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కాగా ఇంత ఉపయోగకరంగా ఉండే అంశాలు ఉన్న సదస్సును పాలమూర్ పట్టణంలోని యూనివర్సిటీలోనే నిర్వహించాలనీ కానీ అధికారులు స్వార్థంతో ఎక్కడో ఉన్న కాన్హా శాంతివనం అనే ప్రైవేటు ఈవెంట్స్ జరిగే దగ్గర నిర్వహించాలనుకుంటున్నారనీ ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల యూనివర్సిటీలో చదివే, అనుబంధ యూనివర్సిటీలలో చదివే వేలాదిమంది విద్యార్థులు నష్టపోతారని, అసలు సదస్సు ఫలాలు విద్యార్థులకు దక్కే ప్రసక్తి లేదని ప్రశ్నించారు. పాలమూర్ ప్రాశస్తిని, యూనివర్సిటీ కీర్తిని ఒక ప్రైవేటు స్థలంలో నిర్వహించి కనుమరుగు చేస్తున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూర్ పట్టణంలో వసతుల కోసం అనేక హాస్టల్స్, ప్రైవేట్ కాలేజెస్, గెస్ట్ హౌస్, ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లు ఉన్నాయనీ సూచించారు. ముఖ్యమంత్రి పాలమూరు జిల్లాకు చెందిన వ్యక్తి, అలాగే, 14 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులు ఉన్నా కూడా మన యూనివర్సిటీలో సదస్సు నిర్వహించలేక పోతున్నామని వేలాదిమంది విద్యార్థులు మనోవేదనను పార్టీలో ఉన్న బాధ్యుడిగా మీ దృష్టికి తీసుకువస్తూ మన పాలమూర్ యూనివర్సిటీలోనే సదస్సు నిర్వహించాలని బాలుడు హర్షవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు.

## జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు ప్రారంభం

### గ్రామీణ ప్రాంతల ప్రజలకు మరింత సేవలు అందుబాటులో...

**ఆర్మూర్ జులై 26 ( నినాదం):** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం భీంగల్ మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి – కం – జుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టును ఆదివారం రోజున జ్యోతిని వెలిగించి, పూజ కార్యక్రమాలు నిర్వహించి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి, నిజామాబాద్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ తంగిరాల మాధవి దేవి ముఖ్య అతిథిగా విచ్చేసి న్యాయమూర్తి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, మారుమూల ప్రాంతంలో న్యాయ సేవలు అందుబాటులోకి రావడం, డబ్బుతోపాటు సమయం ఆదా అవుతుందని, త్వరితగతిన సేవలు లభించనున్నాయని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి పేర్కొన్నారు. న్యాయమూర్తి మాధవి దేవి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు, వాణిజ్య వ్యాపారస్తులకు, వేగవంతమైన సులువైన న్యాయ సేవలు అందించేందుకు స్థానికంగా కోర్టుల ఏర్పాటు ఎంతో దోదపడుతుందన్నారు. భీంగల్ ప్రాంత పరిసరాల ప్రజలకు ఇకపై కోర్టు పనుల నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్ళవలసిన అవసరం లేదన్నారు. దీంతో సమయం వృధా కాదని, ఆర్థిక భారం సైతం తగ్గుతుందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి తెలియజేశారు. ముందుగా భీంగల్ కు కొంత దూరంలో గల శ్రీ నింబాచాల లక్ష్మీ నరసింహ స్వామి వారి దైవ దర్శనానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు స్వామివారి,తలంబ్రాలు పట్టు వస్త్రాలు, పలు ఇతరత్రా పూజ సామాగ్రి తలపై పెట్టుకుని పాదయాత్రగా తరలివెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపి దైవదర్శనం చేసుకున్నారు. శ్రీ స్వామి వారు వేద పండితులచే ప్రత్యేక పూజలు జరిపి, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి శుభ పర్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేసులు పరిష్కరించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్, నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ. వీ. ఎన్ భరత లక్ష్మి, ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రవీణ్ చందర్, న్యాయవాదులు చైతన్యం, సూర సురేష్, జగన్, ఏలేటి గంగాధర్, భూపతి రెడ్డి, ఆ వరి రమేష్, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.



# నల్గొండలో అట్టహాసంగా 18వ ఈశా గ్రామోత్సవం వేడుకలు



**నల్గొండ ప్రతినిధి జూలై 26(నినాదం ):** నల్గొండలోని కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 18వ ఈశా గ్రామోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ క్రీడా పోటీల్లో పురుషుల వాలీబాల్, మహిళల త్రోబాల్ విభాగాల్లో వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధికి నాణ్యమైన నేల, గాలి, నీరు ఎంత అవసరమో, గ్రామాల్లో ఆరోగ్యం, ఐక్యత, సామాజిక చైతన్యం పెంపొందించడంలో ఇటువంటి క్రీడా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. నల్గొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సైదులు, కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ అతిథులుగా పాల్గొని క్రీడాకారులను అభినందించారు. వేడుకల్లో గ్రామస్థులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కోలాటంతో అతిథులకు ఘన స్వాగతం పలికారు. ఏడుగురు చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ముఖ్య అతిథులు త్రోబాల్ పోటీలను ప్రారంభించి, క్రీడాకారులతో కలిసి కొంతసేపు ఆటలో పాల్గొని వారిని ప్రోత్సహించారు. తలపై నీటి గ్లాసుతో నడిచే పోటీ, జంటగా ఒక కాలిపై గెంతే పోటీ, బెలూన్ ఆటలు, హంస నడక వంటి వినోదాత్మక పోటీలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 2004లో సద్గురు ప్రారంభించిన ఈశా గ్రామోత్సవం గ్రామీణ భారతదేశ స్ఫూర్తిని పునరుజ్జీవింపజేయాలనే లక్ష్యంతో నిర్వహించబడుతోంది. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని 15 జిల్లాల్లో జూలై 18 నుంచి సెప్టెంబర్ 6 వరకు క్లస్టర్, డివిజనల్, ఫైనల్ దశల్లో పోటీలు జరుగనున్నాయి. ప్రతి దశలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు మెరిట్ సర్టిఫికెట్లు, నగదు బహుమతులు అందజేయనున్నారు. సెప్టెంబర్ 6న కోయంబత్తూరులోని ఈశా యోగా సెంటర్‌లో ఆదియోగి సన్నిధిలో జరిగే ఫైనల్ పోటీల్లో విజేత జట్లకు ఈశా రిజువినేషన్ ట్రోఫీతో పాటు పురుషుల వాలీబాల్, మహిళల త్రోబాల్ విభాగాల్లో ఒక్కో విజేత జట్టుకు రూ.5 లక్షల చొప్పున నగదు బహుమతి అందజేయనున్నారు. మొత్తంగా కోటి రూపాయలకు పైగా నగదు బహుమతులు ఈ గ్రామోత్సవంలో ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


# ఏడుగురు నిందితుల అరెస్టు




**హన్మకొండ,జూలై26, (నినాదం):** ఒకే పార్టీలో పని చేస్తున్న ఇద్దరి వ్యక్తుల మధ్య రగులు కున్న పాతకక్ష్యల కారణంగా ఒక వ్యక్తిని హత్య చేయాలనే ఉద్దేశ్యంతో తోటి స్నేహితుల సహకారంతో వ్యక్తిపై పెట్రోల్ పోసి నిప్పంటించి మృతికి కారణమైన ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ కు పంపిన కేసు వివరాలను వరంగల్ సీపీ శ్వేత ఐపిఎస్ ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వరంగల్ ఎనుమాముల మార్కెట్ ఎన్టీఆర్ నగర్ కు చెందిన అడప మహేష్ అదే ప్రాంతానికి చెందిన పత్తి కుమార్ ఇద్దరి మధ్యలో రాజకీయ పాత కక్షలు ఉన్నాయి. మహేష్ వ్యాపారం చేసుకుంటుండగా కుమార్ ఆటో డ్రైవర్ గా కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అయితే గతంలో పత్రీ కుమార అలియాస్ కుమారస్వామి,ఒక హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష పడి బెయిల్‌పై తిరిగి వచ్చాడు. ప్రధాన నిందితుడు పత్తి కుమార స్వామి,అలియాస్ కుమార్, తనపై మృతుడు మహేష్ తనపై స్థానిక ప్రజాప్రతినిధి వద్ద తన రాజకీయ ప్రాధాన్యతను దెబ్బతీస్తున్నాడనే అనుమానంతో అడుప మహేష్‌పై ప్రధాన నిందితుడు పత్రి కుమార స్వామి పాత కక్షలను మనసులో పెట్టుకోని ఏవిధంగానైనా మహేష్ ను మట్టు పెట్టాలని ఉద్యేశంతో మిగితా నిందితులలైన గంధం నరేష్ 40, జన్ను మధు, 42, పిట్ల శ్రీనివాస్, సురేష్, ప్రస్తుతం పరారీ లో వున్నాడు, లాసాని రాం సాయి,తోని సంజయ్య, 36, 8.పోతారం శివకుమార్35, సికింద్రాబాద్‌కు చెందిన నిందితులు కలసి మృతుడు అడుప మహేష్‌ను హత్య చేసేందుకు సిద్ధపడి ఈ నెల 18వ తేదిన రాత్రి 9, నుండి 10 గంటల సమయంలో నిందితులు పరిమళ కాలనీ రోడ్డు నంబర్ 2 వద్ద మృతుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈ సంఘటలో మృతుడు తీవ్రంగా గాయంపడటంతో స్థానిక హస్పటల్‌లో చేర్పించారు. మహేష్ చికిత్స పోందుతూ ఈ నెల 19వ తేది రాత్రి 7గంటలకు మృతి చెందాడు. ఈ సంఘటనపై గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో మృతిని భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి కేసు దర్యాప్తు అధికారిగా విశ్వేశ్వర్ దర్యాప్తు చేపట్టారు. నిందితులను త్వరగా పట్టుకొనేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి ఈ హత్యకు పాల్పడిన ఏడుగురు నిందితులను అరెస్టు చేసి జూడిషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో దర్యాప్తుగా వేగంగా పూర్తి చేసి న్యాయస్థానం ద్వారా నిందితులకు శిక్షపడే విధంగా చర్యలు తీసుకొవడం జరుగుతుంది. ఈ కేసులో నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కబరిచనిన మామూనూరు ఏసీపీ వెంకట్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, దర్యాప్తు అధికారి విశ్వేశ్వర్, టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌స్పెక్టర్లు బాబులాల్, సుబ్బారెడ్డి,దేవేందర్,శ్రీధర్‌తో పాటు గీసుగొండ పోలీస్ స్టేషన్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అభినందనలు తెలియజేయడం జరిగింది.

# కాసుల కక్కుర్తి..

ప్రైవేట్ విద్యాసంస్థల వ్యాపారం
ఫీజుల దోపిడీ తప్ప..
నిబంధనలు పట్టని దుస్థితి
అర్హతలేని సిబ్బందితో బోధన
అసౌకర్యాల నడుమ స్కూళ్ల నిర్వహణ
చోద్యంచూస్తున్న విద్యాశాఖ
ఆందోళనలో తల్లిదండ్రులు



**భూపాలపల్లి ప్రతినిధి, జూలై 24(నినాదం):** జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా కొనసాగుతున్నాయి. యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను పట్టించు కోవడం లేదు. ఇష్టారాజ్యంగా స్కూళ్లు నడుపుతూ ఒక్కో విద్యార్థి నుంచి వేల రూపాయలు దండుకుంటున్నారు. అర్హత లేని టీచర్లతో బోధన, పరోక్షంగా పుస్తకాలు, యూనిఫాంల వ్యాపారం, స్టేట్, సెంట్రల్ సిలబస్ పేరిట అధిక ఫీజులు వసూలు... ఇలా చెప్పుకుంటే పోతే వారి ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది..

**వసతులు లేని స్కూళ్లకు అనుమతులు..**

జిల్లాలో 72 వరకు ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి. వీటి లో 10 శాతం స్కూళ్లు మాత్రమే నిబంధనలకు లోబడి నిర్వహిస్తున్నారు. నిబంధనలు పాటించని స్కూళ్లకు విద్యాశాఖ నుంచి అనుమతులు వస్తుండటం విమర్శలకు తావిస్తోంది. చాలా స్కూళ్లలో కనీస వసతులు కూడా లేవు. తరగతి గదికి కిటికీలు లేని స్కూళ్లు కూడా ఉన్నాయి. ఇలాంటి వాటికి కూడా ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు ఇస్తున్నారు. ప్రధాన రహదారులకు సమీపంలోని స్కూళ్లకు ప్రహరీలు కూడా లేవు. అలాంటి వాటికి పోలీసులు.. ట్రాఫిక్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు ఇస్తున్నారు. వసతులు లేని స్కూళ్లకు నోటీసులు పంపుతున్నామని విద్యాశాఖ అధికారు లు చెబుతున్నా పైనుంచి అనుమతులు మాత్రం ఆగడం లేదు.

**అంతా వ్యాపార ధోరణే...**

ప్రైవేట్ విద్యాసంస్థలు పూర్తిగా వ్యాపార రధోరణి ధోరణి అవలంభిస్తున్నాయి. విద్యార్థుల ఫీజులు మొదలుకొని, పుస్తకాలు, యూనిఫాం, రవాణా, టర్మ్ ఫీజుల పేరిట అందినకాడికి దండుకుంటున్నారు. ఏ మాత్రం సౌకర్యాలు లేని పాఠశాలల్లో కూడా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. ఎల్కేజీ నుంచి పదో తరగతి వరకు సంవత్సరానికి రూ. 15వేల నుంచి రూ. 40వేల వరకు వసూలు చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో నర్సరీ, ఎల్కేజీ పిల్లలకే ఏకంగా సంవత్సరానికి రూ. 25 వేలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే ఐదు నుంచి పది రెట్లు ఎక్కువ వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు కాకుండా నోట్ బుక్స్, ఆయా పాఠశాలల వర్క్ బుక్స్ పేరిట రూ. 3వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇవే పుస్తకాలు దుకాణాల్లో కొనుగోలు చేస్తే రూ.వెయ్యికి మించవని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ బయట పుస్తకాలు కొనుగోలు చేస్తే వాటిని స్కూల్ యాజమాన్యాలు అనుమతించడం లేదు. చాలా స్కూళ్లల్లో పుస్తకాలు, యూనిఫాంలను వారే విక్రయిస్తున్నారు.





# సమాజ సేవతోనే జర్నలిజానికి మరింత గౌరవం

**ఎన్‌యూ జే (ఐ)జాతీయ ఉపాధ్యక్షులు ఉక్కల్‌కర్ రాజేందర్ నాథ్**




**మెదక్ ప్రతినిధి, జూలై 26 (నినాదం ) :** సమాజ సేవతోనే జర్నలిజానికి మరింత గౌరవం పెరుగుతుందని ఎన్ యూ జే (ఐ )జాతీయ ఉపాధ్యక్షులు ఉక్కల్‌కర్ రాజేందర్ నాథ్ అన్నారు. తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) 12వ ఫౌండేషన్ డే వేడుకలు ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా టీజేఏ అధ్యక్షుడు ఉమా మహేశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎన్‌యూజే(ఐ) జాతీయ ఉపాధ్యక్షుడు ఉక్కల్‌కర్ రాజేందర్ నాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా మెదక్ బాలసదన్‌లోని చిన్నారులకు పండ్లు పంపిణీ చేసి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేస్తూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జర్నలిస్టులు సమాజానికి వార్తలు అందించడమే కాకుండా సామాజిక బాధ్యతలను కూడా నిర్వర్తించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం ఎన్‌జీఓ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో జర్నలిస్టుల సంక్షేమం, సంస్థ బలోపేతం, సభ్యత్వ నమోదు, వృత్తి పరిరక్షణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎన్‌యూజే(ఐ) జాతీయ ఉపాధ్యక్షుడు ఉక్కల్‌కర్ రాజేందర్ నాథ్ మాట్లాడుతూ, జర్నలిజం అనేది ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభమని, జర్నలిస్టుల ఐక్యతే వారి బలమని అన్నారు. మారుతున్న పరిస్థితుల్లో జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు సంఘటితంగా ఉంటేనే సంక్షేమం, హక్కుల సాధన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి జర్నలిస్టు టీజేఏ సభ్యత్వం తీసుకుని సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్‌యూజే కార్యవర్గ సభ్యుడు దన్నరపు రాజలింగం మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతరం పోరాడుతోందని, వృత్తి గౌరవం కాపాడేందుకు ప్రతి సభ్యుడు సంఘ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు. టీజేఏ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు చింతల నీలకంఠం మాట్లాడుతూ, జర్నలిజం విలువలను కాపాడుకోవడం నేటి తరానికి ఎంతో అవసరమని, నిజాయితీతో కూడిన వార్తా కథనాలే సమాజానికి మార్గదర్శకమవుతాయని అన్నారు. కామారెడ్డి జిల్లా టీజేఏ అధ్యక్షుడు సడక్ సునీల్ మాట్లాడుతూ, జిల్లాల స్థాయిలో జర్నలిస్టుల ఐక్యతను మరింత బలోపేతం చేసి, యువ జర్నలిస్టులను సంఘంలో భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందన్నారు. మెదక్ జిల్లా టీజేఏ అధ్యక్షుడు ఉమా మహేశ్వర్ మాట్లాడుతూ, జిల్లాలో టీజేఏ ను మరింత బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడుతున్నామని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులకు ఎన్‌యూజే(ఐ) సభ్యత్వ కార్డులు, టీజేఏ సభ్యత్వాలను నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా టీజేఏ కార్యవర్గ సభ్యుడు రాజేందర్ రావు, మెదక్ జిల్లా టీజేఏ కార్యదర్శి నాగేశ్వర్ రావు, జిల్లాలోని టీజేఏ ప్రతినిధులు, సభ్యులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# శ్రీ విఠలేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్



**నిర్మల్ ప్రతినిధి, కుబీర్: జూలై 26 ( నినాదం):** ద్వాదశ పర్వదినాన్ని పురస్కరించుకుని కుభీర్ మండల కేంద్రంలోని రెండవ పండరిపురంగా ప్రసిద్ధి చెందిన శ్రీ విఠలేశ్వర ఆలయాన్ని ముధోల్ శాసనసభ్యులు శ్రీ పవార్ రామారావు పటేల్ సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీ విఠల్–రుక్మిణి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ గారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమోళ్ళ దత్తు, మాజీ చైర్మన్ గంగాధర్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మండల నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

# భారీ వర్షంతో మెట్‌పల్లిలో జనజీవనంపై ప్రభావం..

**పలు ప్రాంతాల్లో తాత్కాలికంగా నీటి నిల్వలు.. రాకపోకల్లో ప్రజలకు అసౌకర్యం**




**మెట్‌పల్లి, జూలై 26 ( నినాదం ) :** ఆదివారం కురిసిన భారీ వర్షం ప్రభావంతో మెట్‌పల్లి పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో సాధారణ జనజీవనంపై ప్రభావం కనిపించింది. కొద్దిసమయంలో అధిక వర్షపాతం నమోదుకావడంతో పలు లోతట్టు ప్రాంతాలు, కాలనీలు, ప్రధాన కూడళ్లలో తాత్కాలికంగా వర్షపు నీరు నిలిచింది. దీంతో ప్రజలు, వాహనదారులు రాకపోకల్లో కొంత అసౌకర్యాన్ని ఎదుర్కొన్నారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, వెల్లుల్ల రోడ్డు, కూరగాయల మార్కెట్, బీట్ డిపో సర్కిల్ పరిసరాల్లో వర్షపు నీరు నిలిచిన పరిస్థితి స్థానికంగా గమనించబడింది. అలాగే జాతీయ రహదారిపైని కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడంతో వాహనాలు నెమ్మదిగా ప్రయాణించాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు అప్రమత్తంగా రాకపోకలు సాగించారు. కూరగాయల మార్కెట్ పరిసరాల్లో నీటి నిల్వల కారణంగా కొనుగోళ్ల కోసం వచ్చిన ప్రజలు, వ్యాపారులు కొంతసేపు జాగ్రత్తగా సంచరించాల్సి వచ్చింది. కొన్ని ప్రాంతాల్లో రహదారిపై నీరు నిలవడంతో రాకపోకలు మందగించిన పరిస్థితి కనిపించింది. కొన్ని కాలనీల్లో ఇళ్ల ముందు, వీధుల్లో వర్షపు నీరు నిలవడంతో చిన్నారులు, వృద్ధులు, ఉద్యోగులు, విద్యార్థులు తమ నిత్య కార్యకలాపాలకు వెళ్లే సమయంలో కొంత ఇబ్బంది ఎదుర్కొన్నట్లు స్థానికులు తెలిపారు. వర్షం తగ్గిన అనంతరం పలుచోట్ల బురద పేరుకుపోవడంతో రాకపోకలు మరికొంతసేపు నెమ్మదిగా సాగాయి. వర్షాకాలంలో తక్కువ సమయంలో అధిక వర్షపాతం నమోదైన సందర్భాల్లో కొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా నీటి నిల్వలు ఏర్పడే అవకాశం ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నీటి పారుదల సౌకర్యాలు నిరంతరం నిర్వహించడంతో పాటు, నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపడితే ప్రజలకు మరింత సౌలభ్యం కలుగుతుందని వారు సూచిస్తున్నారు. రానున్న రోజుల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు నీరు నిలిచిన ప్రాంతాల్లో జాగ్రత్తగా సంచరించాలని, వర్షపు నీటిలో దాగి ఉండే గుంతలు, తెరిచి ఉన్న డ్రైనేజీల సమీపంలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

## లింగ నిర్ధారణ చేస్తున్న స్కానింగ్ సెంటర్‌లపై

# కఠిన చర్యలు తీసుకోవాలి

**సోషల్ వర్కర్ వావిలాల రాజశేఖర్ శర్మ**



**నాగర్ కర్నూల్, జులై 26 (నినాదం) :** నాగర్ కర్నూల్ జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ చేస్తున్న స్కానింగ్ సెంటర్ లపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సోషల్ వర్కర్ వావిలాల రాజశేఖర్ శర్మ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కొన్ని ఆసుపత్రులు, నర్సింగ్‌హోంలు,స్కానింగ్ కేంద్రాలు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నాయని. గర్భస్థ శిశువులోని లోపాలను గుర్తించడానికి ఉపయోగించు కోవాల్సిన స్కానింగ్ యంత్రాలను లింగ నిర్ధరణకు వాడుతూ నిర్వాహకులు కాసులు దండుకొంటున్నారని ఆరోపించారు. అడిగినంత చేతిలో పెడితే చాలు అడ్డగోలుగా లింగ నిర్ధరణ పరీక్షలు,గర్భస్రావాలు చేయడం కొన్ని స్కానింగ్ కేంద్రాలు,నర్సింగ్‌హోంలకు పరిపాటిగా మారిందన్నారు..మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ) చట్టం ప్రకారం చాలా వరకు స్కానింగ్ కేంద్రాలకు రిజిస్ట్రేషన్‌లు లేకుండా నే లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు నిబంధనలను విరుద్ధంగా లింగనిర్ధరణ పరీక్షలు చేస్తుండటం వల్ల అమ్మాయి అని తెలిస్తే ఆ శిశువును భూమి మీదకు కొందరు రానివ్వకపోవడం శాపంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డగోలు స్కానింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టడానికి ప్రీ–కాన్సెప్షన్ అండ్ ప్రీ–నాట్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ (పీసీపీఎన్‌డీటీ) చట్టం ఉందని .నిబంధనలు ఉల్లంఘించినట్లు తనిఖీల్లో తేలితే కేసు నమోదు చేయవచ్చన్నారు. రుజువైతే గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించే అవకాశం. ఉంటుందని వీటిపై వైద్య ఆరోగ్యశాఖలు నిఘా పెట్టాల్సిన అవసరం ఉందని అనుమానం వస్తే డెకాయ్ ఆపరేషన్లు చేసి ప్రతి స్కానింగ్ కేంద్రానికి అనుమతి తో పాటు ఓ వైద్యుడు, రేడియాల జిస్టు ఉండాలన్నారు. ఏటా అనుమతిని పునరుద్ధరించు కోవాలని పీసీపీఎన్‌డీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయించు కోవాలని ఇచ్చట లింగ నిర్ధరణ పరీక్షలు చేయడం లేదనే బోర్డులు పెట్టించాలని కోరారు.

**చర్యలు తీసుకోవడం బాధాకరం..**

గర్భస్రావం చేసే ఆసుపత్రులు, నర్సింగ్‌హోంలు ఎంటీపీ కింద రిజిస్ట్రేషన్ అయి ఉండాలి. ప్రత్యేక పరిస్థితుల్లో చేయాల్సి వస్తే. సంబంధిత వైద్యుడి సిఫారసు,తగిన ధ్రువీకరణ తప్పనిసరి.

**అడ్డగోలు వసూళ్లు...**

ఇవేవీ పట్టని కొన్ని కేంద్రాలు గర్భస్రావానికి వచ్చే ఒక్కొక్కరి నుంచి రూ.20–25 వేల వరకు వసూలు చేస్తున్నాయి.. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటూ చర్యలు తీసుకోవడం లో నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్న అవినీతి అధికారుల పై కొరడా జులిపించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

## నీరు ఇలా ఉంటే..

# ప్రయాణం చేసేది ఎలా సారు..!




**అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తున్న మల్లెచెట్టు చౌరస్తా..!**
**మంత్రి పొన్నం ఇలాకలో అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు తప్పని ఇబ్బందులు..!**

**హుస్నాబాద్, జూలై 26(నినాదం :** నియోజకవర్గ కేంద్రం అయిన హుస్నాబాద్ పట్టణంలోని అత్యంత రద్దీ ప్రాంతమైన మల్లెచెట్టు చౌరస్తాలో చిన్నపాటి వర్షం కురిసినా రహదారిపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షపు నీరు వెళ్లేందుకు సరైన కాలువల వ్యవస్థ లేకపోవడంతో రహదారిపై నీరు నిలిచి ప్రయాణానికి ఆటంకం కలుగుతోంది. గుంతలు నీటితో నిండిపోవడంతో వాటి లోతు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడే పరిస్థితులు నెలకొంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి శుక్రవారం జరిగే వారసంత రోజున ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది:– హుస్నాబాద్ పట్టణంలోని పోలీస్ స్టేషన్, ఎల్లమ్మ చెరువు, ఎల్లమ్మ ఆలయం, వారసంతకు వెళ్లే ప్రధాన రహదారి ఇదే కావడంతో నిత్యం వందలాది మంది ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా శుక్రవారం సంతకు వచ్చే ప్రజలు నీరు నిలిచిన రహదారిపై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రయాణించే ఈ ప్రధాన మార్గంలోనే ఇలాంటి పరిస్థితులు నెలకొనడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు మండిపడుతున్నారు. ప్రతిరోజూ రద్దీగా ఉండే ఈ చౌరస్తాలో వర్షం పడినప్పుడల్లా నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటమే కాకుండా ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైన ప్రతిసారి ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని, తాత్కాలిక మరమ్మతులతో కాలం గడపకుండా రహదారిని పూర్తిస్థాయిలో మరమ్మతు చేసి, వర్షపు నీరు నిల్వకుండా కాలువల వ్యవస్థను మెరుగుపరచాలని స్థానికులు, వ్యాపారులు, వాహనదారులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. మరిన్ని ప్రమాదాలు జరిగేలోపు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

## అమ్మ ఆశీస్సుల కోసం..

# బోనాల భక్తి వెల్లువ




**మంచిర్యాల, జూలై 26 (నినాదం):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 56వ డివిజన్ హమాలీవాడ నల్ల పోచమ్మ దేవాలయంలో ఆషాఢమాస బోనాల జాతరను ఆదివారం భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ దర్ని మధుకర్ అమ్మవారిని దర్శించుకుని వేద పండితుల ఆశీర్వాదం పొందారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, మంచిర్యాల పట్టణం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నల్ల శంకర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేష్, జోగిని నిషా క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు సవరణ పక్రియలో మొద్దులగూడెం టాప్..100శాతం పూర్తి

**బిఎల్‌ఏ దొడ్డాభాస్కరరావు, స్వర్ణాల శ్రీనివాసరావుకు ఘన సత్కారం...**
**ప్రతి పంచాయితీ మొద్దులగూడెంని ఆదర్శంగా తీసుకోవాలి... జిల్లా అధ్యక్షురాలు**



**దమ్మపేట, జూలై 26(నినాదం):** ఓటరు సవరణ ప్రక్రియ సర్ లో భాగంగా అశ్వారావుపేట నియోజకవర్గంలోనే మొట్టమొదటిగా 100 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియను అత్యంత వేగంగా, విజయవంతంగా పూర్తి చేసినందుకు గాను మొద్దుల గూడెం105, 106 బూత్ లెవెల్ ఏజెంట్ లు దొడ్డా భాస్కరరావు, స్వర్ణాల శ్రీనివాసరావును కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్న శాలువాతో ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఓటరు జాబితా నమోదు, మార్పులు, చేర్పుల సవరణ కార్యక్రమం ముమ్మరంగా సాగుతున్న తరుణంలో, సాంకేతిక తను జోడించి డిజిటలైజేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయడంలో దొడ్డా భాస్కరరావు, శ్రీనివాసరావు చూపిన చొరవను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ప్రత్యే కంగా అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటరు జాబితాలో తప్పులు లేకుండా డిజిటలైజ్ చేయడం ఎంతో బాధ్యతతో కూడుకున్న పనని పేర్కొన్నారు. డిజిటలైజేషన్ ప్రక్రియలో దొడ్డ భాస్కరరావు, స్వర్ణాల శ్రీనివాసరావు నియోజకవర్గానికే ఆదర్శంగా నిలిచారని, మిగిలిన బూత్‌ల నిర్వాహకులు, ఏజెంట్లు కూడా ఇదే స్ఫూర్తితో పనిచేసి గడువులోగా ప్రక్రియను పూర్తి చేయా లని పిలుపునిచ్చారు. సమర్థవంతంగా పనిచేసే కార్యకర్త లకు, నాయకులకు పార్టీలో ఎల్లప్పుడూ సరైన గుర్తింపు ఉంటుందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల పార్టీ ముఖ్య నాయకులు, నియోజకవర్గ స్థాయి ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



# కఠిన శిక్షలు అవసరమే... సాంకేతికతే శాశ్వత పరిష్కారం!

**ప్రశ్నపత్రం లీకైతే పోయేది కాగితం కాదు...
లక్షలాది మంది యువత భవిష్యత్తు.**

**ఒక లీకేజీతో నేరస్థులు కోట్లు గడిస్తే...
నిజాయితీగా చదివిన విద్యార్థికి మిగిలేది నిరాశే.**

**అందుకే కఠిన శిక్షలు అవసరం.
అంతకంటే అవసరమైనది లీకేజీకి తావులేని పరీక్షా వ్యవస్థ.**

**చట్టం నేరస్థుడిని శిక్షిస్తుంది...
సాంకేతికత నేరానికి అవకాశాన్నే మూసేస్తుంది.**

ఎడిటోరియల్

దేశవ్యాప్తంగా వరుసగా వెలుగుచూస్తున్న ప్రశ్నపత్రాల లీకేజీలు పరీక్షా వ్యవస్థపై విద్యార్థుల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పబ్లిక్ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టం–2024'ను మరింత కఠినతరం చేస్తూ దోషులకు 10 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపింది. లీకేజీ కేసుల విచారణ కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి మూడు నెలల్లోనే తీర్పు వచ్చేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించడం కూడా స్వాగతించదగిన పరిణామమే.

ఇలాంటి నేరాలకు కఠిన శిక్షలు తప్పనిసరి. ఎందుకంటే ఇది ప్రశ్నపత్రం దొంగతనం మాత్రమే కాదు. లక్షలాది మంది విద్యార్థుల శ్రమను, తల్లిదండ్రుల ఆశలను, ప్రభుత్వ నియామక వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసే సామాజిక నేరం. అయితే అసలు ప్రశ్న ఇక్కడే మొదలవుతుంది. లీకేజీ జరిగిన తర్వాత శిక్షించడం గొప్పదా? లేక లీకేజీ జరగకుండా వ్యవస్థను మార్చడం గొప్పదా?

సమాధానం స్పష్టంగా రెండో దానికే అనుకూలంగా ఉంటుంది. ఇప్పటికీ అనేక పరీక్షల్లో ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణా, భద్రపరిచే ప్రక్రియల్లో మానవ ప్రమేయం అధికంగా ఉంది. ఈ బలహీనతలనే లీకేజీ ముఠాలు అవకాశంగా మార్చుకుంటున్నాయి. అందుకే చట్టంతో పాటు పరీక్షల నిర్వహణలోనూ సమూల మార్పులు అవసరం.

దీనికి ఉత్తమ ప్రత్యామ్నాయం సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానం. ఇందులో ప్రశ్నపత్రాలను ముందుగానే ముద్రించాల్సిన అవసరం ఉండదు. పరీక్ష ప్రారంభానికి కొద్ది నిమిషాల ముందు మాత్రమే అత్యంత భద్రత కలిగిన సర్వర్ ద్వారా ప్రశ్నలు పరీక్షా కేంద్రాలకు చేరతాయి. వేలాది ప్రశ్నలతో కూడిన ప్రశ్నల బ్యాంక్ నుంచి ప్రతి అభ్యర్థికి కంప్యూటర్ యాదృచ్ఛికంగా ప్రశ్నలను ఎంపిక చేస్తుంది. ప్రశ్నల క్రమం, సమాధానాల ఎంపికలు కూడా ఒక్కో అభ్యర్థికి వేర్వేరుగా ఉండేలా రూపొందించవచ్చు. దీంతో సంప్రదాయ ప్రశ్నపత్రాల లీకేజీలకు అవకాశాలు గణనీయంగా తగ్గుతాయి. భారతదేశంలో ఇప్పటికే జేఈఈ మెయిన్, యూజీసీ నెట్, సీయూఈటీ, బ్యాంకింగ్, ఎస్ఎస్‌సీ, రైల్వే వంటి అనేక జాతీయ స్థాయి పరీక్షలు సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ అనుభవాన్ని ఆధారంగా తీసుకొని రాష్ట్ర స్థాయి ప్రవేశ, నియామక పరీక్షలను కూడా దశలవారీగా ఇదే విధానంలోకి తీసుకురావాలి.

దీనితో పాటు ఎండ్–టు–ఎండ్ ఎన్‌క్రిప్షన్, బయోమెట్రిక్ ధృవీకరణ, ఫేస్ రికగ్నిషన్, కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత పర్యవేక్షణ, సురక్షిత బ్రౌజర్లు, సీసీటీవీ నిఘా, డిజిటల్ ఆడిట్ లాగ్స్ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను తప్పనిసరిగా అమలు చేయాలి. ప్రశ్నపత్రాన్ని ఎవరైనా అనధికారికంగా యాక్సెస్ చేయడానికి ప్రయత్నించినా వెంటనే గుర్తించే భద్రతా వ్యవస్థ ఉండాలి. గ్రామీణ ప్రాంతాల వరకు నాణ్యమైన పరీక్షా కేంద్రాలు, వేగవంతమైన ఇంటర్నెట్, శిక్షణ పొందిన సిబ్బంది, బలమైన సైబర్ భద్రతను ప్రభుత్వం కల్పించాలి.

కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కఠిన చట్టం సరైన దిశలో అడుగే. కానీ శిక్ష నేరస్థుడిని శిక్షిస్తుంది. సాంకేతికత నేరం జరిగే అవకాశాన్నే తగ్గిస్తుంది. ఈ రెండూ కలిసినప్పుడే పరీక్షా వ్యవస్థపై విద్యార్థుల విశ్వాసం పునరుద్ధరించబడుతుంది.

ప్రశ్నపత్రాల లీకేజీలకు శాశ్వత ముగింపు కావాలంటే చట్టం కఠినంగా ఉండాలి. అంతకంటే కఠినంగా పరీక్షా వ్యవస్థ డిజిటల్‌గా మారాలి. సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్), బలమైన సైబర్ భద్రత, వేగవంతమైన న్యాయవ్యవస్థ, పారదర్శక పరీక్షా నిర్వహణ—ఈ నాలుగు స్తంభాలపైనే భారత పరీక్షా వ్యవస్థ భవిష్యత్తు నిలవాలి. అప్పుడే నిజాయితీగా చదివిన ప్రతి విద్యార్థి శ్రమకు న్యాయం జరుగుతుంది.



**శ్రీశైలం దూడం**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, జగిత్యాల**
**9133947176**

# చినుకు కోసం వెతుకుతున్నాడు



భానుడి వేడి చురకలకు కరిగిపోయే
కదలి తన గుణాన్ని మరిచిపోయి
సుతారంగా సుప్తావస్థలోకి
జారిపోయింది
నీటి ఆవిరి నింగిలోకి చేరడం
మరిచిపోయి
నింగికి నేలకు బంధం
తెగిపోయినట్లయింది

నింగిలో కదిలే మేఘాలు కనుమరుగై
నిరాశల చీకట్లు చిక్కగా కమ్ముకొని
కర్షకుల కళ్ళల్లో కన్నీళ్లు సుడులు సుడులుగా
తిరుగుతున్నాయి
చినుకుకు తనువంతా చిత్తడయ్యే నేల
ఇప్పుడు నెర్రెలు బారి దాహం కోసం
ఎడారిలో నీళ్ల కోసం వెతికే జీవిలా మారింది

ఎన్నో ఆశలను పోగేసుకున్న రైతన్న
ప్రకృతి తిరోగమనానికి మనసు చెరువై
గుండె బరువై దిగులు పక్షిలా దీనంగా చూస్తుండు
శూన్యం పెయ్యిపై పేరిణి నాట్యమాడుతుంటే
రైతన్న భవిత బీటలు బారుతుంది


ఇప్పుడు రైతన్న యుద్ధంలో ఓడిపోయిన
సైనికుడిలా నిరాశల శూన్యంలో నడుస్తుండు
పచ్చని పొలం గట్ల మధ్య తిరిగే రైతు
నేడు నింగికి నీలాలను కట్టేసి
మౌన వంతెనపై మునిలా సాగుతున్నాడు

రైతన్న బతుకు ఎప్పుడూ అతుకుల బొంతే
మనసంతా అలజడుల చింతే
ఇప్పుడు అందరూ గుడిలో దేవుడి కోసం
వెతుకుతుంటే రైతన్న మాత్రం చినుకు కోసం
వెతుకుతున్నాడు
జనం వరాల కోసం దేవున్ని కొలిస్తే
నేను మాత్రం రైతన్న మేలు కోసం తలుస్తా
ఎందుకంటే నేను తినే నాలుగు మెతుకులు అతడు
పెట్టిన బిక్షే కదా !

**✍ తాటిపాముల రమేశ్ (తార)**
**7981566031**

# అబ్దుల్ కలాం జీవితం నేర్పుతున్న పాఠాలను జీర్ణించుకుందాం !

(27 జూలై 'ఏ పి జె అబ్దుల్ కలాం వర్ధంతి' సందర్భంగా)



**'లీడ్ ఇండియా' అంటూ యువతను దేశాభివృద్ధి మహాయజ్ఞంలో పాలు పంచుకోవాలని పిలుపును ఇచ్చిన మన ప్రియతమ ఏ. పి. జె. అబ్దుల్ కలాం భరతమాత ముద్దు బిడ్డగా జాతి గౌరవాన్ని అంతర్జాతీయ వేదికల మీద చాటి చెప్పి అనన్య సామాన్యుడు, మేరునగ ధీరుడు, అనితరసాధ్యమైన, అద్వితీయ ఘనుడు. భారత 11వ రాష్ట్రపతిగా (2002-07) విశిష్ట సేవలందించి 'పీపుల్స్ ప్రెసిడెంట్'గా ప్రజల గుండెల్లో చెరగని ముద్రను వేసిన అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం 15 అక్టోబర్ 1931న ప్రముఖ దక్షిణ భారత తీర్థ స్థలం రామేశ్వరం పట్టణంలో పేద తమిళ ముస్లిమ్ కుటుంబంలో ఆశియమ్మ - జైనులబ్దీన్ దంపతులకు జన్మించారు. రామేశ్వరంలో పాఠశాల విద్య, తిరుచురాపల్లి సెయింట్ జోసెఫ్ కాలేజీలో భౌతిక శాస్త్రం (1954), మద్రాస్ యంఐటిలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ (1960) పట్టాలు పొందారు.**

**మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా:**

అతి సాధారణ విద్యార్థి దశ నుంచి అసాధారణ మేధావిగా కలాం ఎదిగిన క్రమం విలక్షణం, ఆశ్చర్యకరం. నాలుగు దశాబ్దాల ఉద్యోగపర్వంలో ఏరోస్పేస్ సైంటిస్ట్‌గా, సైన్స్ అడ్మినిస్ట్రేటర్‌గా విలక్షణ సేవలందించే క్రమంలో డిఆర్‌డిఓ (డిఫెన్స్ రీసర్చ్ అండ్ డెవలంప్‌మెంట్ ఆర్గనైజేషన్), ఇస్రో (ఇండియన్ స్పేస్ రీసర్చ్ ఆర్గనైజేషన్) సంస్థల్లో పరిపాలనాదక్షుడిగా, మిలటరీ మిసైల్ రూపశిల్పిగా తన సత్తా చాటి 'మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా కీర్తించబడ్డారు. ప్రధాని ముఖ్య వైజ్ఞానిక శాస్త్ర సలహాదారుగా, డిఆర్‌డిఓ సెక్రటరీగా 1992 నుంచి 1999 వరకు పని చేశారు. స్వావలంభన దిశగా భారతదేశాన్ని న్యూక్లియర్ ఎనర్జీ కలిగిన దేశంగా నిలపటానికి 1998లో పోక్రాన్–II పరీక్షలను పర్యవేక్షించి ప్రజల చేత జేజేలు అందుకున్నారు. భారత వాయు సేనలో ఫైటర్ పైలెట్‌గా పని చేయాలనుకున్న కలాం ఏరోస్పేస్ శాస్త్రజ్ఞుడిగా ఎవరికీ అందనంత ఎత్తుకు ఎదిగారు. ఇంజనీర్, సైంటిస్ట్, రచయిత, ఆచార్యులు, యువత ఆరాధ్య దైవం, ఆదర్శ రాజకీయవేత్త, యువతకు మార్గదర్శిగా బహుముఖీన ప్రతిభ కలిగిన అబ్దుల్ కలాం బోధనలు అనితరసాధ్యాలు. నేను చేయగలననే దృఢ సంకల్పమే విజయాలను అందిస్తుందని, ఎవరి తలరాతను వారే లిఖించుకోవాలని, నిజాయితీగల హృదయంతోనే అసలైన ఆకర్షణీయ వ్యక్తిత్వం వ్యక్తం అవుతుందని బోధనలు చేశారు.

**కలలు కందాం, సాకారం చేసుకుందాం:**

'ఉన్నత కలలు కనండి, సాకారానికి కఠోర సాధన చేయండి' అంటూ నినదించిన కలాం జీవితం తెరిచిన పుస్తకం, యువతకు మార్గదర్శకం. పడవలు నడిపే వృత్తిలో పేరుగాంచిన కలాం కుటుంబం, వ్యాపారంలో నష్టం రావడంతో కష్టాల కడలిలో పట్టుదలతో చదువులను కొనసాగిస్తూ, పేపర్ బాయ్‌గా పని చేస్తూ, ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌ను పూర్తి చేయగలగడం నేటి యువతకు ప్రేరణాత్మకం. ఉద్యోగిగా తన సీనియర్స్ డా: విక్రమ్ సారాభాయ్, ఆచార్య సతీష్ ధవన్, డా: బ్రహ్మ ప్రకాశ్ లాంటి దిగ్గజాల వద్ద నాయకత్వ పటిమను, అంతరిక్ష శాస్త్రసాంకేతిక మెలకువలను నేర్చుకున్నారు. 1969లో ఇస్రోకు బదిలీ అయిన కలాం నేతృత్వంలో భారత తొలి స్వదేశీ పరిజ్ఞానంతో 'సాటలైట్ లాంచింగ్ వెహికిల్ (యస్‌యల్‌వి–3')ను రూపొందించుటలో విజయం సాధించారు. 1970–90ల మధ్య పియస్‌యల్‌వి (పోలార్ సాటలైట్ లాంచింగ్ వెహికిల్)తో పాటుగా యస్‌యల్‌వి–3లను అభివృద్ధి చేయుటలో ప్రధాన భూమికను నిర్వహించారు. 'బాలిస్టిక్ మిసైల్' టెక్నాలజీతో 'ప్రాజెక్ట్ డెవిల్', 'ప్రాజెక్ట్ వాలియంట్'లను రూపొందించడంలో మార్గదర్శనం చేశారు. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిసైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఐజియండిపి) ద్వారా కలాం చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా ₹ 3.88 బిలియన్ పెట్టుబడితో పరిశోధనలు కొనసాగించారు. 'అగ్ని', 'పృథ్వి'మిసైల్‌లను విజయవంతంగా నిర్మించగలిగారు. 1998లో చవకైన 'కలాం–రాజు కరోనరీ స్టంట్'ను, 2012లో 'కలాం–రాజు టాబ్లెట్' హెల్త్‌కేర్ కంప్యూటర్‌ను రూపొందించారు. టెక్నాలజీ సహాయంతో ఆర్థిక, వ్యవసాయ, ఆరోగ్య, విద్యారంగాలను పరిపుష్టం చేయవచ్చని గట్టిగా నమ్మిన కలాం ముందు చూపు అద్వితీయం. 'జననం సాధారణమే కావచ్చు, మరణం మాత్రం చరిత్ర సృష్టించేదిగా ఉండాలని' ఉద్భోధించారు.

**లీడ్ ఇండియా రూపశిల్పి:**

25 జూలై 2002న రాష్ట్రపతి పదవిని చేపట్టి భారత తొలి పౌరుడిగా 'ప్రజా రాష్ట్రపతి'గా పేరు తెచ్చుకున్నారు. భారత అత్యుత్తమ 'భారత రత్న'అవార్డు పొందిన ఏకైక తొలి సైంటిస్ట్, బాచిలర్ కలాం అనంతరం రాష్ట్రపతిగా విశిష్ట సేవలు అందించారు. రాష్ట్రపతిగా పదవీ విరమణ చేసిన అనంతరం అబ్దుల్ కలాం 'లీడ్ ఇండియా – 2020' ఉద్యమాన్ని ప్రారంభించి ఐదేళ్ళలో 5 లక్షల యువతకు మార్గదర్శకం చేయాలనే లక్ష్యాన్ని ఛేదించుటకు కృషి చేశారు. నేటికీ కలాం స్థాపించిన 'లీడ్ ఇండియా ఫౌండేయన్' అనబడే 2వ స్వాతంత్ర్య ఉద్యమాన్ని తన అభిమానులు 'లీడ్ ఇండియా నేషనల్ క్లబ్స్' వేదికగా యువతను సన్మార్గంలో నిలిపే పలు అసమాన్య సేవలను కొనసాగించడం హర్షదాయకం. అనేక అగ్ర విద్యాసంస్థలు ఐఐయం, ఐఐయస్‌సి, ఐఐటి, బిహెచ్‌యు, అన్నా విశ్వవిద్యాలయాలకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా అమూల్య సేవలు, అనుభవసారాలు అందజేశారు. తన జీవితకాలంలో 40కి పైగా విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకోగలిగారు. నేడు కలాం వదిలి వెళ్లిన లీడ్ ఇండియా ఉద్యమానికి ఆధునిక సవరణలు చేసి "లీడ్ ఇండియా 2047" పేరుతో "విశ్వగురు వికసిత్ భారత్" లక్ష్యంగా పలు కార్యక్రమాలను చేపట్టడం కొనసాగుతోంది.

**పురస్కారాలే పులకించిన వేళ:**

అత్యుత్తమ పౌర పురస్కారం భారత రత్నతో పాటు పద్మవిభూషన్, పద్మ భూషన్, ఇందిరా గాంధీ జాతీయ సమైక్యత అవార్డు, వీర సావర్కర్, శస్త్ర రామానుజన్, వాన్ బ్రాన్ లాంటి పలు అవార్డులతో సన్మానాలు అందుకున్నారు. తన అనుభవాలను, ఆలోచనలను భవిష్యత్ తరాలకు అందించాలనే సదుద్దేశ్యంతో 'వింగ్స్ ఆఫ్ ఫైర్', 'ఇండియా–2020', 'ఇగ్నైటెడ్ మైండ్స్', 'ఇండామిటబుల్ స్పిరుట్స్' లాంటి పలు పుస్తకాలు రచించారు. 26 జూలై 2015న ఐఐయం, షిల్లాంగ్‌లో విద్యార్థి యువతతో ముచ్చటిస్తూనే 83వ ఏట తుది శ్వాస విడిచిన ఏ. పి. జె. అబ్దుల్ కలాం జీవితం ఆసాంతం అనుసరణీయం, సదా స్మరణీయం.

**అబ్దుల్ కలాం జీవితం నేర్పిన పాఠాలు :**

భారత రత్న, రాష్ట్రపతి అయిన డా: ఏ పి జె అబ్దుల్ కలాం స్వంత ఆస్తి కొన్ని పుస్తకాలు, కొన్ని దుస్తులు మాత్రమే. ఇలాంటి అద్వితీయ వినయ నిరాడంబర వ్యక్తిత్వం మనందరికీ దారి దీపం కావాలి. మనం అలంకరించిన పదవుల కన్న మనం సాధించిన ఘనకార్యాలు మనకు శాశ్వత గుర్తింపును ఇస్తాయని కలాం జీవితం బోధిస్తోంది. వైఫల్యం మనకు శక్తివంతమైన అనుభవాన్ని, గుణపాఠాన్ని నేర్పుతుందని నమ్మారు క్రమశిక్షణ, కఠోర శ్రమ మాత్రమే సత్ఫలితాలను ఇస్తాయని నమ్మి, రోజు ఉదయం దిన పత్రికలను పంచుతూ కొంత డబ్బును సంపాదించి కుటుంబానికి ఆసరాగా నిలిచారు. కలలు కనండి, కలల సాకారానికి శ్రమించాలని చెప్పకనే చెప్పారు. మన పుస్తకాలు మనకు అపూర్వ నేస్తాలు కావాలని సూచించారు. ఒక మంచి పుస్తకం వెయ్యి మంది స్నేహితులతో సమానమని బోధించారు. దేశం కోసం, సమాజ అభివృద్ధి కోసం తపన పడాలని యువతకు పిలుపును ఇచ్చారు. మత సామరస్యాన్ని పాటిస్తూ, మానవీయ విలువకు పట్టం కట్టాలని తన ప్రవర్తనతో రుజువు చేశారు. మనకు తెలిసిన విజ్ఞానాన్ని యువత, పాఠశాల విద్యార్థులకు బోధించాలని కోరారు. మనం సూర్యుడి వలె వెలుగులు పంచాలంటే, సూర్యుడి వలె మండాలని తెలిపారు.

బలమైన విజయకాంక్షతోనే అపజయాలను అధిగమించాలని, విద్య రెక్కలతోనే ఎదిగాలంటూ నినదించిన కలాం దార్శనికత పరమ పవిత్రం, ప్రగతికి ఇంధనం. 'సక్సెస్ అంటే మన సంతకం ఆటోగ్రాఫ్‌గా మారడమే' అని నినదించిన కలాం 'కల అంటే నిద్రలో వచ్చేది కాదని, నిద్ర పోనివ్వకుండా విజయం వరించే దాకా మనల్ని కార్యోన్ముఖులను చేసేది' అని నమ్మిన అపూర్వ మూర్తిమత్వ నిధి మన అజేయ అబ్దుల్ కలాం సామాన్య ప్రజల మదిలో తిష్టవేసిన ప్రేరణామూర్తి, నిత్య చైతన్య స్ఫూర్తి.

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**



## అనాథలు, నిరాశ్రయులకు
# 305వ అన్నదాన కార్యక్రమం

హైదరాబాద్ నగరంలోని రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్న అనాథలు, నిరాశ్రయులను గుర్తించి స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 305వ అన్నదాన కార్యక్రమం నిర్వహించాము. ఆకలితో అలమటిస్తున్న వారికి కనీసం ఒక్కపూటైనా ఆహారం అందించాలనే లక్ష్యంతో క్రమం తప్పకుండా ప్రతినెల రెండవ, నాల్గవ ఆదివారములు అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్ వై. సంజీవ కుమార్ వైస్ ప్రెసిడెంట్, ఓ. పావని, అగస్య తదితరులు పాల్గొన్నారు.

**డాక్టర్ వై. సంజీవ కుమార్**
**ఫౌండర్ & ప్రెసిడెంట్**
**స్కై ఫౌండేషన్**



# పదవి తాత్కాలికం–నైతికత శాశ్వతం

## భారత రాజకీయాల్లో జవాబుదారీతనం
## అధికారం కంటే బాధ్యతే మిన్న: ప్రజాస్వామ్యంలో నైతిక రాజీనామాలు





**భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికార పదవి అనేది కేవలం పాలనా హక్కు మాత్రమే కాదు, అంతకుమించి అది ప్రజా బాధ్యత. పరిపాలనా లోపాలు, సాంకేతిక వైఫల్యాలు లేదా ఊహించని విపత్తుల కారణంగా ప్రజల ప్రాణాలకు, భద్రతకు తీవ్ర విఘాతం కలిగినప్పుడు వాటికి నైతిక బాధ్యత వహిస్తూ పదవి నుంచి తప్పుకోవడం రాజకీయ నైతికతకు పరమావధిగా నిలుస్తుంది. రాజ్యాంగబద్ధంగా లేదా చట్టపరంగా తప్పు నిరూపితం కాకపోయినా, ప్రజామోదానికి మరియు బాధ్యతాయుత పాలనకు గౌరవం ఇస్తూ రాజీనామా చేయడాన్ని పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో అత్యున్నత విలువగా పరిగణిస్తారు. ఇటీవల కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దేశవ్యాప్తంగా కలకలం రేపిన పరీక్షల అక్రమాలు మరియు నిర్వహణా వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా సమర్పించిన నేపథ్యంలో, భారత రాజకీయ చరిత్రలో నైతిక బాధ్యతతో కూడిన రాజీనామాల సంస్కృతిపై పునరాలోచన మరియు లోతైన విశ్లేషణ అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.**

బ్రిటిష్ వెస్ట్‌మినిస్టర్ పార్లమెంటరీ సాంప్రదాయం నుండి మన రాజ్యాంగ వ్యవస్థ స్వీకరించిన "మంత్రి వర్గ ఉమ్మడి మరియు వ్యక్తిగత బాధ్యత" సిద్ధాంతం ప్రకారం, ఒక శాఖలో జరిగే ప్రతి చిన్న, పెద్ద పరిణామానికి ఆ శాఖాధిపతిగా మంత్రి జవాబుదారీ కావలసి ఉంటుంది. మన దేశ స్వతంత్ర రాజకీయ చరిత్రను పరిశీలిస్తే, ఇటువంటి ప్రజా బాధ్యతను అంగీకరించి పదవులను త్యజించిన ఘట్టాలు అరుదుగా కనిపించినప్పటికీ, ఆ కొన్ని సంఘటనలు దేశ రాజకీయ దిక్సూచిగా మారాయి. ఆ క్రమంలో నైతికతకు నిలువెత్తు నిదర్శనంగా ముందుగా గుర్తుకువచ్చే మహోన్నత నాయకుడు లాల్ బహదూర్ శాస్త్రి. 1956 నవంబర్ 23న తమిళనాడులోని అరియలూర్ వద్ద ఘోర రైలు ప్రమాదం సంభవించి 142 మంది అమాయక ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. నాటి కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్న శాస్త్రి, ఈ దుర్ఘటనకు సాంకేతిక కారణాలు ఏవైనప్పటికీ, శాఖాపరమైన అధిపతిగా నైతిక బాధ్యత పూర్తిగా తనదేనని ప్రకటిస్తూ తన రాజీనామా పత్రాన్ని ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు సమర్పించారు. తొలుత నెహ్రూ దానిని నిరాకరించినప్పటికీ, ప్రజాస్వామ్య సూత్రాలకు కట్టుబడిన శాస్త్రి తన నిర్ణయంపై దృఢంగా నిలబడి రాజీనామాను ఆమోదింప జేసుకున్నారు. ఇది రాజీనామాల సంస్కృతికి ఒక మార్గదర్శక ప్రమాణంగా నిలిచింది.
అలాగే, 1983లో ఈశాన్య రాష్ట్రమైన నాగాలాండ్‌లో శాంతిభద్రతల క్షీణత, తీవ్రవాద చొరబాట్లు మరియు పరిపాలనా సంక్షోభం తీవ్రరూపం దాల్చిన తరుణంలో నాటి కేంద్ర హోం మంత్రి పాములపర్తి వెంకట నరసింహారావు నైతిక బాధ్యతను స్వీకరిస్తూ తన పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత కాలంలో వారు విదేశాంగ, రక్షణ వంటి కీలక శాఖలను సమర్థవంతంగా నిర్వహించి, 1991లో భారత ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి చారిత్రాత్మక ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టడం మరో అధ్యాయం.
1987లో భారత రాజకీయాలను కుదిపేసిన బోఫోర్స్ రక్షణ ఒప్పంద వ్యవహారంలో పారదర్శకతను మరియు నైతిక విలువలను ఎలుగెత్తి చూపుతూ నాటి రక్షణ మంత్రి విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ తన పదవిని వీడారు. ఆ నిర్ణయం తదనంతర కాలంలో దేశంలో అవినీతి వ్యతిరేక ఉద్యమానికి విత్తనం వేసి, 1989 నాటి సాధారణ ఎన్నికల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మరియు వి.పి. సింగ్ ప్రధానమంత్రి కావడానికి దారితీసింది.

రైల్వే మరియు విమానయాన రవాణా రంగాల్లో సంభవించిన దుర్ఘటనలకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేసిన సంఘటనలు కూడా భారత రాజకీయాల్లో ప్రత్యేక ముద్ర వేశాయి. 1993లో జరిగిన విమాన ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ నాటి పౌర విమానయాన శాఖ మంత్రి మాధవరావు సింధియా తన పదవికి రాజీనామా చేసి రాజకీయ పరిపక్వతను చాటుకున్నారు. 1999 ఆగస్టు 2న పశ్చిమ బెంగాల్‌లోని గైసల్ వద్ద బ్రహ్మపుత్ర మెయిల్, అవధ్–అస్సాం ఎక్స్‌ప్రెస్ రైళ్లు పరస్పరం ఢీకొన్న దారుణ ప్రమాదంలో 285 మందికి పైగా ప్రయాణికులు మరణించగా, వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాదానికి చలించిపోయిన నాటి కేంద్ర రైల్వే మంత్రి నితీశ్ కుమార్ తక్షణమే నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారు. అదే విధంగా 2017లో ఉత్తర ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ నాటి ప్రయాణికుల రైలు పట్టాలు తప్పిన సంఘటన మరియు ఇతర రైలు ప్రమాదాల పరంపరకు బాధ్యత వహిస్తూ అప్పటి రైల్వే మంత్రి సురేష్ ప్రభు ప్రధానమంత్రికి రాజీనామా లేఖను అందించడం పారదర్శక పాలనకు తార్కాణంగా నిలిచింది.
దేశ భద్రతకు సంబంధించి అత్యంత క్లిష్టమైన ఘట్టంగా పరిగణించే 2008 నవంబర్ 26 ముంబై ఉగ్రవాద దాడుల సందర్భంలో కూడా నైతిక బాధ్యత పునరావృతమైంది. నగరంలోని తాజ్ మహల్ ప్యాలెస్, ఒబెరాయ్ ట్రైడెంట్, ఛత్రపతి శివాజీ టెర్మినస్ వంటి కీలక ప్రాంతాలపై జరిగిన దాడుల్లో 166 మంది నిరపరాధులు మరణించగా 300 మందికి పైగా గాయపడ్డారు. భద్రతా యంత్రాంగంలో నిఘా వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ అప్పటి కేంద్ర హోం మంత్రి శివరాజ్ పాటిల్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ నైతిక నిర్ణయం తదనంతరం పి. చిదంబరం బాధ్యతలు స్వీకరించడానికి, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (NIA) ఏర్పాటు మరియు తీరప్రాంత భద్రతా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు బాటలు పరిచింది.
వర్తమానంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కూడా ఇదే నైతిక సంప్రదాయానికి అనుగుణంగా సాగిన పరిణామంగా భావించవచ్చు. దేశంలో అత్యున్నత విద్యా వ్యవస్థలు మరియు పోటీ పరీక్షల నిర్వహణలో తలెత్తిన లోపాలు, విద్యార్థుల మరియు ప్రజల విశ్వాసానికి కలిగిన విఘాతం పట్ల జవాబుదారీతనాన్ని ప్రకటించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి అద్దం పడుతోంది. అయితే, ఆధునిక రాజకీయాల్లో ఇటువంటి నైతిక రాజీనామాల సంస్కృతి క్రమంగా క్షీణిస్తోందనే విమర్శలు కూడా లేకపోలేదు. అధికారాన్ని కేవలం రాజకీయ సమీకరణాలకు, చట్టపరమైన విచారణల సాకులు చెప్పడానికి సాధనంగా మార్చుకునే ధోరణి పెరుగుతున్న తరుణంలో, ధర్మేంద్ర ప్రధాన్ వంటి నిర్ణయాలు లేదా గత నాయకుల ఆదర్శాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రాణవాయువుగా పనిచేస్తాయి.
నైతిక బాధ్యతతో రాజీనామా చేయడం అనేది ఏ మాత్రమూ వ్యక్తిగత పరాజయం లేదా నేర అంగీకారం కానే కాదు. అది ప్రజలు తమపై ఉంచిన అపారమైన విశ్వాసానికి ఇచ్చే అత్యున్నత గౌరవం. ప్రజాస్వామ్యం విరాజిల్లాలంటే కేవలం రాజ్యాంగబద్ధమైన చట్టాలు మాత్రమే సరిపోవు; ప్రజా ప్రతినిధులలో నైతిక నిబద్ధత, స్వీయ జవాబుదారీతనం అంతర్భాగం కావాలి. స్వతంత్ర భారత రాజకీయ చరిత్రలో లాల్ బహదూర్ శాస్త్రి, వి.పి. సింగ్, నితీశ్ కుమార్, శివరాజ్ పాటిల్ ల నుండి ధర్మేంద్ర ప్రధాన్ వరకు సాగిన ఈ రాజీనామాల ప్రయాణం, పరిపాలనలో నైతిక విలువలను పునరుద్ఘాటిస్తూ, భావి తరాల ప్రజాస్వామ్య నాయకులకు మార్గదర్శకంగా నిలుస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదు.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...9440595494**

## అట్టహాసంగా 18వ ఈశా గ్రామోత్సవం

### 350 మందికి పైగా క్రీడాకారుల సందడి..

### గ్రామీణ యువతలో క్రీడా స్ఫూర్తి నింపిన వాలీబాల్ పోటీలు



**లక్ష్మీదేవిపల్లి జూలై 26 (నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం పోలీస్ గ్రౌండ్‌లో జరిగిన 18వ ఈశా గ్రామోత్సవం క్రీడా వేడుకలు యువత తో ఉత్సాహంగా సాగాయి. ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పురుషుల వాలీబాల్ పోటీల్లో 350 మందికి పైగా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. గ్రామీణ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్వహించినఈ పోటీలు ఆకట్టుకున్నాయి. ములకపాడు సర్పంచ్ తులసమ్మ, దుమ్ముగూడెం సీఐ టి. వెంకటప్పయ్య ముఖ్య అతిథులుగా హాజరై విజేతలను అభినందించారు. సీఐ వెంకటప్పయ్య మాట్లాడుతూ... యువత మద్యం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలంటే ఇలాంటి క్రీడా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని, క్రీడల ద్వారా క్రమశిక్షణతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. పురుషుల వాలీబాల్ విభాగంలో ఆసుపాక జట్టు విజేతగా నిలవగా, కొయ్యూరు ద్వితీయ స్థానం, కేవీపురం తృతీయ స్థానం, కాశీనగరం జట్టు నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. విజేతలకు సీఐ టి. వెంకటప్పయ్య బహుమతులు అందజేశారు. ఈశా గ్రామోత్సవం విజయవంతానికి జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ విశేష సహకారం అందించాయి. జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీఓ బి. రాహుల్, ఎస్పీ బి. రోహిత్ రాజు, సీఐ టి. వెంకటప్పయ్యతో పాటు పీడీలు, పీఈటీలు అందించిన సహకారానికి ఈశా గ్రామోత్సవం బృందం కృతజ్ఞతలు తెలిపింది. 2004లో సద్గురు ప్రారంభించిన ఈశా గ్రామోత్సవం గ్రామీణ భారత దేశంలో క్రీడా సంస్కృతిని ప్రోత్సహించే లక్ష్యంతో కొనసాగుతోంది. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని 15 జిల్లాల్లో మూడు దశల్లో పోటీలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 6న కోయంబత్తూరులోని ఆదియోగి ప్రాంగణం లో జరిగే గ్రాండ్ ఫినాలేలో విజేత లకు రూ. 5 లక్షల చొప్పున నగదు బహుమ తులతో పాటు, మొత్తం కోటి రూపాయలకు పైగా ప్రైజ్ మనీ అందజేయనున్నారు.



# కాన్‌టెంపరరీ పొలిటీషియన్..?

## కవిత రాజకీయ ప్రయాణం కొత్త మలుపు... కొత్త పార్టీతో భవిష్యత్తుపై ప్రశ్నలు

**జగిత్యాల ప్రతినిధి। జూలై 25 (।నినాదం):** తెలంగాణ ఉద్యమం అనంతరం రాజకీయంగా వేగంగా ఎదిగిన నాయకుల్లో కల్వకుంట్ల కవిత ఒకరు. ఉద్యమ సమయంలో బతుకమ్మ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో గుర్తింపు పొందిన ఆమె, తర్వాత నిజామాబాద్ ఎంపీగా, అనంతరం ఎమ్మెల్సీగా రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించారు. అయితే ఈ ప్రయాణంలో ప్రశంసలతో పాటు వివాదాలు, విమర్శలు, రాజకీయ సవాళ్లు కూడా ఆమెను వెంటాడుతున్నాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీ ఎక్సైజ్ విధానానికి సంబంధించిన కేసులో ఆమె అరెస్టు కావడం, కొంతకాలం జైలులో ఉండడం ఆమె రాజకీయ ఇమేజ్‌పై ప్రభావం చూపిన పరిణామాలుగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ కేసులో తనపై వచ్చిన ఆరోపణలను కవిత పలుమార్లు ఖండిస్తూ, రాజకీయ కక్షసాధింపులో భాగంగానే తనను లక్ష్యంగా చేసుకున్నారని చెబుతున్నారు. కేసు ప్రస్తుతం న్యాయపరమైన ప్రక్రియలో ఉండటంతో తుది తీర్పు వెలువడాల్సి ఉంది.

ఇటీవలి కాలంలో కుటుంబ రాజకీయ విభేదాలు బహిరంగం కావడం, బీఆర్ఎస్ నాయకత్వంపై కవిత చేసిన వ్యాఖ్యలు, అనంతరం కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుపై ఆమె చేసిన ప్రకటనలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమయ్యాయి. బీఆర్ఎస్ నాయకత్వం మాత్రం ఈ నిర్ణయాలను సమర్థించడం లేదు. కుటుంబ విభేదాలను రాజకీయ రంగంలోకి తీసుకువస్తున్నారని, పార్టీ కార్యకర్తల్లో అయోమయం సృష్టిస్తున్నారని ఆ పార్టీకి



చెందిన కొందరు నేతలు విమర్శిస్తున్నారు. కొత్త పార్టీ ప్రకటన తర్వాత కూడా పార్టీ లక్ష్యాలు, సిద్ధాంతం, కార్యాచరణపై ప్రజలకు స్పష్టమైన సందేశం ఇంకా వెళ్లలేదనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు కవిత మాత్రం తెలంగాణ ఆత్మగౌరవం, ప్రజా సమస్యల పరిష్కారమే తమ రాజకీయ లక్ష్యమని చెబుతున్నారు.



### సోషల్ మీడియాలో తీవ్ర చర్చ

కవిత సోషల్ మీడియాలో చేసే పోస్టులపై అనుకూల, ప్రతికూల స్పందనలు కనిపిస్తున్నాయి. ఆమె రాజకీయ నిర్ణయాలు, గత వ్యాఖ్యలు, నాయకత్వ శైలిపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఆమెను విమర్శిస్తుండగా, మరికొందరు రాజకీయంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని వాదిస్తున్నారు.

### రాజకీయ వైఖరిపై ప్రశ్నలు

గత కొంతకాలంగా అధికార, ప్రతిపక్ష పార్టీలపై కవిత చేసిన వ్యాఖ్యల్లో స్థిరత్వం కనిపించడం లేదని రాజకీయ ప్రత్యర్థులు విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒక దశలో ప్రశంసించడం, మరో దశలో తీవ్ర విమర్శలు చేయడం, కుటుంబ సభ్యులపై బహిరంగ వ్యాఖ్యలు చేయడం వంటి అంశాలు రాజకీయంగా ఆమెకు ప్రతికూలంగా మారాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే కవిత మాత్రం పరిస్థితులకు అనుగుణంగా తన అభిప్రాయాలను వెల్లడిస్తున్నానని చెబుతున్నారు.

### కొత్త పార్టీకి సవాళ్లు

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పటికే ప్రధాన పార్టీల మధ్య తీవ్ర పోటీ కొనసాగుతున్న నేపథ్యంలో కొత్త పార్టీకి స్థానం సంపాదించడం అంత సులభం కాదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పార్టీ నిర్మాణం, క్షేత్రస్థాయి బలం, ప్రజల్లో విశ్వాసం, స్పష్టమైన సిద్ధాంతం వంటి అంశాలే కవిత రాజకీయ భవిష్యత్తును నిర్ణయిస్తాయని వారు పేర్కొంటున్నారు.

.

### నిజామాబాద్‌లో మారిన రాజకీయ సమీకరణాలు

నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కవిత ఒకసారి మాత్రమే విజయం సాధించగా, తరువాతి ఎన్నికల్లో పరాజయం ఎదుర్కొన్నారు. పసుపు బోర్డు వంటి హామీల అమలుపై కూడా ప్రత్యర్థులు విమర్శలు చేశారు. మరోవైపు బీజేపీ తన రాజకీయ బలాన్ని పెంచుకుంటూ రావడం, స్థానిక రాజకీయ సమీకరణాలు మారడం కూడా ఆమె రాజకీయ అవకాశాలపై ప్రభావం చూపిందని పరిశీలకులు చెబుతున్నారు.

# బీసీ ఆర్టిజన్స్ ఎగ్జిబిషన్‌కు విశేష ఆదరణ..

### సహకరించిన అందరికీ కృతజ్ఞతలు: బీసీ సంక్షేమ శాఖ ఎం బి సి కార్పోరేషన్ అలోక్ కుమార్

**హైదరాబాద్ బ్యూరో, జులై 27,(నినాదం) :** వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆషాఢ బోనాలు – చేతి వృత్తుల మేళ విజయవంతం కావడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ బీసీ సంక్షేమ శాఖ ఎం బి సి కార్పోరేషన్ సి ఇ ఓ, మేళా ఆర్గనైజర్ అలోక్ కుమార్ గారు కృతజ్ఞతలు తెలిపారు. గౌరవ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారి ఆదేశాలు, ప్రిన్సిపల్ సెక్రటరీ బాలామాయ దేవి మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ ఎగ్జిబిషన్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని మేళ ముగింపు సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఆయన చెప్పారు. గత ఏడాది 30 స్టాళ్లతో ఐదు రోజుల పాటు నిర్వహించిన ఎగ్జిబిషన్‌ను ఈసారి 60 స్టాళ్లతో 11 రోజుల పాటు నిర్వహించగా, పాల్గొన్న బీసీ చేతివృత్తుల కళాకారులకు ఎంతో ఆదరణ లభించింది అన్నారు. సాధారణ రోజుల్లో 1,500 నుంచి 2,000 మంది, వారాంతాల్లో 4,000 నుంచి



5,000 మంది వరకు సందర్శకులు ఎగ్జిబిషన్‌ను సందర్శించినట్లు ఆయన తెలిపారు. కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, మేదరి తదితర బీసీ చేతివృత్తుల ఉత్పత్తులకు విస్తృత ప్రచారం, మార్కెటింగ్ అవకాశం కల్పించామని పేర్కొన్నారు. ప్రతి సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు సహకరించిన సాంస్కృతిక శాఖ అధికారులు, కళాకారులు, అలాగే ఎగ్జిబిషన్ విజ



యవంతానికి కృషి చేసిన రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల అధికారులు, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఏడాది ఎగ్జిబిషన్‌ను మరింత ఘనంగా నిర్వహిస్తామని వెల్లడించారు. పత్రిక విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారులు ఆశన్న, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో ఆర్‌బీఐ కొత్త 'ప్లాస్టిక్ నోట్లు'..

### కాగితం నోట్లలా మడతబెట్టొచ్చా? మీ అతిపెద్ద డౌట్‌కు క్లారిటీ..!


నినాదం మార్కెట్

ఇందుకోసం ఇప్పటికే టెండర్లను పిలిచారు. ఈ కొత్త ప్లాస్టిక్ నోట్ల గురించి సామాన్య ప్రజల మదిలో అనేక ప్రశ్నలు మెదులుతున్నాయి. ఇవి ప్లాస్టిక్ నోట్లు కాబట్టి, డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డుల వలె దృఢంగా ఉంటాయా? ప్లాస్టిక్ నోట్లను మడవవచ్చా?

రిజర్వ్ బ్యాంక్ ప్రస్తుతానికి పైలట్ ప్రాజెక్ట్‌గా రూ. 10, రూ. 20 నోట్లను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఈ నోట్లకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తే, మిగిలిన నోట్లను కూడా ప్లాస్టిక్ నోట్లుగా మార్చడం జరుగుతుంది. ఈ ప్లాస్టిక్ నోట్లు చాలా మన్నికగా ఉంటాయని ఆర్‌బిఐ తెలిపింది. వాటి చెల్లుబాటు కాలం కూడా చాలా ఎక్కువ ఉంటుంది. ప్లాస్టిక్ నోట్లపై తలెత్తిన ప్రశ్నలకు ఇప్పుడు సమాధానాలు లభించాయి.

**ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను మడవవచ్చా?**

పాలిమర్ నోట్లు ప్లాస్టిక్‌లా కనిపించినప్పటికీ, అవి




డెబిట్, క్రెడిట్ కార్డులంత బలంగా ఉండవు. ఈ నోట్లు చాలా పలుచగా ఉంటాయి. ఫలితంగా ఈ నోట్లను మడవడంలో ఎలాంటి ఇబ్బంది ఉండదు. ప్రస్తుతం కాగితపు నోట్లను డబ్బు సంచులలో లేదా జేబులలో ఎలాగైతే ఉంచుకుంటారో, అలాగే ప్లాస్టిక్ నోట్లను కూడా మడవవచ్చు. కాగితపు నోట్లకు, ప్లాస్టిక్ నోట్లకు మధ్య ఉండే అతిపెద్ద తేడా ఏమిటంటే, ప్లాస్టిక్ నోట్లను మడిచినప్పుడు వాటిపై ఎలాంటి గుర్తులు పడవు. మడత నుండి నోటును విప్పినప్పుడు, అది ముందులాగే ఉంటుంది.

**నోట్ల లెక్కింపు యంత్రాన్ని కూడా మార్చాలా?**

పాలిమర్ లేదా ప్లాస్టిక్ నోట్లు సాధారణ కాగితపు నోట్ల కంటే కొద్దిగా భిన్నంగా ఉంటాయి. అందువల్ల, ప్రస్తుత నోట్ల లెక్కింపు యంత్రాలు, నగదు నిర్వహణ యంత్రాలు, ఏటీఎంలను కూడా అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది.

**ప్లాస్టిక్ లేదా పాలిమర్ కరెన్సీ నోట్ల వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి?**

ఈ నోట్లు కాగితపు నోట్ల కంటే చాలా మన్నికైనవి. పాలిమర్ కరెన్సీ నోట్లు సాపేక్షంగా తక్కువ మురికిగా ఉంటాయి. ఇది తడిసినా పాడవదు. లాగడం వల్ల చిరిగిపోయే ప్రమాదం తక్కువ. ఈ నోటును నకిలీ చేసే అవకాశం తక్కువ.

# 200, 500 కరెన్సీని అనుమతించిన నేపాల్




భారత కరెన్సీపై నేపాల్ కీలక ప్రకటన చేసింది. గతంలో రూ. 100 నోట్లను మాత్రమే అనుమతించిన ఆ దేశం.. ఇకపై రూ. 200, రూ. 500 నోట్లు కూడా తమ దేశంలో వినియోగించవచ్చని పేర్కొంది. ఈ మేరకు నేపాల్ రాష్ట్ర బ్యాంక్ ప్రతినిధి గురు ప్రసాద్ పౌడెల్ వెల్లడించారు. భారత్‌లో పెద్ద నోట్ల రద్దు అనంతరం కేవలం రూ. 100 నోటును మాత్రమే నేపాల్ అనుమతిస్తూ వస్తోంది. ఇక నుంచి 2016 నవంబర్ 9 లేదా ఆ తర్వాత జారీ చేసిన రూ. 200, రూ. 500 భారత కరెన్సీని కూడా అనుమతిస్తామని నేపాల్ పేర్కొంది. తాజా నిబంధనల ప్రకారం... రూ. 100 లోపు విలువ కలిగిన నోట్లతో పాటు రూ. 200, రూ. 500 నోట్లను నేపాల్‌లోకి తీసుకురావొచ్చు లేదా బయటకు తీసుకెళ్లొచ్చన్నమాట. గరిష్ఠంగా రూ. 25 వేల వరకు పరిమితి విధించింది. దీనివల్ల భారత్, నేపాల్ సరిహద్దుల్లో నగదు బదిలీ మరింత సులభతరం కానుంది. నేపాలీ జాతీయులకు, భారత పర్యటకులకు సౌకర్యంగా మారనుంది. అదే సమయంలో ఇతర దేశాల నుంచి తీసుకొచ్చిన భారత కరెన్సీని అనుమతించబోమని స్పష్టం చేసింది

# ఆగస్టులో ఐపీఓల క్యూ...

### డజను కంపెనీలు.. 25 వేల కోట్లు!

దిల్లీ: స్టాక్ మార్కెట్‌లో పరిస్థితులు కుదుటపడుతుండడంతో ప్రైమరీ మార్కెట్‌లో ఐపీఓల సందడి మళ్లీ మొదలైంది. దీంతో ఇన్నాళ్లు ఆచితూచి అడుగేసిన కంపెనీలు.. ఇప్పుడు పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. అలా వచ్చే నెలలో (ఆగస్టు) డజనుకు పైగా కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు సన్నాహాలు చేసుకుంటున్నాయి. ఇందులో ఇ-కామర్స్ సంస్థ జెప్టో, ట్రూహోమ్ ఫైనాన్స్, లాజిస్టిక్స్ సంస్థ షిప్‌రాకెట్ వంటి ప్రధాన కంపెనీలు ఉన్నాయి. మొత్తం రూ. 25వేల కోట్లు సమీకరించనున్నాయి.

అంతర్జాతీయ పరిణామాల కారణంగా స్టాక్ మార్కెట్ తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొంది. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకు 36 కంపెనీలు మాత్రమే ఐపీఓ ద్వారా నిధులు సమీకరించాయి. ఒక్క జులై నెలలో 9 కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు వచ్చాయి. మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్, జునిపెర్ గ్రీన్ ఎనర్జీ జులై 28, 30




తేదీల్లో సబ్‌స్క్రిప్షన్‌కు రానున్నాయి. మార్కెట్ పరిస్థితులు కాస్త చక్కబడడం, ఇన్వెస్టర్ల నుంచి ఆశించిన స్థాయిలో డిమాండ్ ఉంటుండడంతో మరిన్ని కంపెనీలు ఐపీఓల కోసం సన్నద్ధం అవుతున్నాయి.

**ఆ కంపెనీలు ఇవీ..**


ఆగస్టు నెలలో రాబోయే అతిపెద్ద ఐపీఓల్లో జెప్టో ఒకటి. ఇ-కామర్స్ సంస్థ జెప్టో ఐపీఓలో భాగంగా ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ. 8010 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా 11.34 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ ట్రూహోమ్ ఐపీఓ ద్వారా రూ. 3వేల కోట్లు సమీకరించనుంది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ. 1500 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో అంతేమొత్తం సమీకరించనుంది. ఎలివేట్ క్యాంపసెస్ రూ. 2550 కోట్లు, షిప్‌రాకెట్ రూ. 2342 కోట్లు, ఇన్నోవేటివ్ వ్యూ ఇండియా రూ. 2వేల కోట్లు చొప్పున నిధులు సమీకరించనున్నాయి. మిల్క్‌మిస్ట్ డెయిరీ ఫుడ్ కూడా వచ్చే నెలలోనే రూ. 1553 కోట్ల ఐపీఓకు రానుంది. ఇవి కాకుండా ధూత్ ట్రాన్స్‌మిషన్, ఏఆర్‌సీఐఎల్ (అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ ఇండియా లిమిటెడ్), అర్డీ ఇండస్ట్రీస్, గజా ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్, రేస్ ఆఫ్ బీలీఫ్, హైటెక్ ఇంజినీర్స్, శంకేశ్ జువెలర్స్, లెర్న్‌ఫ్లూయెన్స్ ఎడ్యుకేషన్స్ కూడా ఆగస్టులో తొలి పబ్లిక్ ఆఫర్‌కు రానున్నాయి.

# భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన అబ్దుల్ కలామ్

### నేడు మిస్సైల్ మ్యాన్ వర్ధంతి.. ప్రపంచ విద్యార్థుల దినోత్సవం

అబ్దుల్ కలామ్.. ఈ పేరు తెలియని భారతీయుడు ఉండడంటే ఆశ్చర్యం లేదు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఆయన. ఓ మధ్య తరగతి కుటుంబంలో జన్మించి.. నిరంతర శ్రమతో ఉన్నత శిఖరాలు అధిరోహించిన ఆయన జీవిత ప్రస్థానం నిజంగా అద్భుతం. దేశం కోసం పెళ్లి చేసుకోకుండా బ్రహ్మచారిగా ఉండిపోయిన ఆయన జీవితం ఆదర్శం. అనితర సాధ్యమైన విజయాలను తన ఖాతాలో వేసుకోవడం గొప్పతనం. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి సేవలందించిన కలాం. హార్ట్ స్టంట్ రూపొందించడం లోనూ పాత్ర పోషించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం. భారతదేశంలో ఉన్న అతికొద్దిమంది గొప్ప శాస్త్రవేత్తల్లో ఏపీజే అబ్దుల్ కలాం ఒకరు. ఆయన జయంతి ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా జరుపుకుంటారు. అబ్దుల్ కలాం తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం లో ఒక ముస్లిం కుటుంబంలో 1931 అక్టోబర్ 15న జన్మించాడు. తండ్రి పేరు జైనలబుద్దీన్ మరాకాయర్, తల్లి పేరు అషియమ్మా జైనబుల్బుద్దీన్. అబ్దుల్ కలాం పూర్తి పేరు అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం ఆర్థికంగా వెనుకబడిన, కుటుంబానికి సహాయం చేయడానికి చిన్న వయసు లోనే న్యూస్ పేపర్లు వేసేవాడు. రామేశ్వరానికి కొద్ది దూరంలో ఉన్న రామనాథపురంలో స్కెచ్ మెట్రిక్యులేషన్ స్కూల్లో పదో తరగతి వరకు చదువు కున్నాడు. చదువు అంత అంత మాత్రమే అయినప్పటికీ నేర్చుకోవాలనే తపన ఎక్కువగా ఉండేది. స్కూల్లోనే ఉపాధ్యాయుడు ఒకసారి సముద్రపు ఒడ్డుకు తీసుకువెళ్లి పక్షి ఎలా ఎగురుతుందో చూపించాడు. అప్పటి నుండి కలాం కూడా పక్షిలా ఎగరాలను కున్నాడట. ఎలాగైనా పైలెట్ కావాలని అనుకున్నాడు. తరువాత తిరుచ్చిలో సెయింట్ జోసెఫ్ కళాశాలలో డిగ్రీ పట్టా పొందాడు. కలాం తన చిన్ననాటి కోరిక నిజం చేసు కోవడానికి మద్రాసులోని ఎన్ఐటీల్లో చేరాడు. ఐతే ఇన్స్టిట్యూట్ లో చేరాలంటే వెయ్యి రూపాయలు ఫీజు కట్టాల్సి వచ్చింది. కానీ ఆయన తండ్రి దగ్గర లేనపుడు కలాం అక్క తన రెండు గాజులు అమ్మి ఫీజ్ కట్టింది. ఎలాగైనా బాగా చదివించాలని ఉన్నతమైన స్థానంలో చూడాలని తన కుటుంబ సభ్యులు పడుతున్న కష్టాన్ని తన మీద వాళ్లకు నమ్మకాన్ని చూసి చలించి పోయాడు. చివరకు స్కాలర్షిప్ సహాయంతో ఎం ఐ టి లో ఎరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తి చేయగా, అందులో నాటికల్ ప్రవేశ పరీక్షల్లో 8 ఉద్యోగాలు ఉంటే తనకు 9వ స్థానం రావడంతో తృటిలో పైలెట్ అయ్యే అవకాశాన్ని కోల్పోయాడు. కలాం తన చిన్ననాటి కల చేజారి పోయింది. 1960 కలాం డీఆర్డీఓ (ఐ=ఖూ)లో ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఎస్టాబ్లిష్మెంట్ లో శాస్త్రవేత్తగా చేరారు. అక్కడ భారత సైన్యం కోసం ఒక ఓవర్ క్రాఫ్ట్ డెవలప్ చేయడం ఆయన పని. కొన్ని రోజులకి ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ నుండి కలాం కి ఇంటర్వ్యూకు రమ్మని పిలుపు వచ్చింది. ఇప్పుడు దీనినే ఇస్రోగా (ఖూ=ూ) పిలుస్తున్నారు. ప్రొఫెసర్ విక్రం సారాభాయ్ ఇంటర్వ్యూ చేశారు. అలా కలాం రాకెట్ ఇంజినీరుగా సెలక్ట్ అయ్యారు. విక్రం సారాభాయ్, కలాం కలిసి ఇస్రో ను ఎంతగానో అభివృద్ధి చేశారు. 1962లో భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోలో చేరి, ఇతర శాస్త్రవేత్తలతో కలసి అనేక కృత్రిమ ఉపగ్రహాలను విజయ వంతంగా ప్రయోగించారు. రోహిణి ఉపగ్రహాన్ని జూలై 1980లో విజయవంతంగా భూమి సమీప కక్ష్యలోకి వదిలిన భారత దేశపు తొలి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం (ూఎ-×××)ని అభివృద్ధి చేయడంలో ప్రాజెక్టు డైరెక్టరుగా ఆయన కృషి ఎంతో ఉంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి





అబ్దుల్ కలాం. క్రమంలో ఆరు నెలలపాటు రాకెట్ లాంచింగ్ టెక్నిక్ మీద ట్రైనింగ్ కోసం అమెరికాలోని "నాసా" వెళ్లే అవకాశం దక్కింది. భారత్ నుండి అంతరిక్షంలోకి శాటిలైట్ పంపాలనేది ప్రొఫెసర్ సారాభాయ్ కోరిక. శిక్షణ పూర్తి అయిన తర్వాత కలాం... సారాభాయ్ మరియు సతీష్ సహకారంతో "రోహిణి" అనే శాటిలైట్ ని అంతరిక్షంలోకి పంపడానికి ఎస్ఎల్వి-3 అనే రాకెట్ ని అభివృద్ధి చేశారు. దేశంలోని ప్రజలందరికీ ఎస్ఎల్వి-3 మీదే కళ్ళు ఉన్నాయి. కలాంతో పాటుగా అక్కడ ఉన్న ఎంతోమంది కష్టపడి నిర్మించిన 22 మీటర్ల పొడవైన ఎస్ఎల్వి-3 లాంచ్ అయింది. 315 సెకండ్ తర్వాత సెకండ్ స్టేజ్ పేలిపోయి సముద్రంలో కుప్పకూలి పోయింది. కలాంకు ఏదో తెలియని ఆవేదన. దేశ ప్రజల అందరి కళ్లు ఆవిరై పోయాయి. మళ్ళి తిరిగి 1980 2 వ ఎస్ఎల్వి-3 రెడీ చేశారు. మొదటి దాని లాగానే ఇది కూడా ఫెయిల్ అవుతుందని వ్యాఖ్యానించారు. 18 జూలై 1980 లో ఎస్ఎల్వి-3 రోహిణి విజయ వంతంగా ప్రవేశ పెట్టింది.. అంతరిక్షం లోకి శాటిలైట్ ని పంపగలిగే కెపాసిటీ ఉన్న దేశాల లిస్టులో భారతదేశం కూడా చేరింది. భారత అంతరిక్ష ప్రయోగాలు పునాదులు పడ్డాయి. ఆ నాటి ప్రధానమంత్రి గాంధీ ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందించారు. ఆ తర్వాతి సంవత్సరం 1981లో కలాంకు పద్మభూషణ్ అవార్డు దక్కింది. ఆ తరవాత మన ఆర్మీ కోసం అగ్ని, పృథ్వి, నాగ్, ఆకాశ్ త్రిశూల్ వంటి శక్తివంతమైన మిస్సైల్ లు తయారు చేసి మన దేశాన్ని ఎవరి మీద ఆధారపడని ఒక శక్తివంతమైన దేశంగా మార్చారు. అందుకే కలాంను మిసైల్ మాన్ అంటారు. ఆయన నాయకత్వంలో ఇస్రో ఎంతో అభివృద్ధి చెందింది. 1982లో, ఆయన డీఆర్డీవో డైరక్టరుగా తిరిగి బాధ్యతలు చేపట్టి గైడెడ్ మిస్సైల్స్‌పై దృష్టి కేంద్రీకరించారు. అగ్ని, పృథ్వి, క్షిపణి మిస్సైళ్ళ అభివృద్ధి చేసి ప్రయోగించడంలో కీలక పాత్ర పోషించారు. అంటే దేశానికి తొలి మిస్సైల్‌ను అందించిన ఘనత ఆయనదే. అందుకే ఆయనకు "మిస్సైల్ మాన్" అనే పేరు కూడా వచ్చింది. ఆ తర్వాత జూలై 1992లో దేశ రక్షణ మంత్రికి సాంకేతిక సలహాదారుగా నియమితులయ్యారు. అలాగే, భారత ప్రభుత్వానికి ప్రధాన సాంకేతిక సలహాదారుగా కేబినెట్ హోదాలో కొనసాగారు. అబ్దుల్ కలాం కృషి ఫలితంగా 1998లో పోఖ్రాన్-×× అణుపరీక్షలు విజయ వంతంగా పూర్తి చేయడం జరిగింది. ఈ అణు పరీక్షతో భారతదేశాన్ని అణ్వస్త్ర రాజ్యాల సరసన చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగ స్వామిగా ఆయన్ను "మిస్సైల్ మాన్" అని పిలుస్తారు. 1898లో వాజ్ పేయి ప్రధానమంత్రి సమయంలో అమెరికన్ శాటిలైట్స్ కి దొరకకుండా "పోక్రాన్" అనే ప్రదేశంలో "ఆపరేషన్ శక్తి" అనే పేరుతో విజయవంతంగా న్యూక్లియర్ టెస్ట్ చేయడంలో కలాం పాత్ర ఎంతగానో వుంది. గత ఎన్డీయే ప్రభుత్వ హయాంలో వాజ్‌పేయి ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో అంటే 2002 జూలై 18వ తేదీన భారత రాష్ట్రపతిగా ఎన్నిక కాగా, జూలై 25న రాష్ట్రపతి భవన్‌లో అడుగు పెట్టారు. ఆయనకు నాటి ఎన్డీయే మిత్రపక్షాలతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కూడా మద్దతు ఇవ్వడంతో 90 శాతానికి పైగా ఓట్ల మెజార్టీతో రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. అబ్దుల్ కలాం మన దేశానికి ఏ రాజకీయ అనుభవం లేకుండా పదకొండవ రాష్ట్రపతిగా ఎన్నికైన జ్ఞాని. కలాం సమయంలో ఎక్కవ మందిని కలుసుకున్న రాష్ట్రపతిగా, పీపుల్స్ ప్రెసిడెంట్ అని అంటారు. అబ్దుల్ కలాం గారు పెళ్లి చేసుకోలేదు. అంతేకాదు, వైద్య రంగంలో పోలియో బాధితుల కోసం, తేలికపాటి పరికరాల రూపకల్పన చేయడానికి ఎంతో కృషి చేశారు. భారత ప్రభుత్వం "భారతరత్న" "పద్మవిభూషణ్", "పద్మభూషణ్" పురస్కారాలతో గౌరవించింది. అబ్దుల్ కలాం పూర్తిగా శాకాహారి. మద్యపాన వ్యతిరేకి. బ్రహ్మచారి. మత ఘర్షణలను నిరసించే శాంతి కాముకుడిగా పేరు గడించారు. ఈయన వింగ్స్ ఆఫ్ ఫైర్, సైంటిస్ట్ టు ప్రెసిడెంట్ వంటి అనేక పుస్తకాలను రచించారు. 84 సంవత్సరాల వయసులో జూలై 27, 2015 సోమవారం సాయంత్రం షిల్లాంగ్‌లోని ఏఐఎంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ అబ్దుల్ కలాం మధ్యలో కుప్పకూలి పోయి, స్థానిక బెథాని ఆస్పత్రికి తరలించబడి, 45 నిమిషాల వ్యవధిలోనే కన్నుమూశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

## ఘనంగా ఉదయ్ ఆర్ట్ త్రీడీ క్యారీ గ్యాలరీ ప్రారంభోత్సవం



**అల్వాల్, జూలై 26 (నినాదం):** మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి మచ్చబొల్లారం డివిజన్‌లోని ఐస్ ఫ్యాక్టరీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఉదయ్ ఆర్ట్ 3డి కార్వింగ్ గ్యాలరీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్యాలరీ నిర్వాహకుడు శ్రీ ఉదయ్ సోమ మరియు వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారంలో మరింత అభివృద్ధి సాధించి విజయవంతం కావాలని ఆకాంక్షించారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఇటువంటి నూతన వ్యాపార సంస్థలు మరిన్ని ఏర్పడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, శోభన్, అరుణ్ రావు, భాస్కర్ రెడ్డి, పవన్, రేవంత్, మహేష్, రెహ్మత్ ఖాన్, నార్ల సురేష్, నర్సింగ్ రావు, గణేష్, దేవేందర్, ఫెరోజ్, అతిక్ పాషా, బంటి, వర్షా, అభిమానులు, కుటుంబ సభ్యులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## బాచుపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం



**కుత్బుల్లాపూర్, జూలై 26 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 274వ డివిజన్ బాచుపల్లి లోని ఎస్ వి ఎస్ అబర్న కాలనీలో రూ. 23 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభోత్సవం నిర్వహించారు. కాలనీలో ఉన్న సీసీ రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గత నెలలో స్థానికులు కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి, ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో (సిఎంపి) రూ. 23 లక్షల నిధులను మంజూరు చేయించి ఆదివారం అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ కొలన్ హన్మంత్ రెడ్డి ని శాలువాతో ఘనంగా సత్కరించి, తమ సమస్యను పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజా సేవే లక్ష్యంగా ప్రజల కోసం పనిచేస్తా..

- సొంటి రెడ్డి పున్నారెడ్డి



**కుత్బుల్లాపూర్, జూలై 26 (నినాదం):** ఓటు హక్కు అర్హత కలిగిన ప్రతి పౌరుడు తన ఓటరు వివరాలను సరిచూసుకుని, అవసరమైన మార్పులు చేసుకోవాలని విజ్ఞప్తి మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి తెలిపారు. బి. ఎల్. ఓ. లు ఓటర్ మహాశయుల సమస్యలను అడిగి తెలుసుకుంటూ ప్రతి ఓటరును ప్రత్యక్షంగా కలుస్తూ, బి. ఎల్. ఓ. లతో మాట్లాడి వారి సమస్యలు, సూచనలు, ఓటరు జాబితాకు సంబంధించిన ఇబ్బందులను నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రజా సేవే లక్ష్యంగా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసం పనిచేస్తామని, ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మరలింగ, పవన్,శ్రీనివాస్ గౌడ్, హర్భజన్ సింగ్, శ్రీనివాసరెడ్డి , కాంగ్రెస్ నాయకులు, ఓటర్ మహాసేలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలో బడుగులందరు సుభిక్షం

**రాష్ట్ర ఫైనాన్స్ సభ్యుడు గంగరాజు**



**వికారాబాద్, జూలై 26(నినాదం ):** ఇందిరమ్మ రాజ్యంలో బడుగు బలహీన వర్గాలందరు సుభిక్షంగా ఉన్నారని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు కె గంగరాజు ముదిరాజ్ అన్నారు. ఆదివారం జిల్లా పరిధిలోని నవాబుపేట మండల కేంద్రంలోని లక్ష్మారెడ్డి గార్డెన్లో బీసీ నాయకులు ఆత్మీయసన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో బీసీలు ఎస్సీ ఎస్టీ మైనారిటీలు అందరూ సంతోషంగా జీవిస్తున్నారని అన్నారు. అంతే కాకుండా రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పరిపాలనలో తెలంగాణ దేశంలోనే అభివృద్ధి బాటలో ముందుకు కొనసాగుతుందని ఆయన అన్నారు. నాపై నమ్మకం ఉంచి నన్నురాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబార్ గా నియమించిన సీఎం రేవంత్ రెడ్డి కి ఎప్పుడు రుణపడి ఉంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు యాదగిరి యాదవ్, కౌన్సిలర్ మల్లికార్జున్ గౌడ్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు రాఘవేందర్, ముదిరాజ్, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం సర్పంచులు శ్రీనివాస్ ముదిరాజ్, ఆంజనేయులు, అనిత, ముదిరాజ్ , దుర్గయ్య, ముదిరాజ్ నాయకులు,బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహబంధానికి నిలువెత్తు నిదర్శనం

**అకాల మరణంతో దుఃఖంలో ఉన్న స్నేహితురాలి**

**కుటుంబానికి అండగా నిలిచిన 2002-03 బ్యాచ్ మిత్రులు**



**ఆమనగల్లు, జూలై 26(నినాదం):** కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002--2003 విద్యాసంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు తమ స్నేహబంధాన్ని మరోసారి చాటుకున్నారు. తమ సహ విద్యార్థిని రాధిక భర్త ఇటీవల అకాల మరణం చెందడంతో ఆమెను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మిత్రులు తమకు తోచిన ఆర్థిక సహాయాన్ని అందజేసి అండగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా ఉండటమే నిజమైన స్నేహానికి నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా అవసరమైనప్పుడు సహచరులకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహ, గోవర్ధన్, మల్లేష్, సదానందం, మహేష్, జంగయ్య, బిక్షపతి, కేశవులు, వెంకటేష్, చంద్రకాంత్, సురేష్, విమలమ్మ, నిట్ట మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు మిత్రుల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

## నేటినుండి విత్తన మేళా

**జిల్లా వ్యవసాయాధికారి కవిత**



**వికారాబాద్, జూలై 27(నినాదం ):** జిల్లాలోని అన్ని మండల కేంద్రాల రైతు వేదికలలో జూలై 27 నుండి 29 వరకు విత్తన మేళ నిర్వహించబడుతోందని జిల్లా వ్యవసాయ అధికారి బి. కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్-నినో పరిస్థితుల దృష్ట్యా విత్తన మేళా సందర్భంగా ప్రత్యామ్నాయ పంటల సాగు, అత్యవసర ప్రణాళిక పై రైతులకు అవగాహన కల్పించే సమావేశాలను ఏఈఓలు నిర్వహిస్తారని ఆమె తెలిపారు. అంతేకాకుండా మేళా సమయంలో విత్తన వ్యాపారులు రైతు వేదికలలో కౌంటర్లను ఏర్పాటు చేసి అత్యవసర ప్రణాళికలో భాగంగా ప్రోత్సహిస్తున్న పంటల విత్తనాలన్నింటిని అందుబాటులో ఉంచాలని ఆమె ఆదేశించారు. రైతుల సౌలభ్యం కోసం అన్ని కంపెనీలకు చెందిన వివిధ రకాల విత్తనాలు ఒకే చోట లభించే అవకాశాన్నిరైతులు వినియోగించుకోకోవచ్చునని ఆమె సూచించారు. విత్తన మేళా గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని, గరిష్ట సంఖ్యలో రైతులు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందేలా చూడాలని ఎంఏఓ, ఏఈఓలను జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశించారు.

# ఎస్ఐఆర్‌లో పాల్గొనడం ప్రతిఒక్కరి బాధ్యత

- స్థానికంగా నివాసముంటున్న ప్రతి ఓటరు ఎస్ఐఆర్‌లో వివరాలను నమోదు చేయించండి
- ప్రతి ఓటు పటాన్చెరు అభివృద్ధికి పునాది
- పటాన్చెరు శాసనసభ్యులు మహిపాల్ రెడ్డి





**పటాన్చెరు, జూలై 26 (నినాదం):** కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ వివరాలు నమోదు చేయించుకుని.. పటాన్చెరును రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపడంలో భాగస్వాములు కావాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో వివిధ రాష్ట్రాలకు చెందిన ఓటర్లు, కార్మికులకు ఎస్ ఐ ఆర్ అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఓటు హక్కు ఉండడం అత్యంత అవసరమని అన్నారు. ఓటు ఉన్నప్పుడే ప్రజల సమస్యలు ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో పాటు.. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత లభిస్తుందని తెలిపారు. పటాన్చెరు భవిష్యత్తుకు ప్రతి ఓటు అత్యంత కీలకమని అన్నారు. మినీ ఇండియాగా పేరుందిన పటాన్చెరు నియోజకవర్గంలో వివిధ రాష్ట్రాల ప్రజలు జీవనోపాధి నిమిత్తం స్థానికంగా నివసిస్తూ.. ఓటు హక్కు కలిగి ఉన్నారని తెలిపారు. వారందరూ విధిగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో పాల్గొనాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. కులం, మతం, ప్రాంతం విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరినీ కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నామని తెలిపారు. అన్ని రాష్ట్రాల ప్రజల పండుగలను, పర్వదినాలను కలిసిమెలిసి నిర్వహిస్తూ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుపుతున్నామని తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు ఎస్ఐఆర్ అంశంపై అవగాహన కల్పించారు. ఇటీవల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన నాయికోటి రాజును ఎమ్మెల్యే జిఎంఆర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శంకర్ యాదవ్, గూడెం మధుసూదన్ రెడ్డి, యాదగిరి యాదవ్, మెట్టు కుమార్ యాదవ్, బాల్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అంతిరెడ్డి, రామచంద్ర రెడ్డి, నర్రా బిక్షపతి, పృథ్వీరాజ్, వివిధ రాష్ట్రాల ప్రజలు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరవీరులకు ఎమ్మెల్యే నివాళి

**రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదాతలకు ప్రశంసాపత్రాల ప్రదానం**

**వీరజవాన్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే**



**అల్వాల్, జూలై 26 (నినాదం):** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఈరోజు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి బొల్లారం మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని, కార్గిల్ యుద్ధంలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుడు లాన్స్ నాయక్ ఎం. వై. రామచందర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గారు స్వచ్ఛందంగా రక్తదానం చేసిన దాతలను అభినందించి, వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. సమాజ సేవలో రక్తదానం అత్యున్నతమైన మానవతా సేవ అని, యువత ఎక్కువ సంఖ్యలో రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొని ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అమరవీరుడు లాన్స్ నాయక్ ఎం. వై. రామచందర్ సతీమణి శ్రీమతి దివ్యను, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గారు పరామర్శించి, వారి త్యాగస్ఫూర్తికి వందనం తెలిపారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీరజవాన్ల సేవలను దేశం ఎన్నటికీ మరువదని, వారి కుటుంబాలకు సమాజం ఎల్లప్పుడూ అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అమరవీరుడు లాన్స్ నాయక్ ఎం. వై. రామచందర్ సతీమణి శ్రీమతి దివ్య, కుటుంబ సభ్యులు మహేష్, రవికిరణ్, బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, శోభన్, అరుణ్ రావు, భాస్కర్ రెడ్డి, పవన్, రేవంత్, మహేష్, రెహ్మత్ ఖాన్, నార్ల సురేష్, నర్సింగ్ రావు, గణేష్, దేవేందర్, ఫెరోజ్, అతిక్ పాషా, బంటి, వర్షా తదితరులు పాల్గొన్నారు.

## యువకులు స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకొని సమాజానికి ఒక ఆదర్శం

**బీఆర్ఎస్ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద**



**కుత్బుల్లాపూర్, జూలై 26 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డి నగర్ డివిజన్ వార్డు నెం. 281, సంజయ్ గాంధీ నగర్ గుబురుగుట్టలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంవైటీఐఎన్ ఎడిటింగ్ అండ్ ఫ్లెక్సీ ప్రింటింగ్ షాప్‌ను బీఆర్ఎస్ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాప్ యజమానులను అభినందిస్తూ, వారి వ్యాపారం మరింత అభివృద్ధి చెంది విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. యువ పారిశ్రామికవేత్తలు స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకొని కొత్త వ్యాపారాలను ప్రారంభించడం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మాజీ ఛైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, చింతల్ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీక్, 129 డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు జైహింద్, కార్తీక్ గౌడ్, బీఆర్ఎస్ నాని, లక్ష్మణ్ గౌడ్, అల్లావుద్దీన్, షకీల్, ఉదయ్, సురేష్, టింకు, షాప్ యజమానులు పాల్గొన్నారు.



## సంకల్పపార్కు అభివృద్ధికి సంపూర్ణ సహకారం..

- పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్చెరు, జూలై 26 (నినాదం):** భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజిలో గల సంకల్ప్ పార్కు అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. పార్కులో వాకింగ్ ట్రాక్, లైట్స్, క్రీడా సామాగ్రి, బాల్ బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. అనంతరం ఎల్ఐజి సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీహెచ్ఈఎల్ ఎల్ఐజి హౌజ్ బిల్డింగ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ్ రెడ్డి, ఐలేష్, రమణ, వెంకట్ రెడ్డి, యాదగిరి రెడ్డి పాల్గొన్నారు.

## జ్ఞానం దిశను చూపిస్తే... అనుభవమే నిజమైన అభ్యసనాన్ని తీర్చిదిద్దుతుంది

- ఘనంగా బిట్స్ పిలాని(2026) స్నాతకోత్సవ వేడుకలు
- బిగ్ బాస్కెట్ సహ వ్యవస్థాపకులు శ్రీహరి మీనన్





**జవహర్ నగర్, జూలై 26 ( నినాదం):** జ్ఞానం దిశను చూపిస్తే అనుభవమే నిజమైన అభ్యసనాన్ని తీర్చిదిద్దుతుందని బిగ్ బాస్కెట్ సహ వ్యవస్థాపకులు శ్రీహరి మీనన్ పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ బిట్స్ హైదరాబాద్ క్యాంపస్ లో ఆదివారం 2026 వ స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిగ్ బాస్కెట్ సహ వ్యవస్థాపకులు శ్రీహరి మీనన్ హాజరై మాట్లాడుతూ, విద్యార్థులు సవాళ్లను ధైర్యంగా స్వీకరించాలని అర్థవంతమైన సంబంధాలను విలువైనవిగా భావించాలని అలాగే చిరస్థాయి విజయం మంచి వ్యక్తిత్వం నిరంతర అభ్యాసనం తప్పుల నుండి నేర్చుకొని ఎదగాలని ఇవన్నీ ధైర్యం మీదే ఆధారపడి ఉంటుందని విద్యార్థులకు తెలిపారు. అనంతరం పట్ట బద్రులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రొఫెసర్ ధర్మరాజన్ శ్రీరామ్ విద్యార్థుల సాధించిన విజయాలకు అభినందనలు తెలియజేస్తూ వారి తల్లిదండ్రులు ఆధ్యాపకులు మార్గదర్శకులు అందించిన అచంచలమైన సహకారాన్ని ప్రసవించారు. బిట్స్ పిలానీలో విద్య కేవలం విద్య ప్రావీణ్యత కే పరిమితం కాదని నిజాయితీ ఆవిష్కరణత్మక ఆలోచన సంకల్పబలం సమాజంలో సార్థకమైన మార్పు తీసుకురావాలని భద్రత కలిగిన వ్యక్తులను తీర్చి దిద్దుతుందని పేర్కొన్నారు. జీవితాంతం నేర్చుకుంటూ ఉండాలని సవాళ్లను ఆత్మవిశ్వాసంతో స్వీకరించాలని వినయంతో అత్యుత్తమ భవిష్యత్తును సాధించాలని మరింత సమానత్వం స్థిరత్వం సాంకేతిక పురోగతి కలిగిన భవిష్యత్తు నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని పట్టభద్రులకు సూచించారు. ఈ సందర్భంగా మొత్తం 1500 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. వీరిలో 1200 మంది కి పైగా ఫస్ట్ డిగ్రీలు, సుమారు 200 మందికి హయ్యర్ డిగ్రీలు, అలాగే 100 మందికి పీహెచ్డీ పట్టాలు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో బిట్స్ పిలాని 2026 బ్యాచ్ పట్టభద్రులకు అభినందనలు తెలియజేస్తూ బిట్స్ పిలాని సంస్థ వారు పూర్తి విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ విద్యార్థులు బిట్స్ పిలాని యొక్కగొప్ప వారసత్వాన్ని కొనసాగిస్తూ ప్రపంచవ్యాప్తంగా విద్యారంగం పరిశ్రమలు వ్యవస్థాపక ప్రజా సేవ పరిశోధన రంగాల్లో విశిష్టమైన సేవలు అందించాలని ఈ సందర్భంగా బిట్స్ పిలాని ఇన్స్టిట్యూషన్ పునరుద్ఘాటించింది. ఈ కార్యక్రమంలో బిట్స్ పిలాని వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ వి. రామ్ గోపాల్ రావు, బిట్స్ పిలాని హైదరాబాద్ క్యాంపస్ డైరెక్టర్ ఇన్చార్జ్ ప్రొఫెసర్ ధర్మరాజన్ శ్రీరామ్, గవర్నర్ల మండలి సభ్యులు, సెనేట్ సభ్యులు, ఆధ్యాపకులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఆహ్వానితులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు విత్తన మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

**సిద్ధిపేట బ్యూరో, జూలై 26 (నినాదం):** ఈ నెల 27, 28,29 మూడు రోజులు రైతు వేదికల్లో నిర్వహించే విత్తన మేళాలలో రైతులు పాల్గొనాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి శనివారం రోజున పత్రికా ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 26 మండలాల్లో, ప్రతి మండలంలోని ఒక రైతు వేదికలో ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళా నిర్వహించబడుతున్నట్లు తెలిపారు. ఈ విత్తన మేళాలో రైతులకు అవసరమైన నాణ్యమైన ధృవీకరించిన విత్తనాలు ముఖ్యంగా చిరుధాన్యాల (మిల్లెట్స్) విత్తనాలు జొన్నలు,సజ్జలు, రాగులు, కొర్రలు, పప్పుధాన్యాల విత్తనాలు కందులు, మినుములు, పెసర, బొబ్బర్లు, నూనెగింజల పంటల విత్తనాలు ప్రొద్దు తిరుగుడు, నువ్వులు, ఆముదం మొదలగునవి అందుబాటులో ఉంటాయన్నారు. ప్రస్తుతం నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని, తక్కువ నీటితో అధిక దిగుబడిని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు ఈ విత్తన మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలోని రైతులందరూ తమ మండలంలోని రైతు వేదికలో నిర్వహించే విత్తన మేళాలో తప్పక పాల్గొని, నాణ్యమైన విత్తనాలను సద్వినియోగం చేసుకొని ప్రత్యామ్నాయ పంటల సాగును విస్తృతంగా చేపట్టాలని కోరారు.

## 'నారాయణ'లో పేరెంట్స్ డే వేడుకలు



**అల్వాల్, జూలై 26 (నినాదం):** మచ్చ బొల్లారం డివిజన్ బొల్లారం బ్రాంచ్ నారాయణ పాఠశాలలో ఉపాధ్యాయుల తల్లితండ్రుల సమావేశం జరిగింది, 1 వ తరగతి నుండి 5వ తరగతి వరకు జరిగిన సమావేశంలో సుమారుగా 100 మంది పైగా విద్యార్థు లు వారి తల్లితండ్రులు పాల్గొన్నారు, మీ వర్క్‌తో పాటు పిల్లల చదువు కొరకు కూడా కొద్దిగా సమయం కేటాయించాలని ఉపాధ్యాయులు తల్లితండ్రులకు సూచించారు, ఈ కార్యక్రమంలో ఎ. జి. ఎం పురుషోత్తం రెడ్డి, ప్రిన్సిపాల్ డా, జాస్మిన్ మాథ్యూస్, కో ఆర్డినేటర్ దీప్తి, వైస్ ప్రిన్సిపాల్ శ్రావణి,పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## ఇంకుడుగుంతలు తవ్వితేనే ఇంటికి నిర్మాణ అనుమతులు ఇవ్వాలి

- సామాజిక సేవా కార్యకర్త కోలా రవీందర్ ముదిరాజ్



**కుత్బుల్లాపూర్, జూలై 26 (నినాదం):** అబ్దుల్లాపూర్ నియోజక వర్గం సుభాష్ నగర్ డివిజన్లోని కోల రవీందర్ ముదిరాజ్ ఇంట్లో 25 సంవత్సరాల క్రితం 14 అడుగుల లోతుతో ఇంకుడు గుంత తీసి వర్షపు నీటి నిలువలను కాపాడుకుంటున్నట్లు కోల రవీందర్ ముదిరాజ్ తెలిపారు. ప్రతి సంవత్సరం మేడపై నుంచి వచ్చిన నీటిని ఇంకుడు గుంతలలో చేరేలా ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇంకుడు గుంతలలో పేరుకుపోయిన చెత్తాచెదారం ఆదివారం తొలగించి మళ్లీ ఇసుకతో నింపామన్నారు. నీటి నిల్వలు రోజురోజుకు అడుగంటి పోతున్న దృష్ట్యా ప్రతి ఇంటి నిర్మాణానికి విధిగా ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని ఇంకుడు గుంతలు లేని ఇంటి వద్ద బోర్ వేస్తే లక్ష రూపాయల జరిమానా విధించాలని ప్రభుత్వాన్ని అధికారులను కోలా రవీందర్ ముదిరాజ్ కోరారు. భవిష్యత్తు తరాల అవసరాల దృష్ట్యా నీటిని నిలువలను కాపాడుకోవాలంటే ప్రతి ఇంటికి ఇంకుడు గుంత విధిగా నిర్మించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. తన ఇంట్లో 300 అడుగులకే 15 ఏళ్ల క్రితం వేసిన బోరు ఇప్పటికీ నీరు పోస్తుందని ఎందుకు ఇంకుడు గుంతలో నిల్వ ఉన్న వర్షపు నీరే కారణమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వర్షపు నీటిని కాపాడుకోకపోతే భవిష్యత్తులో 3000 వెల,అడుగుల బోరువేసిన మూడు చుక్కల నీరు రాదే రాదేమోనని భయమేస్తుందన్నారు. కుడు గుంతలను పునరుద్ధరించాలి, కొత్బుల్లాపూర్, గాజులరామారం ,పాత సర్కిల్లో వందలాది ఇంకుడు గుంతలు గతంలో తీశారని అవి చెత్తాచెదారంతో మూసుకుపోయాయి. కొంపల్లి సర్కిల్ సూరారం కాలనీ రామ్ లీలా మైదాన్ లో కనబడుతుంది, ఎక్కడ చూసినా సిమెంట్ రోడ్లు, ఆకాశానంటే అపార్ట్మెంట్లు, భూమిలోకి నీరు పోయే అవకాశం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఉంటేనే రిజిస్ట్రేషన్,చేసే విధంగా, హెచ్ ఎం డి ఏ, వారు ఇంకుడు గుంత ఇంజక్షన్ బోర్ ఉంటేనే ఆ లే అవుట్ కు(ప్లాన్) అనుమతి ఇవ్వాలి,రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ఇంకుడు గుంతలేని వారికి ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ, రైతుబంధు ఇవ్వకూడదని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తన ఇంట్లో ఇంకుడు గుంత ఉంటేనే ప్రమోషన్ బెనిఫిట్స్ ఇవ్వాలి,ప్రతి అపార్ట్మెంట్లో వర్షం పడ్డప్పుడు నీరు బయట వస్తే జరిమానా విధించాలి. గ్రేటర్ కమ్యూనిటీలో కూడా తప్పనిసరి ఇంకుడు గుంత ఉండాలి నీరు బయట రాకూడదని కఠినమైన నిబంధనలు విధించాలని సూచించారు. పరిశ్రమల్లో తెలంగాణ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ( ఐలా),కూడా ప్రతి పరిశ్రమకు నోటీసు ఇవ్వాలి, ఇంకుడు గుంత తప్పనిసరి అని తెలియజేయాల్సిన బాధ్యత ఐలా కమిషన్ తీసుకోవాలన్నారు.

## శ్రీరాములుకు ఘన సత్కారం



**రాజేంద్రనగర్,జులై 26( నినాదం):** మణికొండ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన శ్రీరాములును నెమలిగర్ కాలనీ వాసులు, ఆదివారం ఘనంగా సత్కరించారు. మణికొండ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నెమలిగర్ కాలనీ వాసులు శ్రీరాములును శాలువా కప్పి, పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, అలాగే మాణికొండ డివిజన్ సమగ్ర అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తారని కాలనీవాసులకు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి, ప్రజలకు అందుబాటులో ఉంటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, నెమలిగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# బోనాల మహోత్సవాల్లో మేయర్

**మున్నూరు కాపు, పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు**
**రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థన**



**కరీంనగర్, జులై26(నినాదం):** కరీంనగర్ నగరంలోని చింతకుంట, రాంనగర్, కిసాన్‌నగర్, హనుమాన్‌నగర్ ప్రాంతాల్లో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో, మార్కండేయనగర్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోచమ్మ, పెద్దమ్మతల్లి బోనాల మహోత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన మేయర్, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో జీవించాలని ప్రార్థించారు. అనంతరం భక్తులతో కలిసి బోనాల ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచి ప్రజల్లో ఐక్యత, భక్తిభావాన్ని పెంపొందిస్తుందని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో కరీంనగర్ నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గాజరామ శివరాం, తెల్ల లక్ష్మీ రమేష్, బండ రమణారెడ్డి, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, గడ్డి ప్రదీప్, భారీ అపర్ణ జితేందర్, మున్నూరు కాపు సంఘం, పద్మశాలి సంఘం ప్రతినిధులు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఎలగందులను దత్తత తీసుకుని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

**రూ.25 లక్షల సీసీ రోడ్డు పనులకు శ్రీకారం.. బ్రిడ్జి, ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి పట్టాల సమస్యల పరిష్కారానికి హామీ**
**కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు**

**కరీంనగర్, జులై26(నినాదం):** ఎలగందుల గ్రామాన్ని దత్తత తీసుకుని అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన, ఎప్పటికీ పచ్చదనంతో కళకళలాడే గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు తెలిపారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సంబంధిత మంత్రులతో మాట్లాడి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆదివారం కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామంలో బీవీజీ రామ్‌జీ నిధుల ద్వారా రూ. 25 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎలగందుల బ్రిడ్జి నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ విషయమై రహదారులు, భవనాల శాఖ మంత్రి



కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఇప్పటికే చర్చించినట్లు చెప్పారు. గ్రామ చెరువు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చెరువులో పేరుకుపోయిన గ్రానైట్ ధూళి, మట్టిని తొలగించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముదిరాజ్ సోదరుల ఉపాధి అవకాశాల కల్పన కోసం సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్, మత్స్యశాఖ అధికారులతో చర్చించినట్లు వెల్లడించారు. ఎలగందుల ముంపు గ్రామం కావడంతో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేం దుకు, అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించేలా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతానని హామీ ఇచ్చారు. గ్రామానికి మరిన్ని నిధులు తీసుకొచ్చి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు. గ్రామ సర్పంచ్ నిమ్మల అంజన్న మాట్లాడుతూ, గ్రామంలోని అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని రాజేందర్‌రావును కోరారు. అలాగే రూ. 25 లక్షల సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు సమకూర్చినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, ఉపసర్పంచ్ గసికంటి కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పంజాల స్వామి, ఏఎంసీ డైరెక్టర్లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**జమ్మికుంట, జూలై 26 (నినాదం)** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలు కుటుంబాలను పరామర్శించిన హుజరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి. కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్. వీణవంక మండలంలోని ఎల్బాక గ్రామంలో పోలు శ్రీనివాస్ తండ్రి వెంకటరాజం ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఘన నివాళులు అర్పించిన కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్. ఈ కార్యక్రమంలో వంతడుపుల మాజీ సర్పంచ్ కంది దిలీప్ రెడ్డి బీఆర్ఎస్ విద్యార్థి నాయకులు జెకె జోడు కుమారస్వామి శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ సుధాకర్ రావు మాతృమూర్తి ఇటీవల మృతిచెందగా వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కల్లపల్లి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# అవోపా ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

**కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలి : అవార్డుల ప్రధానోత్సవంలో మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్**
**ప్రతిభ గల విద్యార్థులకు అవార్డులు ప్రదానం**



**జమ్మికుంట, జులై 26 (నినాదం):** ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలని అప్పుడే వారు అనుకున్న గమ్యానికి చేరుకుంటారని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ అన్నారు. ఆదివారం జమ్మికుంట పట్టణంలోని స్థానిక వర్తక సంఘ భవనంలో ఆవోప ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రతిభ పురస్కారాల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు మల్లిపెద్ది శంకర్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కొమురవెల్లి వెంకటేశం రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరబోయిన రమేష్ అతిథులుగా పాల్గొనగా జమ్మికుంట అధ్యక్షులు ఆకినపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ ఇతర పోటీ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులను అవొపా సంఘం గుర్తించి మెమెంటోలు, ప్రశంసా పత్రాలతో సత్కరించింది. అనంతరం అతిధులు మాట్లాడుతూ, చదువులో ప్రతిభను చాటిన విద్యార్థులను గుర్తించి ఆవోప ఆధ్వర్యంలో వారిని సత్కరించి సన్మానించడం వల్ల వారిలో మరింత పట్టుదల పెరుగుతుందని భవిష్యత్తులో తద్వారా చదువుపై ఆసక్తి పెరిగి ఇలాంటి అవార్డులు తీసుకోవాలని ఆలోచన వారికి వస్తుందని పేర్కొన్నారు. ఆవోప ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ అవార్డులు అందించడం జరుగుతుందని ఇది కేవలం ఆర్యవైశ్య కుల బంధువుల విద్యార్థులను ప్రోత్సహించడానికి ఒక వేదిక అని అన్నారు. సుమారు 80 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించడం అభినందించదగ్గ విషయమని ఇలాంటి కార్యక్రమానికి తమ సహాయ సహకారాలు అందించిన జమ్మికుంట ఆవోప సభ్యుల ను వారు అభినందించారు. అనంతరం జమ్మికుంట ఆవోప అధ్యక్షులు ఆకిన్నపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆవోప అధ్యక్షులు మల్లిపెద్ది శంకర్, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కొమురవెల్లి వెంకటేశం, రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరబోయిన రమేష్, సామానారాయణ, పివి రామకృష్ణ, జిల్లా బాధ్యులు ఐత సుధాకర్, మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు లెంకల్లపల్లి శరత్ కుమార్‌జమ్మికుంట అవొపా అధ్యక్షులు అకినపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నగేష్, మంచాల రాంబాబు, జోన్ ట్రెజరర్ బచ్చు రమేష్, సంఘ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## ముగిసిన సీబీఎస్‌ఈ క్లస్టర్ ఖోఖో పోటీలు

**క్రీడలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంతో పాటు ఉపాధి అవకాశాలను కూడా మెరుగుపరుస్తాయి :**
**అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి**




**కరీంనగర్, జులై26(నినాదం):** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ–టెక్నో పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహించిన సీబీఎస్‌ఈ క్లస్టర్–7 ఖో–ఖో పోటీలు ఆదివారం ఉత్సాహంగా ముగిశాయి. ముగింపు సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవిత నిర్మాణంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ఉపాధి అవకాశాలకు కూడా దోహదపడతాయని అన్నారు. క్రీడల ప్రాధాన్యాన్ని గుర్తించి అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణతో పాటు వివిధ స్థాయిల పోటీల్లో పాల్గొనే అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగిన పోటీల్లో క్రీడాకారులు అత్యుత్తమ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి టోర్నమెంట్ విజయవంతం కావడానికి సహకరించారని పేర్కొన్నారు. పాల్గొన్న అన్ని జట్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. పోటీల విజయవంతానికి కృషి చేసిన రెఫరీలు, నిర్వహణ కమిటీ సభ్యులు, శిక్షకులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, నిర్వాహకులు, విద్యార్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విజేతల వివరాలు..అండర్–14
ప్రథమ స్థానం : ఏకశిలా హై స్కూల్, వర్ధన్నపేట
ద్వితీయ స్థానం : ఢిల్లీ పబ్లిక్ స్కూల్, నాచారం
తృతీయ స్థానం : ఎస్సార్ విద్యానికేతన్, గద్వాల్
నాలుగోస్థానం :అక్షర వాగ్దేవి అంతర్జాతీయ పాఠశాల, సికింద్రాబాద్ అండర్–17
ప్రథమ స్థానం:మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, రాపాడు (అనంతపురం)
ద్వితీయ స్థానం : సూర్య అకాడమీ, బాచుపల్లి
తృతీయ స్థానం : బీవీ భువన్ రెసిడెన్సీ, తాడేపల్లిగూడెం
నాలుగో స్థానం: పల్లవి పాఠశాల, బండ్లగూడ (కీసర) అండర్–19
ప్రథమ స్థానం : శ్రీ ప్రకాష్ విద్యానికేతన్, ఆంధ్రప్రదేశ్
ద్వితీయ స్థానం : పల్లవి మోడల్ పాఠశాల, అల్వాల్
తృతీయ స్థానం : అక్షర విద్యాలయ, నెల్లూరు
నాలుగో స్థానం : హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, హనుమకొండ

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఖో–ఖో సంఘం రెఫరీల బోర్డు కన్వీనర్ వి. సూర్యప్రకాశ్, సీబీఎస్‌ఈ పరిశీలకుడు ఎం. భరత్ కుమార్, భారత మహిళా ఖో–ఖో జట్టు శిక్షకురాలు కే. నరేష్‌తో పాటు వివిధ జట్ల శిక్షకులు, నిర్వాహకులు, శారీరక విద్య ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## కమాన్‌పూర్ బాధితుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

**మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో లబ్ధిదారునికి ఆర్థిక సాయం**



**కరీంనగర్, జులై26(నినాదం):** రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ గ్రామానికి చెందిన కుంట చైతన్యకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంజాల స్వామి గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిది పేదలకు వరం లాంటిదని వైద్యం చేసుకొని పరిస్థితి లో ఉన్నా వారికీ తోడుగా ఉంటుంది అన్నారు. సిఎం సహాయనిది అందరు ఉపయోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పంజాల శ్రీనివాస్ గౌడ్, మండల కార్యదర్శి భూష సంపత్, కిసాన్ సెల్ గ్రామ శాఖ అధ్యక్షుడు భూష సంపత్, కుంట రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దశదిన కర్మలో పలువురు సర్పంచులు.



**ధర్మారం జులై 26 (నినాదం) :** మండలంలోని నర్సింహులపల్లి గ్రామ సర్పంచ్ ఆవుల మల్లయ్య మాతృమూర్తి లక్ష్మవ్వ దశదినకర్మలో ఈరోజు పలువురు గ్రామ సర్పంచులు పాల్గొని తోటి సర్పంచ్ కు మనో ధైర్యాన్ని వారి కుటుంబానికి నింపారు. చనిపోయిన లక్ష్మమ్మ కు ముగ్గురు కుమారులు, ఆవుల మల్లయ్య శంకరయ్య ఎల్లయ్య, కాగా ఆవుల మల్లయ్య జరిగిన ఎన్నికల్లో నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో బంజరు పల్లె సర్పంచ్ గంగారెడ్డి, ఎర్ర గుంటపల్లి మాజీ సర్పంచ్ కొత్త నరసింహులు కొండగట్టు మాజీ డైరెక్టర్ జక్కుల దామోదర్ రావు, మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య, వేల్పుల రేవతి నాగరాజు నందాల మల్లేశం చేపూరి లచ్చయ్య యాదవ సంఘం నాయకులు పవన్ కుమా రస్వామి లక్ష్మణ్ తదితరులు పాల్గొని, చిత్రపటానికి నివాళులర్పించారు.

## శాకంబరీ అవతారంలో చౌటపల్లి పెద్దమ్మ

**హుస్నాబాద్ జూలై 26( నినాదం):** అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామంలో శ్రీ పెద్దమ్మ తల్లి శాకంబరీ అవతార మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, పుష్పాలతో సుందరంగా అలంకరించిన అమ్మవారి దివ్య రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. శాకంబరీ దేవి ప్రకృతికి, పంటల సమృద్ధికి, అన్నపూర్ణ తత్వానికి ప్రతీకగా భావించబడుతుందని, అమ్మవారి అనుగ్రహంతో సకాలంలో వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని, గ్రామంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నెలకొనాలని భక్తులు హృదయపూర్వకంగా ప్రార్థించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ మహోత్సవం గ్రామంలో భక్తిశ్రద్ధలను మరింత పెంపొందించింది. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం కుల పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# చేవెళ్ల అంబేద్కర్ అభయహస్తం ఎక్కడ..?

**రూ.12 లక్షల హామీ ఏమైంది..? ఖర్గే, రాహుల్, రేవంత్ సమాధానం చెప్పాలి**

**జగిత్యాల ప్రతినిధి.. జూలై 26( నినాదం ) :** చేవెళ్ల ఎస్సీఎస్టీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అంబేద్కర్ అభయహస్తం హామీని వెంటనే అమలు చేయాలని, ప్రతి ఎస్సీ--ఎస్టీ కుటుంబానికి రూ. 12 లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని ఇచ్చిన ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రెండేళ్లుగా కాలయాపన చేస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన విమర్శలు గుప్పించారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల డిక్లరేషన్ సందర్భంగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దళిత కుటుంబాలకు రూ. 12 లక్షల అంబేద్కర్ అభయహస్తం అందిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీ అమలుపై ప్రభుత్వం పూర్తిగా వెనక్కి తగ్గిందని



ఆరోపించారు.

దళితుల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఎస్సీ--ఎస్టీల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. అంబేద్కర్ అభయహస్తం అమలు అయ్యే వరకు మాదిగ హక్కుల పరిరక్షణ సమితి దళితుల పక్షాన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ఆగస్టు 21న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై దళితుల హక్కుల కోసం గొంతుకలవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఎంహెచ్‌పీఎస్ నూతన జిల్లా అధ్యక్షుడిగా బొమ్మన తిరుపతి మాదిగను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ప్రకటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత బంధు పేరిట రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకానికి అంబేద్కర్ అభయహస్తం అని పేరు మార్చడం తప్ప అమలు దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఎన్నికల హామీలను నిలబెట్టుకుని ప్రతి దళిత కుటుంబానికి రూ. 12 లక్షల ఆర్థిక సాయం అందించేలా ప్రత్యేక నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. సమావేశంలో ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకె ప్రభాకర్, దొనకొండ శ్రీనివాస్, పిట్ల వెంకన్న, గుజ్జెరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం

**అందించిన ఒకటవ వార్డు కౌన్సిలర్ చెన్నబోయిన అనూష విద్యాసాగర్**
**కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన కౌన్సిలర్.. సేవాభావాన్ని కొనియాడిన స్థానికులు**

**హుస్నాబాద్, జూలై 26(నినాదం):** సేవాభావంతో ప్రజలకు అండగా నిలవడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని ఒకటవ వార్డు కౌన్సిలర్ చెన్నబోయిన అనూష విద్యాసాగర్ యాదవ్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని ఒకటవ వార్డులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మంద సదానందాన్ని పరామర్శించి, వారి కుటుంబానికి తన సొంత నిధుల నుంచి రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న కుటుంబాలకు ధైర్యం చెప్పడంతో పాటు వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని



ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా సదానందం కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, హుస్నాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వి.వి. రమణ, మహిళా నాయకురాలు బోనగిరి రజిత, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సింగరి, జాతీయ విద్యార్థి సంఘం పట్టణ అధ్యక్షుడు కూన విశ్వతేజ, ఒకటవ వార్డు యువ నాయకులు సావుల వెంకట్, సావుల మధు, కాటుకూరి రమేష్ తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి తమ సంఘీభావాన్ని తెలిపారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తున్న కౌన్సిలర్ చెన్నబోయిన అనూష విద్యాసాగర్ సేవాభావాన్ని స్థానికులు అభినందించారు.

# పీఆర్సీ, డీఏలు వెంటనే అమలు చేయాలి

**అమల్లో జాప్యం కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతాం: డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి**

**కరీంనగర్, జులై 26(నినాదం):** కరీంనగర్‌లో ఆదివారం జరిగిన డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా శాఖ సమావేశంలో పీఆర్సీ, పెం డింగ్ డీఏలు, ఆరోగ్య బీమా, విద్యా విధానాలపై పలువురు నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి అధ్య క్షతన నిర్వహించిన ఈ సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. రాజిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వి. రాజిరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో మూడు సంవత్సరాలుగా పీఆర్సీ అమలు కాకపోవడం, ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండడం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. పీఆర్సీ కమిటీ నివేదికను వెంటనే అమలు చేసి, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మరింత ఆలస్యం జరిగితే రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి మాట్లాడుతూ, మే నెల నుంచి ఆరోగ్య బీమా ప్రీమియం మినహా యింపులు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు అమలు విధివిధానాలు ప్రకటించలేదని విమర్శించారు. ఉద్యోగులకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందేలా వెంటనే మార్గదర్శకాలు విడుదల చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చకినాల రామ్‌మోహన్ మాట్లాడుతూ, ప్రాథమిక పాఠశాలలను ప్రభావితం చేస్తున్న జీవో నెం. 25ను సవరించి ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని




డిమాండ్ చేశారు. జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతి మాట్లాడుతూ, ఉపాధ్యాయ అర్హత పరీక్షలో అన్ని వర్గాలకు ఒకే విధమైన అర్హత మార్కులు నిర్ణయించాలని, అభ్యర్థులు చదివిన సంబంధిత సబ్జెక్టులోనే పరీక్ష నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రాజమౌళి, జిల్లా కమిటీ సభ్యులు టి. తిరుపతి, ఎ. శ్రీనివాస్, ఆర్. శంకరయ్య, బి. రమేష్, ఎం. సత్యనారాయణ రెడ్డి, బి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన యాదగిరి సునీల్ రావు

**ప్రధాని మోదీ సందేశాలు ప్రజలకు స్ఫూర్తిదాయ కమని వ్యాఖ్య**



**కరీంనగర్, జులై26(నినాదం):** కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యాదగిరి సునీల్ రావు ఆదివారం తన శిబిర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన 136వ 'మన్ కీ బాత్' (మనసులోని మాట) రేడియో ప్రసారాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, వివిధ రంగాల్లో భారత్ సాధిస్తున్న పురోగతిపై ప్రధాని మోదీ చేసిన ప్రసంగం స్ఫూర్తిదాయకంగా, ఆలోచన రేకెత్తించేలా ఉందని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో దేశ ప్రగతి మరింత వేగవంతమవుతుందనే సందేశాన్ని ప్రధాని స్పష్టంగా వివరించారని అన్నారు.

పద్మనాయక వెలమ సంఘం ఆధ్వర్యంలో

## సునీల్‌రావుకు ఘన సన్మానం

**ప్రజాసేవతో పాటు సామాజిక వర్గ అభివృద్ధికి కృషి చేయాలని సంఘం ఆకాంక్ష**



**కరీంనగర్, జులై26(నినాదం):** కరీంనగర్‌లోని పద్మనాయక కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన పద్మనాయక వెలమ సంఘం సర్వసభ్య సమావేశంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావును ఘనంగా సత్కరించారు. డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన సందర్భంగా సంఘం అధ్యక్షుడు హనుమంతరావు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ యాదగిరి సునీల్‌రావు ప్రజా సేవలో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలకు సేవలందిస్తూనే పద్మనాయక వెలమ సామాజిక వర్గ అభివృద్ధి, సంక్షేమానికి ప్రత్యేక కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర తొలి వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, కరీంనగర్ పాల డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు, కరీంనగర్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నమనేని సుధాకర్‌రావు, ఇటీవల ఎన్నికైన వెలమ సంఘానికి చెందిన సర్పంచులు, కార్పొరేటర్లు, జిల్లా పద్మనాయక వెలమ సంఘం సభ్యులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాహుల్‌గాంధీ నాయకత్వానికి మద్దతుగా విజయోత్సవ ర్యాలీ

- భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు

**భూపాలపల్లి, జులై 26( నినాదం):** నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడానికి దారితీసిన పోరాటంలో విద్యార్థులు,యువతకు అండగా నిలిచి కీలక పాత్ర పోషించిన గౌరవ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వానికి మద్దతుగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు జరిగిన ఈ ర్యాలీలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు




ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకేజీ మరియు అవకతవకలపై దేశవ్యాప్తంగా విద్యార్థుల తరఫున లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నిరంతరం పోరాటం చేశారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు,పరీక్షా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలనే లక్ష్యంతో చేపట్టిన ఆ ఉద్యమం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై నిరసన వ్యక్తం చేస్తూ రాహుల్ గాంధీ నిర్వహించిన ఆందోళన కార్యక్రమాల్లో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం వ్యవహరించిన తీరును ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. ఆందోళనల సందర్భంగా రాహుల్ గాంధీతో పాటు పలువురు విద్యార్థులు గాయపడినప్పటికీ వెనక్కి తగ్గకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని కొనసాగించారని, వారి పట్టుదల వల్లే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశాల్లో జవాబుదారీతనం,పారదర్శకత ఉండేలా కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు. దేశ యువత, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని,ఈ విజయోత్సవ ర్యాలీ విద్యార్థుల ఐక్యతకు, ప్రజాస్వామ్య పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బట్టు కర్ణాకర్ , స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, విద్యార్థులు మరియు అభిమానులు పాల్గొన్నారు.

## వంతెనపై భారీ గుంత..



**కాటారం, జులై 26(నినాదం):** మండలంలోని కాటారం శివారులో గల కాటారం–మంథని ప్రధాన జాతీయ రహదారి వంతెనపై భారీ గుంతలు ఏర్పడి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై తారు పూర్తిగా దెబ్బతిని కంకర తేలిపోవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వర్షపు నీరు గుంతల్లో నిల్వ ఉండటంతో వాటి లోతు అంచనా వేయలేక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ వంతెన మీదుగా ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు తెలిపారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి వంతెనపై ఏర్పడిన భారీ గుంతలను వెంటనే పూడ్చి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రైతు వేదికలో మూడు రోజుల పాటు విత్తన మేళా



**కాటారం, జులై 26( నినాదం):** మండలంలోని రైతు వేదికలో ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు ప్రత్యేక విత్తన మేళా నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి పూర్ణిమ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వరితో పాటు కంది, పెసర, మినుము, మొక్కజొన్న, కూరగాయల వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. మేళాలో నాణ్యమైన విత్తనాలతో పాటు తక్కువ నీటి యాజమాన్యం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ నిపుణులు సలహాలు అందించనున్నట్లు తెలిపారు. మండల రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్‌గా ఏపూరి రాజు



**కోదాడ,జులై 26(నినాదం):** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చేతుల మీదుగా ఏపూరి రాజు మాదిగను ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లా కన్వీనర్‌గా ప్రకటించారు. ఈ సందర్భంగా తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కోదాడ నియోజకవర్గంలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ అనుబంధ సంఘాల జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ, పట్టణ నాయకులు, కార్యకర్తలు అందించిన సహకారానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సంఘం బలోపేతం, పీడిత వర్గాల హక్కుల సాధన కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

## మిర్యాలగూడ పట్టణ, మండలాల అధ్యక్షులను ప్రకటించిన పీసీసీ చీఫ్

**మిర్యాలగూడ, జులై 26 (నినాదం ):** మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీ మిర్యాలగూడ వన్ టౌన్ టూ టౌన్, మండలాల పార్టీ, వేములపల్లి, దామరచర్ల అధ్యక్షులను ఖరారు చేస్తూ తెలంగాణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నల్గొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత తో సంప్రదించి మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని మిర్యాలగూడ వన్ టౌన్ అధ్యక్షులుగా కోడి రెక్క ఇంద్ర కుమార్, బంగారుగడ్డ 32వ వార్డు కౌన్సిలర్ టూ టౌన్ అధ్యక్షులుగా ఎండి హమీదుద్దీన్ (మోయిజ్) నియమించారు. అదేవిధంగా మిర్యాలగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా గుండు నరేందర్ గౌడ్ (మాజీ సర్పంచ్), దామరచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కుర్ర నాగు నాయక్ (మాజీ సర్పంచ్) వేములపల్లి మండల పార్టీ అధ్యక్షులుగా ఆర్ రవీందర్ రెడ్డి (మాజీ సర్పంచ్) లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. క్షేత్రస్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ఎన్నికైన అధ్యక్షులు కృషి చేయాలని కోరారు. ఎన్నికైన పట్టణ, మండల పార్టీ అధ్యక్షులను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఖమ్మానికే నీళ్లు.. కోదాడకు కరువు

- ఉమ్మడి జిల్లా రైతుల నోట్లో మట్టి కొట్టిన మంత్రి ఉత్తమ్
- సాగర్ నీటిని కోదాడ చెరువులకు విడుదల చేయాలి
- వారం రోజులలో సాగునీరు ఇవ్వకుంటే ఉద్యమమే
- గణపవరంలో రైతుల రౌండ్‌టేబుల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం

**కోదాడ రూరల్,జులై 26(నినాదం):** సాగర్ ప్రాజెక్టులో నీళ్లు డెడ్ స్టోరేజీలో ఉన్న నేపధ్యంలో ఉమ్మడి జిల్లాలో రైతులు నార్లకు నీళ్లు లేని దుస్థితిలో ఏకంగా సాగర ప్రాజెక్టు నుండి తాగునీటి అవసరం కోసం ఖమ్మం జిల్లా పాలేరుకు మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి నీటిని విడుదల చేయించి రైతుల నోట్లో మట్టి కొట్టాడని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు... ఆదివారం మండల లోని గణపవరం స్టేజి వద్ద చుట్టుపక్కల గ్రామాల రైతులు నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు... జూన్ 25న రోజుకు 4000 క్యూసెక్కుల నీటిని ఖమ్మానికి తరలిస్తుంటే మంత్రి నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తూ



రైతులను దగా చేశారని తీవ్ర స్థాయిలో విమర్శించారు.. ఇప్పటికే సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లా చెరువులకు పాలేరు లింకు ద్వారా నీళ్లు చేరుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.. అయితే ఉమ్మడి జిల్లాలో ఆయకట్టు చివర్లో ఉన్న కోదాడ లోని చెరువులకు నీటిని విడుదల చేయడంలో మంత్రి విఫలమయ్యారని విమర్శించారు.. ఖమ్మం జిల్లా మంత్రి తుమ్మలకు ఉన్న సోయి ఈయనకు లేకపోవడం మన దురదృష్టం అన్నారు..ఇది ఇలా ఉంటే ఎత్తిపోతల పథకాల పేరుతో కాంట్రాక్టులు ,కమిషన్లకే ఆయన పరిమితమయ్యారన్నారు.. ఎత్తిపోతల పథకాలు, అభివృద్ధి పనుల లో కమిషన్లు కాంట్రాక్టులపై ఉన్న మమకారం రైతులపై చూపించకపోవడం దుర్మార్గమన్నారు.... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో పాలనను గాలికొదిలేసి వేదికలపై ఉపన్యాసాలకు పరిమితమై ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక అన్ని వర్గాల ప్రజలను వంచిస్తున్నారని ధ్వజమెత్తారు..నియోజకవర్గ రైతులకు వారంలోగా తాగు, సాగునీరు అందించి చెరువులన్నింటిని నింపాలని లేదంటే ప్రజల పక్షాన తానే స్వయంగా నిరాహార దీక్ష చేపట్టడంతో పాటు రైతులు ప్రజలతో కలిసి ఉద్యమాన్ని నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఎలాంటి పోరాటానికైనా వెనుకాడబోమన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయా గ్రామాల నాయకులు పొట్ట కిరణ్ , జాబిశెట్టి చంద్రమౌళి, అంజిరెడ్డి వేలాద్రి తోపాటు వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

# వాన దేవుడా...! కరుణించవయ్యా...!!

**యాదాద్రి భువనగిరి , జులై 26(నినాదం):** భువనగిరి పట్టణంలో నీటి కరువు ముప్పు ముంచుకొస్తుంది. జూన్ లో నైరుతి రుతుపవనాలు వర్షాలు రావలసిన మాసంలో చినుకు రాలక పోవడం వలన భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటు పోతున్నా యి. ఇప్పటికే త్రాగు నీటికి కోరత ఏర్పడింది. ఆగస్టు నెల సమీపిస్తున్న జలాశయాలు అడుగంటి పోతున్నాయి. ఎలినో కరువు ప్రభావం పట్టణ ప్రజలను వెంటాడుతుంది. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో రైతులు, పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్న వేళ వాన దేవుడా.... కరుణించవయ్యా అంటూ ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు గుండెబోయిన సురేష్--ప్రియాంక యాదవ్, వార్డు అధ్యక్షుడు హరికిషన్ గౌడ్, పట్టణ



మహిళ విభాగం రత్నపురం పద్మ ఆధ్వర్యంలో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా నీటి బిందెలతో బోడురాయికి జలాభిషేకం చేశారు. అనంతరం బ్రాహ్మణవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో శివలింగానికి, అలాగే పెద్దవాడ పోచమ్మ తల్లికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి మంచి వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వర్షాభావంతో చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయని, ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. భూమాత దాహం తీరేలా, పంటలు పుష్కలంగా పండేలా ప్రకృతి అనుగ్రహం కలగాలని ఆకాంక్షిస్తూ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన అంజయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఏ. వి. కిరణ్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్, మహిళా నాయకులు, వార్డు మహిళలు, కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాలో విద్యార్థులదే విజయం

- మోడీ నిరంకుశ పాలనకు కూడా కచ్చితంగా చరమగీతం పాడుతాం
- ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ కార్యవర్గ సభ్యులు వేమన

**భూపాలపల్లి, జులై 26 ( నినాదం):** కేంద్రంలో సివిల్ కాంట్రాక్ట్ అసోసియేషన్ భవన్లో జరిగిన ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ రాజకీయ విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ కార్యవర్గ సభ్యులు వేమన గారు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఈ దేశంలో 12 ఏళ్లుగా నియంతృత్వంతో నిరంకుశంగా పాలిస్తున్న మోడీ సర్ గారికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పెద్ద చెంప పెట్టని ఈ దేశాన్ని ఉన్మాదంగా మతరాజ్యంగా తయారు చేయాలని విద్యా వ్యవస్థను నాశనం చేసేందుకు మోడీ ధర్మేంద్ర ప్రధాన్లు నిర్ణయించుకొని విద్యను నిర్వీర్యం చేయాలని ఉద్దేశంతోనే నీట్ పేపర్ లీకేజీలో ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యాన్ని కొనసాగించిందని దాని పర్యావసనం 30 మంది విద్యార్థులు మరణించారని



అంతే కాకుండా జంతర్మంతర్లో జరిగినటువంటి పార్లమెంట్ మార్చిలో అమానుషంగా పాషవికంగా వ్యవహరిస్తూ విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన దృశ్యాల్ని మేము ఇంకా మర్చిపోలేదని దానికి తగిన గుణపాఠం త్వరలోనే చెబుదామని నీట్ పేపర్ లీకేజీ పైన బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ చేసిన రాజీనామా కేవలం విద్యార్థుల పోరాట విజయమేనని ఇది ఆరంభం మాత్రమే రానున్న రోజులలో విద్యా వైద్య వ్యవస్థల్లో రాజకీయ సామాజిక ఆర్థిక అసమానతలను దూరం చేయాలని రచించబడిన రాజ్యాంగాన్ని పట్టుకొని ఈ దేశంలో నియంతృత్వ పోకడలను కొనసాగిస్తున్నటువంటి మోడీ నిరంకుశ పాలనకు త్వరలోనే చర్మ గీతం పాడేందుకు ఐసా విద్యా సంఘం జంతర్మంతర్ పోరాటానికి ఏ విధమైన కీలకపాత్రను పోషించిందో భవిష్యత్తులో దేశంలో మోడీ సర్కార్ని గద్ద దింపే దానికోసం ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ విద్యార్థి సంఘం విద్యార్థుల్ని యువకుల్ని ఆలోచించే విధంగా పోరాటాన్ని రూపొందించి దానికి చరమగీతం పాడేందుకు కీలక పాత్ర పోషిస్తుందని ఈ భూపాలపల్లి జిల్లాలో కూడా విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్న జిల్లా కమిటీకి జాతీయ కమిటీ పక్షాన అభినందనలు తెలియజేస్తున్నామని వారికి మా అండ జాతీయ కమిటీ సహకారం ఉంటుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ నిర్మాణ బాధ్యతలు మూర్తి గారు రాష్ట్ర నిర్మాణ బాధ్యతలు మామిళ్ల రమేష్ రాజా , జిల్లా నిర్మాణ బాధ్యతలు మారపల్లి మల్లేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జమ్మి అశోక్, జార్జి రెడ్డి పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్,జిల్లా కార్యదర్శి బందు సుజాత అధ్యక్షులు బుర్ర స్వాతి నాయకులు లవన్ రుద్రమరాజు విష్ణు మనోజ్ అభినయ్ రమ్య కిరణ్ మై సుస్మితా స్వరాజ్ పాల్గొన్నారు.

## పీఏసీఎస్ చైర్మన్‌కు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ స్థాయి పురస్కారం

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (నినాదం):** బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మహాముత్తారం పీఏసీఎస్ చైర్మన్ సోమ శాంత కుమార్‌కు 'బెస్ట్ సర్వీస్ సొసైటీ చైర్మన్' అవార్డు లభించింది. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా సోమ శాంత కుమార్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ ప్రతినిధులతో పాటు తెలంగాణ, గోవా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల అధ్యక్షులు, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత సోమ శాంత కుమార్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ప్రతిష్టాత్మక అవార్డుతో సత్కరించిన బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణకు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. సోమ శాంత కుమార్‌కు అవార్డు లభించడం పట్ల మహాముత్తారం మండల ప్రజలు, పీఏసీఎస్ సభ్యులు, వివిధ వర్గాల నాయకులు, ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.



## పాలేరు వెలవెల.. రైతుల్లో ఆందోళన!

**కోదాడ ప్రతినిధి (నినాదం):** ఒకప్పుడు ఏడాది పొడవునా జలకళతో కళకళలాడుతూ వేలాది ఎకరాలకు సాగునీటిని అందించిన పాలేరు వాగు.. నేడు వెలవెలబోతూ రైతుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. వాగులో నీటి ప్రవాహం కనిపించకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. వర్షాభావం, నీటి ఊటలు తగ్గిపోవడం, వాగు పరిరక్షణలో నిర్లక్ష్యం వంటి కారణాలతో పాలేరు వాగు రోజురోజుకూ తన ఉనికిని కోల్పోతుందని రైతులు వాపోతున్నారు. అనంతగిరి మండలంలోని చనుపల్లి, కిష్టాపురం, పాలవరం, గొండ్రియాల, కొత్తగూడెంతో పాటు పలు గ్రామాల పరిధిలో ప్రవహించే పాలేరు వాగు ఈ ఏడాది ఆశించిన స్థాయిలో నీటిని చూడలేకపోయింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవకపోవడం వల్ల వాగులోకి వరద నీరు రాకపోగా, గతంలో ఏడాది పొడవునా కనిపించే నీటి



ఊటలు కూడా ఇప్పుడు ఎండిపోతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో వాగు పరిసర ప్రాంతాల్లోని బోర్లు, బావుల్లో నీటి మట్టం క్రమంగా తగ్గిపోతోంది. పాలేరు వాగుపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు ఇప్పటికే వర్షాభావంతో తీవ్ర ఇబ్బందులు

వర్షాభావంతో వెలవెలబోతున్న అనంతగిరి మండలం పాలేరు వాగు దృశ్యం

తగ్గిపోయిన నీటి మట్టాన్ని పరిశీలిస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు వాగులోనూ నీరు లేకపోవడంతో వరి, మిర్చి, పత్తి, కూరగాయల సాగు ప్రశ్నార్థకంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొనగా, కొత్తగా సాగు చేయాలన్నా నీటి కొరత అడ్డంకిగా మారిందని చెబుతున్నారు. పశువులకు తాగునీరు అందించడమూ కష్టసాధ్యంగా మారిందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. స్థానికుల ఆరోపణల ప్రకారం, వాగులో అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా సహజ నీటి ఊటలు దెబ్బతిన్నాయని, దీంతో భూగర్భ జలాలు వేగంగా తగ్గుతున్నాయని అంటున్నారు. వాగు పరిరక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టాలని కోరుతున్నారు.

## అమృత్ 2.0 పనులను పరిశీలించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ, జులై 26 (నినాదం):** మిర్యాలగూడ పట్టణ ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి, ప్రతి ఇంటికి 24 గంటల పాటు నాణ్యమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేస్తున్న అమృత్ స్కీమ్ 2. 0 పనులను ఆదివారం మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్ద దేవులపల్లి వద్ద అమృత్ 2. 0 పథకం కింద నిర్మిస్తున్న నూతన పంప్ హౌస్నూతన పైప్‌లైన్ నిర్మాణ పనులనుపబ్లిక్ హెల్త్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించి, పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పాటు నిర్ణీత గడువులోపు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మిర్యాలగూడ పట్టణంలో తాగునీటి సమస్య గతంలో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని, ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అమృత్ 2. 0 పథకం పూర్తయిన అనంతరం పట్టణ ప్రజలకు నాణ్యమైన, నిరంతర తాగునీటి సరఫరా అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్‌రాజ వెంకటేశ్వర్లు , ఇతర అధికారులు, కాంట్రాక్టర్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి ప్రజాప్రతినిధులు చేనేత సంఘ కార్యవర్గాలకు సన్మానం



**కమలాపూర్,జులై 26 (నినాదం) :** మండల కేంద్రంలో కమలాపూర్ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ మధ్యకాలంలో ఎన్నిక కాబడిన కమలాపూర్, మర్రిపల్లిగూడెం, గోపాలపురం చేనేత సహకార సంఘ కార్యవర్గ సభ్యులను, మండలంలోని పద్మశాలి సర్పంచ్ లు, వార్డ్ సభ్యులను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మెజార్టీ ఓట్లు కలిగి ఉన్న పద్మశాలీలు రాజకీయరంగంలో పోరాడి ప్రజా ప్రతినిధులుగా గెలిచి సమాజానికి సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రవిందర్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం, రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యం రాజగోపాల్ ,మండల అధ్యక్షులు బొప్ప శివ శంకర్, నేతన్న టీవీ అధినేత పులి కంటి రాజేందర్,జిల్లా నాయకులు కేదాసి వెంకటేశ్వర్లు, నల్ల సత్యనారాయణ, సంక్షేమ సంఘం అధ్యక్షులు పోరండ్ల కుమారస్వామి, బైరి సహదేవ్, తుమ్మ శోభన్ బాబు, మెండు రమేష్, చేరాల రోహిత్, చేనేత సంఘ అధ్యక్షులు బైరి జనార్ధన్, పోరండ్ల రమేష్ ,మామిడాల రమేష్, సర్పంచులు మిట్టపల్లి మల్లీశ్వరి కుమార్, బూర రాధిక, తుమ్మ స్వాతి రాజేష్, మాజీ సర్పంచ్ పోరండ్ల రమేష్, ఖ్యాతం రవీందర్,మెండు రాంబాబు, చీరాల సారంగం, చేనేత సంఘం మేనేజర్ సామల దామోదర్ తుమ్మరాజు, కనుకుంట్ల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి వైద్యానికి ఆర్థికసాయం అందజేత



**హుజుర్నగర్ (మఠంపల్లి), జులై 26(నినాదం):** మానవత్వానికి మతం, కులం లేదని మరోసారి చాటి చెబుతూ సర్వ మత సామాజిక సేవ సంఘం సభ్యులు ఓ నిరుపేద కుటుంబానికి అండగా నిలిచారు. డెంగ్యూ జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి వైద్యానికి రూ. 30 వేల ఆర్థిక సహాయం అందించి తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల పరిధిలోని పెదవీడు గ్రామానికి చెందిన షేక్ ఆసిఫా వయసు (9) ఇటీవల డెంగ్యూ జ్వరానికి గురైంది. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. అయితే తీవ్ర పేదరికంలో ఉన్న కుటుంబం ఆస్పత్రి ఖర్చులు,వైద్య బిల్లులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న సర్వ మత సామాజిక సేవ సంఘం మండల అధ్యక్షుడు సయ్యద్ వహాబ్, కౌసర్ మసీదు కమిటీ మాజీ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్ ఆదివారం ఖమ్మంలోని ఆస్పత్రికి వెళ్లి చిన్నారిని పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ. 30 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. చిన్నారి త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ సమాజంలో ఆపదలో ఉన్న వారికి తోడుగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చిన్నారి ఆసిఫా భవిష్యత్తు చదువులకు కూడా సంఘం తరఫున అన్ని విధాలుగా సహకారం అందిస్తామని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. అనంతరం మాజీ చైర్మన్ మాట్లాడుతూ అవసరమైతే చిన్నారికి మరింత ఆర్థిక సహాయం కూడా అందించేందుకు సిద్ధంగా ఉంటామని తెలిపారు. సంఘం ద్వారా చేపట్టిన ఈ దాతృత్వ కార్యక్రమాన్ని గ్రామస్తులు అభినందించారు. మానవత్వంతో ముందుకొచ్చి చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు సహాయం చేయడం ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు షేక్ ఇమామ్, షేక్ జానీ భాష,ముస్లిం యూత్ కమిటీ సభ్యులు సయ్యద్ ఉమర్,సమీర్,సుభాని తదితరులు పాల్గొన్నారు.

## రైతు వేదికల్లో విత్తన మేళా..



- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి ప్రతినిధి, జులై 26(నినాదం):** రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుండి 29 వ తేదీ వరకు జిల్లాలోని 12 రైతు వేదికల్లో విత్తన మేళా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్నినో ప్రభావం వలన వర్షపాతం లోటు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం ఈ విత్తన మేళా యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. తక్కువ నీరు -- ఎక్కువ లాభం ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలని సూచించారు. రైతులు సాంప్రదాయ వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తే వర్షాభావ పరిస్థితుల్లోనూ నష్టపోకుండా ఆర్థికంగా లాభపడవచ్చని సూచించారు. మేళాలో కంది, పెసర, మినుము, మొక్కజొన్న, కూరగాయల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయదలచిన రైతులు తమ సమీప రైతు వేదికలను సందర్శించి అక్కడ అందుబాటులో ఉండే వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు సరైన విత్తనాలను పొందాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించదానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రైతులందరూ తేదీలు గుర్తుంచుకుని సమీప రైతు వేదికల్లో నిర్వహించే విత్తన మేళాలకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇట్టి కార్యక్రమాలకు ప్రజా ప్రతినిదులను ఆహ్వానించాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

**విత్తన మేళాలు నిర్వహించే రైతు వేదికలు**

భూపాలపల్లి -- పెద్దాపూర్, ఘన్‌పూర్ ఘన్‌పూర్, రేగొండ --రేగొండ, కొత్తపల్లి గోరి -- సుల్తాన్‌పూర్, చిట్యాల -- చిట్యాల, మొగుళ్ళపల్లి -- మొగుళ్ళపల్లి, టేకుమట్ల -- టేకుమట్ల, మల్హర్‌రావు -- తాడిచర్ల, కాటారం -- కాటారం, మహదేవ్‌పూర్ -- బొమ్మాపూర్, మహాముత్తారం -- బోర్లగూడెం, పలిమెల -- గ్రామ పంచాయతీ కార్యాలయం

# రైతు సంక్షేమమే ధ్యేయం

### వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



**మంచిర్యాల, జూలై 26 (నినాదం):** వ్యవసాయ రంగ అభివృద్ధిలో మార్కెట్ కమిటీల పాత్ర ఎంతో కీలకమని, రైతుల సంక్షేమమే ప్రతి ఒక్కరి లక్ష్యంగా ఉండాలని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పేర్కొన్నారు. మంచిర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మాజీ డిసిసి అధ్యక్షురాలు సురేఖతో కలిసి హాజరయ్యారు. నూతన ఛైర్మన్ రామగిరి బానేష్, వైస్ ఛైర్మన్ రాయలింగు, డైరెక్టర్లు, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధరలు పొందేలా, మార్కెట్ యార్డుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా సేవలు అందించడం మార్కెట్ కమిటీ ప్రధాన బాధ్యత అని చెప్పారు. రైతుల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పాలకవర్గం పనిచేయాలని సూచించారు. మార్కెట్ యార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీరు, విశ్రాంతి గదులు, తూకం సౌకర్యాలు, వేలం ప్రక్రియలో పారదర్శకత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రైతులు, వ్యాపారులు, అధికారులు పరస్పర సహకారంతో వ్యవసాయ మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు.రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనివ్యవసాయ మార్కెట్ కమిటీలు రైతుల ప్రయోజనాల పరిరక్షణకు వేదికలుగా నిలవాలన్నారు. రైతులకు న్యాయం జరిగేలా, పారదర్శకంగా సేవలు అందించడం ప్రతి సభ్యుడి బాధ్యత అన్నారు. మార్కెట్ యార్డుల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పారదర్శక పాలనతో రైతుల విశ్వాసాన్ని నిలబెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ మధుకర్, డిప్యూటీ మేయర్ రమ్య తదితరులు పాల్గొన్నారు

# ఐఎన్టీయూసీ నేతపై దాడి..

## కార్మిక క్షేత్రంలో కలకలం



**మంచిర్యాల, జులై 26(నినాదం):** నస్పూర్ ప్రెస్ క్లబ్ ఆవరణలో ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్ రావు ను గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడం ఆదివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. ఈ ఘటన కార్మిక క్షేత్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పట్టపగలు జరిగిన ఈ ఘటనతో కొంతసేపు ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దాడి అనంతరం స్థానికులు ఒక్కసారిగా అక్కడికి చేరుకోవడంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. నాయకుడు ప్రెస్ క్లబ్ ఆవరణలో ఉండగా కొందరు వ్యక్తులు అకస్మాత్తుగా వచ్చి ఆయనపై దాడి చేసినట్లు తెలుస్తోంది. దాడి చేసిన వ్యక్తులు ఎవరు? ఎంత మంది? వారు ఏ వాహనంలో వచ్చారు? అనే విషయాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఘటన అనంతరం బాధితుడు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. సదరు నాయకుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటనతో కార్మిక సంఘాల నాయకులు, కార్మికుల్లో తీవ్ర చర్చ సాగుతోంది. వ్యక్తిగత విభేదాలు, కార్మిక సంఘాల అంతర్గత రాజకీయాలు లేదా ఇతర కారణాల వల్ల ఈ ఘటన చోటుచేసుకుందా? అనే కోణాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఈ అంశాలపై ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక సమాచారం వెలువడ లేదు. విషయంపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులోనే వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. దాడి వెనుక అసలు కారణాలేమిటి? ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉంది? దాడి ముందస్తు ప్రణాళికతో జరిగిందా? అనే అంశాలపై విచారణ జరిగే అవకాశముంది. నస్పూర్‌లో చోటుచేసుకున్న ఈ సంఘటన ప్రస్తుతం సింగరేణి కార్మిక వర్గాల్లో, కార్మిక సంఘాల నాయకుల్లో తీవ్ర చర్చకు దారితీసింది. దర్యాప్తు పురోగతిని బట్టి మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు భావిస్తు న్నా రు. దీనిపై నస్పూర్ ఎస్సై ప్రశాంత్ ను వివరణ అడగగా ఎలాంటి కేసు నమోదు కాలేదని తెలిపారు.

## దిండ గ్రామ శివారులో 30 దూడల స్వాధీనం

### ఐదుగురిపై కేసు నమోదు



**చింతలమానేపల్లి, జూలై 26 (నినాదం ):** చింతలమానేపల్లి మండలంలోని దిండ గ్రామ శివారులో ప్రాణహిత నది ఒడ్డున అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 30 దూడలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు పోలీసులు సోదాలు నిర్వహించగా, ఎలాంటి చట్టబద్ధ పత్రాలు లేకుండా కట్టి ఉంచిన 30 దూడలు లభించాయి. వీటిలో 12 ఆడ దూడలు, 18 మగ దూడలు ఉన్నాయి. ఘటన స్థలంలో ఉన్న ఇప్ప శ్రీకాంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, వాంకిడీకి చెందిన ఖలీద్, ముక్తి యార్, మన్సూర్, మొయిన్‌లతో కలిసి మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లపై తిరుగుతున్న, రైతులచే నిర్లక్ష్యం చేయబడిన పశువులను అక్రమంగా తీసుకొచ్చినట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. రాత్రి వేళల్లో తెలంగాణలోని వివిధ ప్రాంతాల వధశాలలకు తరలించి విక్రయించి అక్రమంగా సొమ్ము చేసుకోవాలనే ఉద్దేశంతో వాటిని అక్కడ ఉంచినట్లు నిందితులు ఒప్పుకున్నారని పేర్కొన్నారు. ఈ ఘటనపై వాంకిడీకి చెందిన మన్సూర్, ముక్తియార్, ఖలీద్, మొయిన్‌తో పాటు ఇప్ప శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. పశువుల అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# సేవకు సెల్యూట్..

### పోలీస్ స్టేషన్‌కు 'నా నేస్తం' రూ.20 వేల మైక్ సెట్ విరాళం
### 13 ఏళ్లుగా 'నా నేస్తం' చారిటబుల్ ట్రస్ట్ సేవలు ఆదర్శనీయం
### ఎలిగేడు ఎస్సై మధుకర్.. ట్రస్ట్ సేవలను ప్రశంసించిన ఎస్సై



**సుల్తానాబాద్, జూలై 26 (నినాదం):** ఎలిగేడు మండలంలో గత 13 ఏళ్లుగా విద్య, వై ద్యం, సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలకు అండగా నిలుస్తున్న 'నా నేస్తం చారిటబుల్ ట్రస్ట్' సేవలను ఎలిగేడు ఎస్సై మధుకర్ ప్రశంసించారు. ఆదివారం ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా ఎలిగేడు పోలీస్ స్టేషన్‌కు రూ. 20 వేల విలువైన మైక్ సెట్ ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మధుకర్ మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రజలకు అ వగాహన కార్యక్రమాలు, అత్యవసర హెచ్చరికలు, ప్రజా సమాచారాన్ని వేగంగా చేరవేయడంలో ఈ మైక్ సెట్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. వైకుంఠరథం, బాడీ ఫ్రీజర్, ఉచిత కంప్యూటర్, డ్రైవింగ్, స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణలు, ప్రభుత్వ పాఠ శాల విద్యార్థులకు ఆర్థిక సహాయం, ఉచిత వైద్య శిబిరాలు వంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్న ట్రస్ట్ సభ్యులను ప్రత్యేకంగా అభి నందించారు. ట్రస్ట్ అధ్యక్షుడు కట్ల సత్యనారాయ ణ మాట్లాడుతూ, 1988లో పదో తరగతి పూర్తి చేసిన స్నేహితులంతా కలిసి 'నా నేస్తం చారిట బుల్ ట్రస్ట్'ను స్థాపించి విద్య, వైద్యం, సామాజిక సేవలే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. త్వరలో మండలంలోని మ హిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రా రంభించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షుడు తానిపర్తి సుధాకర్‌రావు, వెంగళదాస్ అశోక్, బూర్ల రాజేశం, రంగు వీరస్వామి గౌడ్, తీట్ల రమేష్, శ్రీనివాస్ తదితర ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# వేగంగా పూర్తి చేయండి..

### నాణ్యతే ప్రమాణం.. డబుల్ రోడ్డు పనులపై విప్ ఆదేశం
### రూ.12 కోట్ల రోడ్డు పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



**సుల్తానాబాద్, జూలై 26 (నినాదం):** రూ. 12 కోట్లతో చేపట్టిన డబుల్ రోడ్డు పనులను నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చిం తకుంట విజయ రమణారావు సూచించారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ర్యా కల్ దేవ్‌పల్లి శివాలయం నుంచి ముప్పిరితోట, ధూళికట్ట వరకు రూ. 12 కోట్ల నిధులతో చేపడుతున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమ ణరావు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించా రు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారు లను అడిగి తెలుసుకున్న ఆయన, నాణ్యత ప్ర మాణాలను పాటిస్తూ నిర్దేశిత గడువులోగా రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయా లని సూచించారు. ఈ రహదారి పూర్తయితే ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు పరిసర గ్రామాల అభివృద్ధికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో కనుకుల సింగిల్ విండో చైర్మన్ చిలుక సతీష్, గ్రామ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## ఏఐటీయూసీ మహాసభల కార్మిక ప్రదర్శనను విజయవంతం చేయాలి



**మంచిర్యాల, జూలై 26 (నినాదం):** ఏఐటీయూసీ మంచిర్యాల జిల్లా 4వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఎండీ అక్బర్ అలీ, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ఆగస్టు 2న మంచిర్యాలలో జరిగే మహాసభల సందర్భంగా ఉదయం ఐబీ చౌరస్తా నుంచి కార్మిక ప్రదర్శన నిర్వహిస్తామని, జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, ఔట్‌సోర్సింగ్ విధానాలతో కార్మిక హక్కులు దెబ్బతింటున్నాయని, వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ముస్కె సమ్మయ్య, కలిందర్ అలీ ఖాన్, కె. వీరభద్రయ్య, మిట్టపల్లి పౌలు, దాగం మల్లేష్, ఎస్‌కే బాజీ సైదా, సలేంద్ర సత్యనారాయణ, కొట్టే కిషన్‌రావు, భీమనాధుని సుదర్శన్, జాడి పోషం, దొడ్డిపట్ల రవీందర్ పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణలో బి ఎల్ ఎ-2లదే కీలక పాత్ర

### క్షేత్రస్థాయిలో సమర్థంగా పనిచేయాలి
### ఐ ఎస్ ఆర్ రాష్ట్ర కన్వీనర్ ఆంటోనీ రెడ్డి



**సుల్తానాబాద్, జూలై 26 (నినాదం):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో బీజేపీ బి ఎల్ ఎ 2లు కీలక పాత్ర పోషించాలని బీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్, ఎస్ ఐ ఆర్ రా ష్ట్ర కన్వీనర్ అంటోని రెడ్డి పిలుపునిచ్చారు. ఆ దివారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఎస్ ఆర్ గార్డెన్స్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు కందు ల శ్రీని వాస్ అధ్యక్షతన నిర్వహించిన బి ఎల్ ఎ 2లా సమావేశంలో ఆయన రాష్ట్ర నాయకులు, ఎస్ ఐ ఆర్ అసెంబ్లీ కోఆర్డినేటర్ గొట్టిముక్కుల సురేష్ రెడ్డితో కలిసి పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ, ప్రతి బూత్‌లో ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఓటరును నమోదు చేయించడం, జాబితాలోని తప్పులను సరిదిద్దిం చడం, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ క్రమశిక్షణతో పనిచేసి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయా లని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో బి ఎల్ ఎ 1 బెజ్జంకి దిలీప్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు సౌ దరి మహేందర్ యాదవ్, కాసాగోని నిర్మల, కోశాధి కారి కామని రాజేంద్రప్రసాద్, బీజేపీ మండల పదా ధికారులు, వివిధ మోర్చాల బి ఎల్ ఎ-2లు, బూ త్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 1969 తెలంగాణ ఉద్యమకారులకు

# కోదండరాం ఘన సన్మానం






**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, జూలై 26(నినాదం) :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో నిర్వహించిన తెలంగాణ ఉద్యమ కారుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తొలి విడత (1969) తెలంగాణ ఉద్యమకారులను ఘనంగా సన్మానించారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సేవలను కొనియాడుతూ వారికి శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ, 1969 ఆగస్టులో బస్సు దహనం కేసులో అరెస్టైన 16 మంది ఉద్యమకారుల్లో తొమ్మిది మంది వరంగల్ సెంట్రల్ జైలులో 29 రోజుల పాటు నిర్బంధంలో ఉన్నారని, మిగిలిన వారు సిర్పూర్ కోర్టుకు హాజరయ్యారని తెలిపారు. ప్రస్తుతం ఐదుగురి ఎఫ్ఐఆర్ కాపీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తొలి విడతతో పాటు మలి దశ తెలంగాణ ఉద్యమంలోనూ తాము చురుకుగా పాల్గొన్నప్పటికీ, గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమను అధికారికంగా తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించి తగిన గౌరవం, న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సన్మానం పొందిన వారిలో పొడిశెట్టి దేవయ్య, కురపాటి సత్యనారాయణ, శ్యాంరావు, శ్రీనివాస్, గొల్లపల్లి రమణయ్య, రాజేందర్, ఏ. సత్యనారాయణ మూర్తి, సత్యనారాయణ (బంగారు బాబు) తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పలువురు తెలంగాణ ఉద్యమకారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# వంటింటి గ్యాస్‌తో వ్యాపారం

### సబ్సిడీ గ్యాస్ దుర్వినియోగం.. ప్రభుత్వానికి గండి



**మంచిర్యాల, జూలై 26 (నినాదం):** ప్రభుత్వం సామాన్య ప్రజల వంటింటి అవసరాల కోసం రాయితీతో అందిస్తున్న గృహ వినియోగ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు జిల్లాలో వాణిజ్య అవసరాలకు విస్తృతంగా వినియోగిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, టీ దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, బేకరీలు, క్యాటరింగ్ యూనిట్లలో కమర్షియల్ సిలిండర్ల స్థానంలో డొమెస్టిక్ సిలిండర్లే వినియోగిస్తున్న దృశ్యాలు సాధారణమవుతున్నా యని స్థానికులు చెబుతున్నారు. పేద కుటుంబాల కోసం ప్రభుత్వం అందించే రాయితీని కొందరు వ్యాపారులు లాభాల కోసం దుర్వినియోగం చేయడం సామాజికంగా కూడా ప్రశ్నార్థకంగా మారింది. ఒకవైపు సామాన్య కుటుంబాలు గ్యాస్ ధరల భారంతో ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు అదే రాయితీ సిలిండర్లతో కొందరు వ్యాపారులు రోజుకు వందలాది మంది కస్టమర్లకు వంటలు చేస్తూ లాభాలు ఆర్జించడం ప్రజల్లో అసంతృప్తికి దారితీస్తోంది. ఇది కేవలం నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాకుండా, ప్రభుత్వ సంక్షేమ పథకాల అసలు ఉద్దేశాన్నే దెబ్బతీసే చర్యగా పలువురు అభిప్రాయపడుతు న్నారు.

**రాయితీ పేదల కోసం..లాభాలు వ్యాపారులకా..**

గృహ వినియోగ సిలిండర్లపై ప్రభుత్వం అందించే రాయితీ సాధారణ కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గించడానికే. అయితే అదే సిలిండర్లను వ్యాపార అవసరాలకు వినియోగించడం వల్ల నిజమైన లబ్ధిదారులకు అందాల్సిన ప్రయోజనం దారి మళ్లుతోంది. చౌక ధరకు సిలిండర్ పొందిన కొందరు దానిని హోటళ్లలో ఉపయోగించడం ద్వారా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**హోటళ్లలో డొమెస్టిక్ సిలిండర్ల జోరు**

జిల్లాలోని పలు చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, టీ స్టాళ్లు, ఫాస్ట్‌ఫుడ్ దుకాణాల్లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు కనిపించాల్సిన చోట డొమెస్టిక్ సిలిండర్లే కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. కొన్ని చోట్ల ఒకటి కాదు, రెండు మూడు గృహ సిలిండర్లను మారుస్తూ రోజంతా వంటలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. కమర్షియల్ సిలిండర్ ధర ఎక్కువగా ఉండటంతో వ్యాపారులు ఖర్చు తగ్గించుకునేందుకు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నట్లు తెలుస్తోంది.

**తనిఖీలు లేకపోవడంతో యథేచ్ఛ**

సంబంధిత అధికారులు, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు తరచూ తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, చాలా ప్రాంతాల్లో పర్యవేక్షణ కనిపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అప్పుడప్పుడు దాడులు జరిగినా అవి ఒకటి రెండు రోజులకు మాత్రమే పరిమితమవుతున్నాయని, తర్వాత మళ్లీ అదే పరిస్థితి కొనసాగుతోందని ప్రజలు చెబుతున్నారు. నిరంతర పర్యవేక్షణ లేకపోవడమే అక్రమాలకు ప్రధాన కారణమని అభిప్రాయపడుతున్నారు.

**మానవ ప్రాణాలపై ముప్పు**

వాణిజ్య అవసరాలకు గంటల తరబడి గృహ సిలిండర్లను వినియోగించడం వల్ల లీకేజీలు, అగ్నిప్రమాదాలు జరిగే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చిన్న గదుల్లో నడిచే హోటళ్లు, టీ స్టాళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోతే చిన్న పొరపాటు కూడా భారీ ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఇలాంటి ప్రాంతాల్లో వంట చేసే కార్మికులు, ఆహారం తీసుకునేందుకు వచ్చే వినియోగదారు లు, చుట్టుపక్కల దుకాణాల వారు, పాదచారులు కూడా ప్రమాద బారిన పడే అవకాశముంది. ఒక వ్యాపారి నిబంధనలను ఉల్లంఘించడం వల్ల అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడటం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**ప్రభుత్వానికి భారీ ఆదాయ నష్టం..**

కమర్షియల్ సిలిండర్లు వినియోగించాల్సిన చోట డొమెస్టిక్ సిలిండర్లు వాడటం వల్ల ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయ నష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వం పేద కుటుంబాల కోసం ఇచ్చే రాయితీని వ్యాపార అవసరాలకు మళ్లించడం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని అధికారులు చెబుతున్నారు. ఈ అక్రమాలు కొనసాగితే ప్రభుత్వంపై అదనపు భారం పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

**నిజాయితీగా నిబంధనలు పాటించే వ్యాపారులకు అన్యాయం**

కమర్షియల్ సిలిండర్లు కొనుగోలు చేసి నిబంధనల ప్రకారం వ్యాపారం నిర్వహిస్తున్న హోటల్ యజమానులు అధిక వ్యయం భరిస్తుంటే, డొమెస్టిక్ సిలిండర్లతో ఖర్చు తగ్గించుకునే వారు అన్యాయంగా లాభపడుతున్నారని వ్యాపార వర్గాలు అంటున్నాయి. దీంతో నిబంధనలు పాటించే వారికి పోటీ పరంగా నష్టం కలుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలి..**

జిల్లాలోని హోటళ్ళు, రెస్టారెంట్ లు, దుకాణాలు, టిఫిన్ సెంటర్లు, క్యాటరింగ్ యూనిట్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమంగా గృహ సిలిండర్లను వినియోగిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి భారీ జరిమానాలు విధించాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకసారి చర్యలు తీసుకోవడం కాకుండా నిరంతర పర్యవేక్షణతోనే ఈ అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని అభిప్రాయపడుతున్నారు.

# లింగాపూర్‌లో కాంగ్రెస్‌కు షాక్..

### బీఆర్ఎస్‌లోకి నాయకుల చేరిక



**మంచిర్యాల, జూలై 26 (నినాదం):** తెలంగాణలో రాబోయేది బీఆర్ఎస్ సర్కార్ అని మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు పేర్కొన్నారు. ఆదివారం దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కీలక నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు నివాసంలో జరిగిన కార్యక్రమంలో దండేపల్లి మండల పార్టీ అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఉపసర్పంచ్ నారాయణ నాయక్‌తో పాటు దశరథ్ నాయక్, తీగల చంద్రయ్య, ఎం.డి. జలీల్ ఖాన్, దండుగుల గంగరాజు తదితరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా దివాకర్ రావు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే బీఆర్ఎస్ పార్టీ ప్రధాన లక్ష్యమని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పార్టీ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ విధానాలు, నాయకత్వంపై విశ్వాసంతోనే వివిధ పార్టీలకు చెందిన నాయకులు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని చెప్పారు. కొత్తగా పార్టీలో చేరిన నాయకులు గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పార్టీలో చేరిన నాయ కులు మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని, గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బచ్చల అంజన్న, రేణీ శ్రీనివాస్, ఇస్లావత్ రాజు, వేల్పుల రమేష్ తదితరులు పాల్గొన్నారు. చేరికలతో దండేపల్లి మండలంలో బీఆర్ఎస్ పార్టీకి మరింత బలం చేకూరుతుందని నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# వీర జవాన్ల త్యాగం దేశానికి స్ఫూర్తి : ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



**మంచిర్యాల, జూలై 26 (నినాదం):** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బెల్లంపల్లి చౌరస్తా వద్ద కార్గిల్ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించి వీర జవాన్ల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు ప్రదర్శించిన అసాధారణ శౌర్యం, త్యాగం, దేశభక్తి ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన కార్గిల్ అమరవీరులకు యావత్ దేశం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేయర్ ధర్ని మధుకర్, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

# దివ్యాంగులను సమానత్వంతో చూడాలి

**దివ్యాంగులకు నియో ఫ్లై బోల్ట్ పవర్ వీల్‌చైర్ల పంపిణీ**

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**




**జగిత్యాల ప్రతినిధి జులై 26 నినాదం :** దివ్యాంగులను సమాజంలో సానుభూతితో కాకుండా సమానత్వ దృక్పథంతో చూడాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. దివ్యాంగులకు చేయూత ఇచ్చే కార్యక్రమంలో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడ మహమూద్ ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో హ్యుందాయ్ మొబిస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన (యాక్సెసిబిలిటీ అండ్ ఫ్రీడమ్) కార్యక్రమంలో దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, దివ్యాంగులు, వృద్ధులు ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 90 మంది దివ్యాంగులకు నియో ఫ్లై బోల్ట్ పవర్ వీల్‌చైర్లన్లు ఈసందర్భంగా హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం, సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది అన్నారు. ప్రభుత్వంతో పాటు కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతలో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మానవతా దృక్పథంతో కాకుండా సమానత్వ దృక్పథంతో చూడాలని మంత్రి అడ్లూరి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ చిన్న శ్రీశైలం యాదవ్, జాతీయ దివ్యాంగుల హక్కుల సంఘం అధ్యక్షులు తుడుం రాజేందర్, దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షఫీ అహ్మద్ ఖాన్, ప్రభాంజాన, CSR జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# రేవల్లిలో వెలగని ఆకాశదీపాలు..

## చీకట్లో ప్రజల ఇబ్బందులు

**రేవల్లి జులై 26 (నినాదం):** మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆకాశదీపాలు (హైమాస్ట్ లైట్లు) కొంతకాలంగా వెలగకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో చీకట్లు అలుముకోవడంతో ప్రయాణికులు, వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం తర్వాత వెలగాల్సిన ఆకాశదీపాలు పనిచేయకపోవడంతో ప్రజలు సెల్‌ఫోన్ టార్చ్‌ల వెలుతురులోనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాత్రి సమయంలో చీకటి కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, వృద్ధులు అత్యవసర పనుల కోసం బయటకు రావాలంటే భయాందోళనకు గురవుతున్నారని చెబుతున్నారు. చీకటిని ఆసరాగా చేసుకుని సంఘవ్యతిరేక కార్యకలాపాలు జరిగే ప్రమాదం కూడా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజల సౌకర్యం కోసం లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆకాశదీపాలు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయని స్థానికులు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి విద్యుత్ సమస్యలు, సాంకేతిక లోపాలను సరిచేయాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి వెలగని ఆకాశదీపాలను మరమ్మతు చేసి తిరిగి వెలిగేలా చర్యలు చేపట్టాలని, మండల కేంద్రంలో రాత్రివేళ ప్రజలకు భద్రతతో కూడిన వాతావరణం కల్పించాలని రేవల్లి ప్రజలు కోరుతున్నారు.



# ఉచిత హెల్త్ క్యాంపు రక్త దాన శిబిరన్ని ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరావు

**జక్కంపూడి క్రిష్ణమూర్తి దంపతులకి పూల మాల వేసి నివాళులు హర్పించిన తుమ్మల**

**జక్కంపూడి క్రిష్ణమూర్తి ఆశయాలకు అనుగుణంగా యూవత ముందుకు వెళ్ళాలి**





**తల్లాడ, జూలై 26(నినాదం) :** తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామం లో పుట్టిన దివంగత నేత జక్కంపూడి క్రిష్ణ మూర్తి స్వయన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల ప్రధాన అనుచరుడు గా ఉండే వాడు, నాలుగు దశబ్దల రాజకీయ చరిత్ర లో చివరి శ్వాస ఉన్న వరకు మంత్రి తుమ్మల తోనే ఉన్నారు, ఐతే జిల్లా లో జక్కంపూడి కి ఇచ్చిన ప్రాధాన్యత వేరే ఇంకా ఏ నాయకుడు కి ఇవ్వలేదు అనేది అక్షర సత్యం ఐతే విధి వక్రీకరించి అనారోగ్యం తో జక్కంపూడి క్రిష్ణ మూర్తి చనిపోవడం వల్ల మంత్రి తుమ్మల కి రాజకీయం గా జీవితంలో కోలుకోలేని దెబ్బ, మంత్రి హోదా లో ఉన్న ఎంత పనిలో ఉన్న జక్కంపూడి కుటుంబం లో కార్యక్రమం అంటే హుట హుటిన వచ్చేస్తాడు తుమ్మల,ఐతే మిత్రుడు ది ద్వితీయ వర్ధంతి సందర్బంగా బిల్లుపాడు కి ఆదివారం విచ్చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల జక్కంపూడి క్రిష్ణ మూర్తి, ప్రేమలత దంపతుల విగ్రహానికి పూల మాల వేసి నివాళులు హర్పించారు. అనంతరం ఉచిత హెల్త్ క్యాంపు కార్యాలయం రక్త దాన శిబిరం ను ప్రారంభించారు. ఈ హెల్త్ క్యాంపు కి 500పైన జనాభా వచ్చి చూపించుకున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల మాట్లాడుతూ .. నా మిత్రుడు ప్రధాన అనుచరుడు జక్కంపూడి క్రిష్ణ మూర్తి లేని లోటు చాలా బాధకరం ఈ గ్రామం నేను వచ్చినప్పుడు ఆల్లా చాలా బాధ తో వస్తున్న, మీరు ఎంత మంచి పోగ్రామ్ చేసిన నేను ఆనందం తో రావడం లేదు నా మిత్రుడు జక్కంపూడి లేడు కాబట్టి నేను ఈ గ్రామం వచ్చినప్పుడు అల్లా బాధ తో వస్తున్న అని అన్నారు. వర్ధంతి సందర్బంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత హెల్త్ క్యాంపు, రక్త దాన శిబిరం ఏర్పాటు చేయడం చాలా మంచి కార్యక్రమం నిర్వహిస్తున్నా రు అని జక్కంపూడి అభిమానులని అభినందించా రు. గతం లో జిల్లా మంత్రి గా ఉన్నప్పుడు నా మిత్రు డు కృష్ణమూర్తి తల్లాడ మండలానికి ఇది కావాలి అది కావాలి అని నిధులు తెచ్చుకొని అభివృద్ధి చేసాడు అని మంత్రి తుమ్మల గుర్తు చేశారు. ఆయన ఆశ యాలను నేటి తరం యూవత ముందుకు తీసుకొని వెళ్ళాలి అని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైతులను ఆదుకునే అందుకు సీతారామ ప్రాజెక్టు కెనాల్ ద్వారా సాగు నీరు త్రాగు నీరు రైతులకు అందించడం జరుగుతుంది అని అన్నారు. ప్రస్తుత పరిస్థితులల్లో జిల్లాలో మూడు లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయి అని అన్నారు. ఏల్ ని నో ప్రభావం వల్ల రాష్టంలో కరవు వచ్చే పరిస్థితులు నెలకొనున్నాయి. వర్షబావ పరిస్థితులని బట్టి రైతులు ఆరు తడి పంటలను సాగు చేసుకోవాలి. రైతులు అందరూ వరి వేసి నష్ట పోవద్దు అని అన్నారు. ప్రస్తుతం త్రాగు నీటి కోసం గోదావరి జాలాలతో ప్రాజెక్టులు చెరువులు నింపుతున్నాం. మెట్ట పంటలైన పప్పు దినుసులు చిరుధాన్యాలు పంటలు సాగు చేసుకోవాలి. వర్షా బావ పరిస్థితుల దృశ్య అవకాశం ఉన్న రైతులు పామాయిల్ పంటను సాగు చేసుకోవాలి. పామాయిల్ పంట రైతులకు ఎంతో లాభదాయకమని అన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మరెడ్డి,మండల కాంగ్రెస్ నాయకుడు జక్కంపూడి కిషోర్, బిల్లుపాడు సర్పంచ్ ఏనిక. క్రిష్ణ వేణి, సర్పంచ్లు తోట రామారావు,కటికి. కిరణ్ కుమార్, గుర్రం. శ్రీనివాస రావు, దీవెల. వెంకటేశ్వర రావు, పోట్రూ స్వప్న, శరత్ బాబు,ఉపసర్పంచ్ లు రుద్రాక్ష రామక్రిష్ణ చారి, నునవత్ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ వేమిరెడ్డి క్రిష్ణ రెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దుండేటి వీర రెడ్డి, సోసైటీ చైర్మన్ తూము. వీరభద్ర రావు, మాజీ ఎంపీటీసీ కొమ్మినేని. ప్రభాకర్ రావు, కాంగ్రెస్ మండల నాయకులు గణేషుల రవి, తుమ్మలపల్లి రమేష్,రేగళ్ల రామారావు, సామినేని రామ అప్పారావు, మాజీ జడ్పీటీసీ ముకర ప్రసాద్,గోవింద్. శ్రీనివాస రావు,సరికొండ అప్పలరాజు,తదితరులు పాల్గొన్నారు.

# అంగుళం సుద్దముక్కపై కార్గిల్ వీర జవాన్ ప్రతిమ

**కోదాడ,జూలై 26(నినాదం):** కోదాడకు చెందిన సూక్ష్మ కళాకారు డు వేగ్గలం నరేష్ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అంగుళం సుద్దముక్కపై వీర జవాన్ ప్రతిమను చెక్కి తన కళా ప్రతిభను చాటుకున్నా రు. కార్గిల్ అమరవీరులకు నివాళిగా రూపొందించిన ఈ సూక్ష్మ శిల్పం అందరినీ ఆకట్టుకుంటోంది. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల త్యాగాలను భావితరాలు స్మరించుకోవాలనే ఉద్దేశంతో ఈ కళాఖండాన్ని రూపొందించినట్లు నరేష్ తెలిపారు.



# సీఎం రేవంత్ రెడ్డి చంద్రబాబుకు తాబేదారుగా మారాడు

## మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి ప్రతినిధి, జులై 26 (నినాదం) :** సీఎం రేవంత్ రెడ్డి చంద్రబాబు కు తాబేదారుగా మారాడని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాల మోటర్లు ఆన్ చేసి రైతాంగానికి సాగునీరు అందించాలని కోరుతూ ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కన్నెపల్లి మోటార్లు స్టార్ట్ చేయాలని, పాలమూరు ఎత్తిపోతల మోటార్లు మొదలు పెట్టాలని కోరారు. రాజకీయాలు మాని రైతాంగానికి సాగు నీరు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సమైక్య వాది అని, ఆయనకు తెలంగాణ ప్రయోజనాలు పట్టవని అన్నారు. సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి తెలంగాణ ప్రజల ఆకలి, ఆకాంక్షల మీద సోయి లేదని, కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల నుండి మోటార్లు ఆన్ చేసి రైతాంగానికి నీళ్లు ఇవ్వాలని చెప్పారు. ఎత్తిపోతల పథకాల కింద ఉన్న అన్ని చెరువులు, కుంటలకు నీళ్లు నింపాలని, ఎల్ నినో నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పైనుండి వస్తున్న వరద ప్రవాహం ఒడిసిపట్టాలని సూచించారు. ఈ సర్కారుకు ఆ సోయి ఉందన్న దాఖలాలు కనిపించడం లేదని అన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రైతాంగం కన్నెర్ర చేస్తుందని, కుంటి సాకులతో రైతుల పొలాలు ఎండబెట్టొద్దని నిరంజన్ రెడ్డి హితవు పలికారు

# ఆదర్శ స్కూల్ చైర్మన్‌కు జాతీయ అవార్డు

**జనగామ కరుణాకర్ రావుకు అరుదైన గౌరవం**

**సామాజిక, విద్యరంగాల్లో అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపు**

**భూపాలపల్లి ప్రతినిధి/ కాటారం( నినాదం):** కాటారం మండల కేంద్రంలోని ఆదర్శ హై స్కూల్ చైర్మన్ జనగామ కర్ణాకర్ రావుకు అరుదైన గౌరవం దక్కింది. సామాజిక, విద్యారంగాల్లో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా కాటారంలోని ఆదర్శ హైస్కూల్ వ్యవస్థాపకులు, చైర్మన్ , రిటైర్డ్ టీచర్ జనగామ కరుణాకర్ రావు ప్రతిష్ఠాత్మక బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డు--2026ను అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్ఏ) ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 19వ వెస్ట్రన్ ఇండియా బహుజన రైటర్స్ కాన్ఫరెన్స్ సందర్భంగా కరుణాకర్ రావు కు ఈ అవార్డుతో పాటు సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ప్రదానం చేశారు. సామాజిక సేవతో పాటు సాహిత్యం, కళలు తదితర రంగాల ద్వారా అణగారిన వర్గాల అభ్యున్నతికి అందించిన సేవలు, అంకితభావం, కృషిని గుర్తిస్తూ ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ప్రశంసాపత్రంలో పేర్కొన్నారు.



ఆర్టీఐ చైర్మన్ భూపాల్, బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డా. యు. సుబ్రమన్యం ధ్రువీకరించిన ప్రశంసాపత్రాన్ని ఆయనకు అందజేశారు. కరుణాకర్ రావు జాతీయ స్థాయి పురస్కారం అందుకోవడం పట్ల పలువురు విద్యావేత్తలు, సామాజిక సేవకులు, స్నేహితులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ పురస్కారం ఆయన సామాజిక సేవకు మరింత ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు.

NINADAM CINEMA

# మెగాస్టార్ బర్త్ డే కానుకగా 'మెగా-158' నుంచి బిగ్ అప్డేట్.!




మెగాస్టార్ చిరంజీవి వరుస భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా గడుపుతున్నా రు. వయసుతో సంబంధం లేకుండా బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ అభిమానులను అలరించడంతో పాటు యంగ్ హీరోలకు పోటీగా నిలు స్తున్నారు. ఆయన హీరోగా నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'విశ్వంభర' విడుదల కాకముందే.. టాలెంటెడ్ డైరెక్టర్ బాబీ కొల్లి దర్శకత్వంలో మరో భారీ చిత్రాన్ని లైన్‌లో పెట్టిన సంగతి తెలిసిందే. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూ ళ్లతో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. మళ్లీ వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ గ్యాంగ్‌స్టర్ మూవీపై భారీ అంచనాలు భారీగా నెలకొన్నాయి. 'మెగా-158' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అత్యంత ఘనంగా నిర్మిస్తున్నారు. యాక్షన్ అండ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా రాబోతున్న ఈ చిత్రంలో కోలీవుడ్ సీనియర్ నటుడు శరత్ కుమార్ విలన్‌గా నటిస్తుండగా, కమెడియన్ డాక్టర్ భద్రం కీలక పాత్రలో కనిపించబోతున్నారు. అయితే ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే శరవేగంగా జరుగుతున్నప్పటికీ, మేకర్స్ నుంచి ఎలాంటి అధికారిక పోస్టర్ లేదా అప్‌డేట్ రాలేదు. దీంతో ఈ క్రేజీ ప్రాజెక్ట్ నుంచి అప్‌డేట్స్ ఎప్పుడెప్పుడు వస్తాయా అని మెగా అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో మెగా ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించే ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. వచ్చే నెల ఆగస్ట్ 22న మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భం గా ఈ సినిమాకు సంబంధించిన ఒక పవర్ ఫుల్ గ్లింప్స్‌ను విడుదల చేయడానికి చిత్ర బృందం ప్లాన్ చేస్తోందని టాక్.


# కిల్లింగ్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కట్టిపడేస్తున్న అవికా గోర్



సీరియల్స్ ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకుని, ఆ తర్వాత సినిమాల్లోనూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నటీమణుల్లో అవికా గోర్ ఒకరు. కొంతకాలం క్రితం ఆమె నటించిన 'అగ్లీ స్టోరీ' చిత్రంలో నటనకు ప్రశంసలు దక్కినా, ఆశించిన స్థాయిలో విజయం మాత్రం అందుకోలేకపోయింది. ఇటీవల సినిమాల్లో అవకాశాలు తగ్గడంతో మళ్లీ బుల్లితెరపై దృష్టి సారిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సినిమాల్లో తన అందం, అభినయంతో ఆకట్టుకునే అవికా గోర్ సోషల్ మీడియాలోనూ అదే జోరును కొనసాగిస్తోంది. తరచూ గ్లామరస్ ఫోటోషూట్లతో అభిమానులను అలరిస్తూ వార్తల్లో నిలుస్తోంది. తాజాగా ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ ఫోటోల్లో అవికా లైట్ పింక్ కలర్ పొడవాటి స్లీవ్‌లెస్ గౌన్‌లో ఎంతో ఎలిగెంట్‌గా కనిపించింది. చేతిలో పూల గుత్తిని పట్టుకుని, విభిన్న భంగిమల్లో కెమెరాకు పోజులిచ్చింది. కురులను సగం ముందుకు, సగం వెనక్కి వదిలి, చేతులకు గాజులు ధరించి కొంటె చూపులతో అభిమానులను కట్టిపడేసింది. మొత్తంగా ఈ ఫోటోషూట్‌లో అవికా గోర్ అందం, స్టైల్, ఎక్స్‌ప్రెషన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీంతో ఆమె తాజా ఫోటోలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతూ నెటిజన్ల నుంచి ప్రశంసలు అందుకుంటున్నాయి.

## ఐకానిక్ థ్రిల్లర్ సీక్వెల్‌లోకి యామీ గౌతమ్ ఎంట్రీ..

**'కహానీ-3'లో పవర్ ఫుల్ రోల్!**



బాలీవుడ్ స్టార్ బ్యూటీ యామీ గౌతమ్ వరుస హిట్లతో దూసుకుపోతు న్నారు. ఇటీవల 'ఆర్టికల్ 370' చిత్రంలో ఆమె చూపించిన పవర్ ఫుల్ పర్ఫార్మెన్స్‌కు ఏకంగా నేషనల్ అవార్డ్ లభించడం విశేషం. ఇక గత ఏడాది యామీ ప్రధాన పాత్రలో నటించిన 'హక్' మూవీ విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకోవడమే కాకుండా, బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించింది. ప్రస్తుతం కథా బలమున్న పాత్రలను ఎంచుకుంటూ, సినిమాను తన భుజాలపై నడిపించే సత్తా ఉన్న అరుదైన హీరోయిన్లలో ఒకరిగా నిలిచిన యామీ గౌతమ్ ఖాతాలో మరొక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ చేరినట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. బాలీవుడ్ ఐకానిక్ సస్పెన్స్ థ్రిల్లర్ 'కహానీ' ఫ్రాంచైజ్‌కి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. గతంలో విద్యా బాలన్ నటించిన ఈ సిరీస్‌కు సీక్వెల్‌గా రాబోతున్న 'కహానీ 3'లో హీరోయిన్‌గా యమీ గౌతమ్‌ను మేకర్స్ ఎంపిక చేసుకున్నట్లు టాక్. అయితే మొదటి రెండు భాగాలకు దర్శకత్వం వహించిన మాస్టర్ మైండ్ డైరెక్టర్ సుజోయ్ ఘోష్‌యే ఈ ఐకానిక్ థ్రిల్లర్‌ను తెరకెక్కిస్తున్నారు. యామీ గౌతమ్ పవర్ ఫుల్ నటన, సుజోయ్ ఘోష్ మార్క్ మేకింగ్ కలిపి ప్రేక్షకులకు సరికొత్త థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. సరికొత్త కథతో 'కహానీ - 3' ఇది పాత కథకు కొనసాగింపు కాకుండా, కేవలం ఆ థ్రిల్లింగ్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతోంది. ఇందులో యమీ గౌతమ్ పవర్ ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. దీనికి సంబంధించిన షూటింగ్ కూడా త్వరలోనే ప్రారంభించనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

## ఇతరులను చూసి నన్ను నేను మార్చుకోలేదు..

**అందుకే ఈ స్థాయికి వచ్చా: రష్మిక మందన్న**




స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ఎన్నో హిట్ చిత్రాల తో నేషనల్ క్రష్‌గా మారిపోయారు. ప్రస్తుతం వరుస ప్రాజెక్ట్స్ చేస్తూ ఫుల్ బిజీ బిజీ అయిపోయారు. లేడీ ఓరియెంటెడ్ మూవీ 'మైసా' ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఈ సినిమా కోసం ఎంతో కష్టపడుతున్నారు. ఎలాంటి డూప్ లేకుండా స్వయంగా రిస్కీ స్టంట్స్ చేస్తున్నారు. 'మైసా'లో అండర్ వాటర్‌లో బిగ్ అడ్వెంచర్ చేశారు. ఇప్పటివరకూ ఇండియన్ సినీ చరిత్రలో చూడని ఓ బిగ్ సీక్వెన్స్ చేసి రికార్డ్ క్రియేట్ చేశారు. గోండ్ తెగ, సంస్కృతి నేపథ్యంతోపాటు వారికి అండగా ఉండే ఓ వారియర్ పాత్రలో గోండు మహిళగా రష్మిక ఇందులో కనిపించబోతున్నారు. రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ బిజీగా ఉన్న రష్మిక తాజాగా, ఓ ఇంటర్వ్యూలో భాగంగా సినీ ఇండస్ట్రీలో అందరూ వెళ్లే దారిలోనే తాను వెళ్లలేదని.. ఎప్పుడూ తన మనసుకు నచ్చినట్లే నడుచుకున్నానని చెప్పారు. అదే తన విజయంలో అతిపెద్ద కారణమని వెల్లడించారు. హిందీ సినీ పరిశ్రమలోకి అడుగు పెడుతున్న సమయంలో అందరిలా ఒకే తరహా దారిలో వెళ్లకుండా, తన అంతరాత్మ చెప్పిన మాటే విన్నానని అందుకే ఈ స్థాయిలో ఉన్నానని రష్మిక అన్నారు. మొదట్లో ఈ నిర్ణయం కాస్త భయాన్ని కలిగించినప్పటికీ, చివరికి అదే ఇండస్ట్రీలో ఒక ప్రత్యేకమైన ఐడెంటిటీని తెచ్చి పెట్టిందని చెప్పారు. ఇతరులను అనుకరించడం లేదా పక్కవారి మెప్పు కోసం జీవించడం కాకుండా.. ఎవరికి వారు తమ స్వభావాన్ని, వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడమే నిజమైన విజయమని అభిమానులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అభిమానులకు స్ఫూర్తినిచ్చే సందేశాన్ని ఇస్తూ.. ఎవరినీ చూసి కాపీ కొట్టాల్సిన అవసరం లేదు. పక్కవారి మెప్పు కోసం లేదా ప్రశంసల కోసం మిమ్మల్ని మీరు మార్చుకోకండి. మనం ఎలా ఉన్నామో అలాగే నిజాయితీగా ఉండటంలోనే మన అసలైన విలువ ఉంటుంది. మన వ్యక్తిత్వమే మనకు అతిపెద్ద బలం అని స్పష్టం చేశారు.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)Published at 6-3-439, kisannagar, Karimnagar-505001 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787